శ్రీ కృష్ణ ... శాస్త్రి గారికి
సప్రేమ సమర్పణ.
వ॥ బ్రహ్మల రా..
11-12-68

శ్రీగురుభ్యోనమః.

శ్రీ గణేశాయనమః

శ్రీగౌరీనాగేశ్వరాయనమః

శ్రీశివమహిమ్నస్తోత్రవిజ్ఞానము.

శా॥ శ్రీనాకాదిజగద్విలాసచయసృష్టి స్నేర్పుమైజేసి భ
క్తానూనాభిరుచిప్రకల్పిత విచిత్రాకారనామంబులన్
ధ్యానార్చారతికై వహించి నిజభక్తౌఘంబు బోల్పించు గౌ ౧
రీనాగేశ్వరుడస్మదర్చనల సంప్రీతి న్విలోకించుతన్॥

చ॥ వెలయు బవిత్ర వింధ్యపృథివీధర పూర్వదిశానురాగసం
కలితవిహార సాధుగణగణ్యతపోవన తారహారయ
త్యలఘువిశుద్ధవంశజనితామలతోయవిహార వంశధా
రలలితపూర్వదిగ్జలధిరాట్కరలాలితసుప్రచారయై॥ ౨

ఉ॥ అన్నదితీరమందొకవనాంతరసీమ శివుండు భక్తిసం
పన్న కిరాతదంపతులపట్టున శ్రీముఖలింగపుణ్యనా
మోన్నతిదాల్చి యొక్క మధుకోత్తమమూలమునందునిల్చి యే
యన్నవలేక వారిని దయామతినోముట సుప్రసిద్ధమే॥ 3

ఉ॥ ఈ యఖిలేశుడిట్లవతరించిన క్షేత్రముచెంత దేశమం
దాయతశీలసంపదలనం దినరావి కులంబు వైదిక
శ్రీయుతమయ్యెనం దిపుడు స్నేహితుడయ్యెను నాకు సత్యనా
రాయణమూర్తి పుణ్య రఘురామకథాపఠనానురక్తుడై॥ ౪

ఉ॥ ఈతడు రూపయౌవనము లెచ్చగగల్గియు రాఘవాంఘ్రికం
జాతములందు భక్తిగని సంతసమందుచునుండు దానిచే
నాతతభక్తిశంకరవరాంఘ్రియుగంబునసైత మెచ్చె వి
ఖ్యాతికినెల్ల మూలముకదా శివపుణ్యకథానురక్తియే॥ ౫

క॥ అనుజుడుగలడొక్కరుడీ । తనికిన్ శ్రీరామమూర్తి ధన్యుడతడు స

చ॥ జనకుడు రామయాఖ్యుడురుశంకర పాదసరోజ భక్తుడై
ఘనసుకృతార్జితోత్తమజగంబులకేగుచు భిన్నలై[illegible]
త్తనయుల రక్షణల్సలుపు ధర్మమునందు నిజార్థకాయమై
తనరు సుభద్రమాంబయను ధర్మసతిన్నియమించె నిచ్చటన్॥ ౬

ఉ॥ రామయతండ్రి పూతమగు రావికులంబునమించె జానకీ
రామయయంచు బేర్వడి నిరామయుడై యెలమంచిలీము తా
గ్రామపతిత్వముంది కడురాజిలె శంకరపాదభక్తి పి
త్రామితభక్తి సజ్జనధరామరభక్తియు నిచ్చ లెచ్చగన్॥ ౭

సీ॥ ఎలమంచిలీప్రొప్రయిటరైన జానకీరామయమిత్రుడు భూమిసురుడు
కందికుప్పాన్వయ కలశాంబుధివిధుండు శ్రీజగన్నాథుండు శ్రీయుతుండు
కాపురమ్ముండెను గవితాగ్రహారమ్మునందు శంకరభక్తుడై చెలంగి
యగ్రహారమ్మున నందరికిని శంకరాంఘ్రి పూజాభాగ్యమబ్బునంచు
గీ॥ రమ్యయశుడైన జానకీరాముగాంచి । మిత్రమా నీవు శంకరుమీదిభక్తి
భువనవిదితంబుగాపున శివునినిల్పి । యాలయముజేయు మీయగ్రహారమునను॥ ౮

మ॥ శివలింగంబు ప్రతిష్ఠ జేయు మనుజశ్రేష్ఠుండు సామాన్యుడే
శివసాయుజ్యము నొందు నిక్కముగ నిస్సీమప్రభావోజ్జ్వల
స్తవనీయాకృతి నంచు సజ్జనులు సంస్థాపింతు రుత్కంఠులై
భవలింగంబు ప్రతిష్ఠ జేసి భవసంబంధంబుల న్వీడుమా॥ ౧౦

చ॥ అని యిటులన్న విన్నపము హర్షమునన్గొని శంకరాంఘ్రి పూ
జననిరతుండు రావిపుల జానకిరామయ బల్కె మిత్రుడా
ఘనకరుణామయుండయిన కాలగళుండె త్వదీయరూపుడై
నను నియమించె నీపనికొనర్పుడు దప్పక నీదునానతిన్॥ ౧౧

శా॥ ఏనింకొక్కటిగూడ గూర్చెదను నాగేశుండు నాతండ్రి గౌ
రీనామంబును గాంచె దల్లియును వారిన్ భక్తితో మ్రొక్కి త
చ్ఛ్రీనామంబులు గూర్చి శంకరు ప్రతిష్ఠింతున్ ముదంబొప్ప గౌ
రీ నాగేశ్వరుడంచు నిక్కవిరళిన్ లింగాకృతిన్ సద్విధిన్॥ ౧౨

క॥ అనికవిశాపురమున శుభ । దినసుముహూర్తంబునన్ ప్రతిష్ఠించెను శం
భుని రవిజానకిరామయ । జననీజనకాఖ్యయుగ్మ సంధానమునన్॥ ౧౩

క॥ విపులాలయమును భూస్వా । స్త్యము నర్పణ జేసి నిత్యమభిషేచనభో
గముల క్రాంతము జరుగగ । నమరించెను శంకరునకు హర్షమ్మొదవన్॥ ౧౪

శా॥ ఆనాడాదిగ భక్తరక్షణ కృపాయత్తైకచిత్తుండు గౌ
రీనాగేశ్వరుడా శివుండిచట నిల్చెన్ బుణ్యవిప్రోత్తమ
ధ్యానార్చా సహితాభిషేకరచనా హర్షాతిరేకంబు స్వ
స్థానాచ్ఛాద్రిని వాససౌఖ్యముల విస్మర్యంబు నొందింపగన్॥ ౧౫

సీ॥ ఘనకందికుప్ప జగన్నాధుడట గాంచె దనయుల మువ్వుర వినయయుతుల
వరశంకరయ్య సర్వయ్యయు సాంబయ్య యనుచు వారికి బేరులాతడుంచె
సర్వయ్య యన్నచో శర్వయ్యయే కదా సర్వ శర్వులు శర్వ సర్వులోకడె
శంకరభక్తి విస్తారమునకునింక వలయునే సాక్ష్యమిందెవరికైన

గీ॥ శంకరయ్యకు గల్గెను సత్సుతుండు । కృష్ణమూర్త్యభిధానుడు కీర్తియుతుడు
అగ్రహారమ్మునందిప్పు డగ్రగణ్యు । డగుచు జెలువొందుచున్న వాడధిక సిరుల॥

గీ॥ కందికుప్ప జగన్నాధఘనుడు గన్న । మువురు కొడుకులలోన రెండవసుతుండు
సర్వయాభిఖ్యుడురుతర శర్వభక్తి । పారగుండయ్యె గవితాగ్రహారమునను॥

శా॥ రాజద్రూపవిలాససంపద దపోరాజత్సువర్చస్వితన్
దేజోరూపపదంబు సార్థకముగా దీపించువంశమ్మునం
దోజన్ లచ్చయపండితుండు దితుడై యుద్వృద్ధరాంఘ్రిద్వయీ
పూజాతత్పరుడయ్యె నెల్లసుఖము లూర్జంబుగా గాంచుచున్॥ ౧౮

గీ॥ వైద్యలౌకిక జ్యోతిష విద్యలందు । నధిక ప్రజ్ఞాన్వితుండు లచ్చయ్యఘనుడు
విపులపంచాక్షరీమంత్ర జపరతుండు । వీతసర్వభయుండయి వెలయుచుండె॥ ౧౯

సీ॥ అతడు పెండ్లాడి కామాంబను గనె సూర్య నారాయణను జగన్నాథరావు
సుతులనిర్వురసుతా త్రితయమ్ము తన్మధ్య మందుగాంచెను సుబ్బనర్సలచ్చ
మాంబలనందు నర్సమ్మను సర్వయ్య కొసగి పెండిలిమోద మొప్పజేసె
లలినొప్పవారికి లక్ష్మినారాయణ జ్యేష్ఠసుతుండయి చెల్వుమీర

గీ॥ రెండవసుతుండు వాసుదేవుండు పిదప । నందనుండయ్యె శ్రీజగన్నాథరావు
నందనయుగళ్లై జోగమ్మనంద్యచరిత । యిట లసర్వయ్య సుఖములకిక్కయయ్యె॥

సీ॥ వేదాంతకోవిదులై వైదికాచార సంపన్నపుణ్యులు జల్లెపల్లివారు
తద్వంశజాతుడై ధన్యచరిత్రుడై యలరు వేంకటరామ యాఖ్యునకును

లక్ష్మాంబనిచ్చెను లచ్చయ్యపంతులు లక్ష్మాంబ వేంకట రామసుతుడ
జనకుండులేరాయ మునదివికేగంగ మాతామహులునన్ను ప్రీతితోడ

గీ॥ బెంచినారలు విద్యజెప్పించి చిన్న । మాతులుడు కన్నకొమరునిమాడ్కి నన్ను
బెంచిప్రోచిన తెరగురూపింపదరమె । యేనెరుంగుదు నీశ్వరుండెరుగు గాక॥ ౨౧

సీ॥ నాకుజోడుగ లక్ష్మినారాయణుని గూర్చి చదివించె సర్వయ్య ముదితుడగుచు
దమకుమారునితోడ సమముగాజూచిరి నన్ను సర్వయ్యయు నర్సమాంబ
పలుమారు కవితలో పలనుండి గౌరినాగేశునిదర్శింప నేగుచుంటి
నేగి సర్వయ్య మహేశుసన్నిధియందు శివమహిమ్నస్తుతి జేయుచుండ

గీ॥ నతనిభక్తి శివార్చనాసక్తిస్తోత్ర । పాఠపఠనానురక్తియు బరమసుఖద
మగుచునామదినాకెను మిగులబిన్న । వాడనయ్యును పాఠములవాడనయ్యె॥

ఉ॥ ఇంచుకయైన నే నెరుగ నీనుతినైనను విన్నమాత్రమా
గ్షాంచితమయ్యె మన్మనము నర్థవిచారముచేసి యిప్డహ
ర్షించితి దీనిసాటినుతి యింకొకటెందును లేదటంచు నే
వించెద దీనిమూలమున విశ్వవిభుండగు నీశుపాదమున్॥ ౨3

గీ॥ భక్తివైరాగ్య సుజ్ఞానభాజనంబు । ప్రబలపాండిత్య కవితావిరాజితంబు
బహుళవేదాంత శాస్త్రార్థ భాసురంబు । భవపదాంబుజమహిమాను వర్ణనంబు॥

చ॥ ఎనగనలేనియీశివమహిమ్నసుతిం దెనిగించిపద్యమం
దొనరుప నేరికిన్గదురదూరకనుబ్బగ నేలబుష్పదం
తుని కృతినర్థమున్ సొగసుతో నెరుగంగను టీకవ్రాయగా
ననువగు నేని గొప్పపనియంచు గడంగితి నేరమండిమున్॥ ౧౫

క॥ అందరిభక్తులకున్ బలు । వందనములొనర్చి శివుని పాదంబులహృ
న్మందిరమున నిడికొంటిని । సందియమింకేలనాకు శంభునికృపకున్॥ ౧౬

ఉ॥ సర్పఫణంబులందు రవిమంబుహరించెడు మానికంబులన్
నేర్పునజేర్చి సర్పములనీటుగ దాల్చిన ప్రౌఢఘోరమా
సర్పమునాదుసంస్కృతి; విషంబునకున్మణినీదుస్తోత్రమీ
సర్పముగానక్ గాగొనుము చాలను నేను ధరింపదీనినిన్॥ ౧౭

శా॥ నాగాలంకృతదేవా నిర్గుణుడవైనన్ ద్వత్పదార్థంబుమ
ద్ధీగమ్యంబగునట్టు కూర్చుచు విభక్తిప్రత్యయమ్ముల్ త్వదీ
యాగారమ్మునుజేరినాడ మననాయత్తుండనై గౌరితో
నాగేశా వినుమయ్య శ్రీశివమహిమ్నస్తోత్రవిజ్ఞానమున్॥ ౧౮

విభక్త్యంతములు.

క॥ హరుడు జగత్సముదయశం । కరుడిల గవితాగ్రహార గౌరీనాగే
శ్వరుడా నతకరుణాసా । గరుడు రుభక్తానీకర భవ్యకరు డఘహరుడున్॥

క॥ ఈశ్వరనతజనరక్షై । కేశ్వరనిగమాంత సన్నుతేశ్వరలోకా
ధీశ్వరనుత గౌరీనా । గేశ్వర గిరిజాహృదంబుజేశ్వర వినుమా॥

క॥ దేవుని దారకవిద్యా । దేవుని భక్తప్రసిద్ధదేవుని సుమనో
దేవుని నుతియింతుమహా । దేవుని నమితప్రభావదేవుని శివునిన్॥

క॥ శ్రుతినుతమహాప్రభావో । న్నతుడగు శితికంఠుతోడ నతిపూర్వకస
న్నుతిజేసి విన్నవించెద । నతులితసద్భక్తినిమ్మటంచును నెమ్మిన్॥

క॥ వందనములుబృందారక । బృందావనచణపదారవిందునికొరకున్
నందితసేవకజనహృ । న్మందిర సుందరునికొరకు మాధవుకొరకున్॥

క॥ భవభీతి తొలగకుండునె । భవపదగతప్రీతివలన భావజహరసం
స్తవమువలన శివచరితా । నవపానమువలన శంభుసత్కృపవలనన్॥

క॥ శర్వునకు దనుజగర్వ వి । నిర్వాపణ దేవకార్యనిర్వాహునకున్
సర్వసుపర్వావనకృత । పార్వత్యుద్వాహునకును ఫాలాక్షునకున్॥

క॥ రాజతశైలావాస వి । రాజిత కైలాసగిరివరప్రభునకు వి
భ్రాజితసురమస్తక నీ । రాజితశ్రుతిసన్నుతాంఘ్రి రాజీవునకున్॥

క॥ హరునందు మోక్షవిద్యా । గురునందు నగణ్యపుణ్యగుణనికరసరి
ద్వరునందు ఘోరభవభయ । హరునందు మదీయభరమునందించి వెసన్॥

వ॥ మహామహేశ్వర తత్త్వభక్తి జ్ఞానాభ్యుదయ పరంపరాభివృద్ధిగా నాయొనర్పం
బూనిన శ్రీశివమహిమ్నస్తోత్రవిజ్ఞానంబను వ్యాఖ్యానగ్రంథమునకు గ్రమం బెట్టి
దనిన. తొల్లి మహనీయుండును మహేశ్వరభక్తుండు నగు పుష్పదంతాభిధాన
గంధర్వప్రధానుండు కొండొక కారణంబున మహేశ్వరకటాక్షచ్యుతుండయి
భ్రష్టశ్రీకుండయి పిదప బశ్చాత్తప్తుండయి శివుని మహామహిమమ్మ నతిభక్తి
తోడ సన్నుతించి భక్తసులభుండగు నమ్మహేశ్వరుని కృపఁగాంచి మరల నిజ
మహిమంబునుగాంచె. వాడు మొదలా పుష్పదంతకృతంబగు మహిమ్నస్తోత్రమతి
పవిత్రంబగు స్తోత్రరాజంబయి ప్రకాశించుచుండు. సిద్ధస్తోత్రంబును నిత్యపఠ

నీయంబును జ్ఞానభక్తిదాయకంబునయి యొప్పుచుండు. మహాపండితుండును
మహాకవియును మహాభక్తుండు నగు పుష్పదంతుడు జగత్కారణుండగు శివుని
నిర్గుణమహిమానువర్ణనం బెవరికినైన నసాధ్యంబనియు నైన నెల్లజీవులును దమ
తమ పూర్వపుణ్యార్జిత శక్త్యనురూపంబున నొనరించు నుతులన్నియు నీశ్వరు
ని కొక్కతెరంగున నాదరణీయంబులేగాని తిరస్కరణీయంబులు గావనియు
స్తవనఫలంబు జీవుల కున్నతపదవీప్రాప్తియనియు సప్రమాణంబుగా నొప్పించి
సర్వకారణుని యెడల గొందరొనరించు కుతర్కవాదంబుల ఖండించి భక్తోపాస
నా సౌకర్యంబుకొఱకును విశ్వసృష్టిస్థితిసంహారంబులకొఱకును శివుండు నిర్గుణుం
డయ్యు గుణగ్రహణంబొనరించి యనేకలీలావిలాసము లొనరించుచుండుటం జేసి
గుణభేదానుకల్పితంబులగు భగవంతుని నామరూపవిలాసంబుల నుతించి మర
ల నిర్గుణమహిమోద్ఘాటనంబును స్తోత్రమాహాత్మ్యంబును వర్ణించి గ్రంథమంత
యు నేకాశ్వాసంబున నుపసంహరించి విరమించె. ఇట్టి స్తోత్రరాజంబనుబంధ
చతుష్టయాదిలక్షణంబులును దర్శనాంతర్గతవిషయంబులును గలిగి వేదాంతవిజ్ఞాన
సునిశ్చితార్థుల కానందకరంబు. స్వామిసగుణోపాసనా సక్తులగు భక్తులకత్యం

తామోదదాయకంబు. కవితాప్రౌఢిమస్గాంచి యానందించు నాలంకారికులకుసైత మాశ్చర్యానందజనకంబు. అన్నింటికిన్మిగిలి శ్రీ శివప్రీతికరంబగుటంజేసి సర్వశుభఫలతుణోపేతంబయి మాదృశదీనభక్తుల కమితాహ్లాద కరంబనుట పునరుక్తియయ్యు వేమారు చాటిచెప్పినను బునరుక్తిగాకుండు మహనీయుండును భక్తజనతాఘనతాపహారణ సుకరమార్గదర్శియు సద్గురుండునగు పుష్పదంతుని చరణములకొరగి తత్కృతమహిమ్న స్తోత్రంబును బఠనమొనర్చుచు మననంబొనర్చెద అందుముందు గమనింపందగు సంశయ మెద్దియనిన లోకమున స్తోత్రములన్నియు దదంతర్గత దైవతనామ వివక్షచే నొప్పుచుండ నిత్యాదిమాత్రమటులగాక సర్వసామాన్యంబగు మహిమ్న స్తోత్రంబనిమాత్రము పేరొందె. దీనికింగారణమరసినచో బుష్పదంతుని సహజప్రతిభావిశేషంబు తేటపడంగలదు. నామరూపరహితుండును సర్వజగత్కారణుండును నిజమహిమా మాత్రచింత నీయుండును నిర్గుణుండునగు మహేశ్వరుని మహిమానుచింతనమె ప్రధాన విషయంబని యుపక్రమోప సంహారాదులవలన సైతము తేటపడుచుండు. నీస్తోత్రంబునకు మహిమ్నస్తోత్రమను నామమె మిక్కిలి పొసగునుగాని యింకొక్క

నామమెయ్యదియైనను దోషయుక్తంబనుట స్పష్టముకదా మరియు మహిమానువర్ణనమొనరింప సమకట్టినపుడు భగవంతుని మహిమముగాక వేరొకపెద్దియేని యుగలదే అన్నితెరంగులనొప్పియున్న యీస్తోత్రమునకు నామము సైతమఖిలజనానందకరంబు. ఇంకస్తోత్రంబును స్తోత్రాంతర్గతాంశముల నించుక యథామతిని మననంబొనరింపదలంచి సర్వజ్ఞుండవగునో శర్వానీసన్నిధిని వివరింతు నాయుద్యమంబు నింద్యంబని నిరాకరింపజనదు. అల్పజ్ఞులును మొఱకులునగు మముబోటి వారికెల్లరకు బ్రతినిధియై చిరకాలమునకు బూర్వమే నిల్చినీ సమతుంబునవాదించి పుష్పదంతుండు తనపట్టినపట్టు సప్రమాణంబుగా నిర్వహించి నీయానతింబడసి మముద్ధరించె. అట్టివాదం బాతనిస్తోత్రమున మొట్టమొదటనేయున్నదదియె నాయుద్యమంబునకు నాధారంబు విన్నవించెద వినుము.

తప్పు ఒప్పుల పట్టి.

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
		ఉపోద్ఘాతము.	
1	7	భాల్పించు	బాలించు
3	14	గాఫున	గావున
4	8	కొనర్పడు	కొనర్పును
7	3	జెపించి	జెప్పించి
9	2	భక్తానికర	భక్తాఘ
11	12	రాజంబను బంధ	రాజంబనుబంధ
12	7	సంశయు	సంశ
		గ్రంథమునందు.	
10	9	శ్లోకము	శ్లోకమున

16	11	వ్యసితా	వ్యవసితా
18	5	వాక్కులను గా	వాక్కులనగా
21	11	నోఇత రాణీ	నోఇత రాణి
38	9	సృష్టిక్షితి	సృష్టిస్థితి
41	2	కలించుట	కల్పించుట
41	10	ఆయినను	అయినను
42	5	నిగుణుడై	నిర్గుణుడై
43	11	ఈశ్వనికంటె	ఈశ్వరునికంటె
45	2	జగత్తువకు	జగత్తునకు
47	3	ఆనీశః	అనీశః
50	5	నీముహిమను	నీమహిమను
51	8	సర్వ	సర్వ
52	7	త్వధ్రువ	త్వద్ధ్రువ
53	2	గ్రావ్యా	గ్రావ్యా
53	4	స్తువన్	స్తువన్

54	2	ఆనిత్యము	అనిత్యము
54	3	దర్మనము	దర్శనము
77	4	సూన్యములు	శూన్యములు
78	3	వారు	వాడు
80	10	జూడ	చూడ
81	8	స్వార్జత	స్వార్జిత
82	2	పదముల	పద్మముల
83	6	త్వదది	త్వదధి
89	1	ఆసూర్య	అసూర్య
90	7	సుతాష్ణః	సుత్రాష్ణః
97	9	ముహుర్తా	ముహూర్తా
98	2	రుక్ష	రుక్షగ్రహగణం=
100	9	ద్వృత	ధృత
102	4	ఘః	అఘః
103	9	కోతస్మిన్ని సే	కోసేతస్మిన్ని

108	3	కర్మసు	కర్మను
109	10	భక్తి	భక్తియొక్క
111	2	భ్రేషః	భ్రంశః
120	8	Grate	Great
123	5	నాకు	నాశు
127	8	చెప్ప	చెప్పబడు
137	7	యత్రయం	యత్ప్రయం
140	11	నాము	నామ
141	12	అతిత	అతీత
144	3	విశేషము	విశేషణము
157	6	కజ్జాలం	కజ్జలం
160	5	శ్లోకము	శ్లోకముల
163	4	దివ్వ	దివ్య
164	4	దైవము	దేవుడు
166	12	దేవతులు	దేవతలు

శ్రీ మహిమ్న స్తోత్రము.

శ్లో॥ మహిమ్నః పారం తేపరమవిదుషోయద్యసదృశీ
స్తుతిర్బ్రహ్మాదీనామపితదవసన్నాస్త్వయిగిరః
అథావాచ్యస్సర్వస్స్వమతిపరిణామావధిగృణన్
మమాప్యేషస్తోత్రే హరనిరపవాదఃపరికరః॥ ౧

శ్రీ మహిమ్న స్తోత్ర విజ్ఞానము.

టీ॥ హేహర = పాపహరుడవగు ఓశివుడా, తే=నీయొక్క, మహిమ్నః=మహాత్వముయొక్క, పరం పారం=పూర్ణమైన ఒడ్డును (సంపూర్ణముగాననుట), స్తు

తిః=స్తోత్రముచేయుట, అవిదుషః=మూఢుడైన (నావంటి) వానికి, అసదృశీః యది=తగని యెడల, బ్రహ్మాదీనామపి=బ్రహ్మాదులయొక్క-సయితము, గిరః=వాక్కులు (స్తోత్రములు) త్వయి=నీవిషయమున, అవసన్నాః=సన్నగిల్లిపోయినవి (పూర్తిగానుతింప నేరవాయెను) అథ=ఇకను (కావున), సర్వః=అందరుజనుల సమూహామును, స్వమతిపరిణామావధి=తమతమబుద్ధి వెళ్ళినంతవరకు, గృణన్=నుతిచేయుచు, అవాచ్యః=అనింద్యము (అగుచున్నది) (కావున) స్తోత్రే=నుతించుటయందు, మమాపి=నాయొక్క-సయితము, ఏషః పరికరః=ఈప్రారంభము, నిరపవాదః=నిర్దోషమగునది.

ఈశ్లోకార్థము బాగుగాదెలియుటకు శివపుష్పదంతులకు సంవాదరూపమున గురువు శిష్యునకు బోధించుచున్నాడు.

పు॥—స్వామీ నిన్ను నుతింపనారంభించుచున్నాను.

శి॥—ఓయీ నీవు అప్రాజ్ఞుడవు నామహామహిమను పూర్తిగా వర్ణించుటకు నీకు శక్యము కాదు.

పు॥—అటులంటివేని దేవా నావంటివానిమాట యటుండనిమ్ము. సురజ్యేష్ఠుడైనబ్రహ్మ మొదలుకొని యెవరిస్తోత్రములును నీకుసరిపడవు. నాకంటె వారధికులు కావున వారినుతులు నానుతికంటె గొప్పవే. అయినను నీమహిమనుపూర్తిగా నుతించుటకు వారును చాలరు. ఇందుకుశ్రుతి. "యతోవాచోనివర్తంతే అప్రాప్యమనసాసహ" అని వేదపురుషుడే ఒప్పుకొనియున్నాడు. నీవు చెప్పినదిసరియగునేని నాస్తోత్రమునువలె అందరినుతులను నీవు తిరస్కరింపవలసివచ్చును. అపుడు లోకమున నీకు నుతియేయుండదు. స్తోత్రములేనిమహిమ యుండినను లాభమేమి. ఎవరును నుతింపరు. అందువలన జీవులెవరును ముక్తులగుటకు మార్గములేదు. నీవొనరించిన సృష్టియంతయు నిరర్థకమగును. దీనికేమందువు.

శి॥—ఓయీ అటులనరాదు. బ్రహ్మాదులు మహాపండితులు వారి బుద్ధిబలము సాగినంతదనుక నుతించుచున్నారు. సంపూర్ణముగా నుతింపనేరకున్ననేమి వారిలోపములేదు కావున వారి నుతుల నంగీకరింతును.

పు॥—మహాదేవా ఇపుడు చిక్కితివి. ఎవడైనను తనశక్తివంచనలేక నిన్ను నుతించునపు

డు వానినుతిని నీవంగీకరింతువుకదా పండితుడైననేమి మూఢుడైననేమి పూర్తి గా నెవ్వడును నిన్ను నుతింపనేరడు. కొద్దిగనో గొప్పగనో ప్రతివాడును నుతిం పగలడు. శక్తిలోపముచేయక నుతించువాని నుతిని నీవంగీకరింతువు నేను శక్తి లోపముచేయక నుతించెదను. కావున నానుతిని నీవంగీకరింపకతప్పదు.

శి॥—మంచిది కానిమ్ము.

ఈమీదిసంవాదమువలన శ్లోకాభిప్రాయము స్పష్టమగుచున్నది.

శిష్యుడు॥—ఆచార్యా మొదటనే తానారంభించిన కార్యమునకు మూలచ్ఛేదమునాపాదించి స్తోత్రమెవ్వనికిని సాధ్యముకాదని యమంగళముగా కావ్యముఖమున జెప్పబడినది. ఇది కావ్యదోషముకదా?

గురువు॥—కాదు. పూర్ణమగునుతి సాధ్యముకాదనెను కాని యేమాత్రమును సాధ్యము కాదని యనలేదు. మరియును మొదటి వాక్యము సయితము నుతియేకదా స్వామీ నీమహిమ నెవ్వరును పూర్తిగా నుతింపజాలరని యెంతగొప్పది యనుటనుతియే

శి॥—హరయనగా హరించువాడుకదా? అట్టిపదమును మొదటిశ్లోకమునందే ప్రయోగించుట అమంగళము అశ్లీలమును కావ్యదోషముకదా?

గు॥—అదియునుకాదు. ప్రతివాడును తనకనిష్టనివృత్తియు నిష్టప్రాప్తియును కోరును. అనిష్టనివృత్తివలన ఇష్టప్రాప్తికధికారము సిద్ధించును. ఘోరపాపరూపమగుసంసారమునుండి తొలగుటకును పిమ్మట శాశ్వతసుఖమునొందుటకును ప్రతిమనుజుడునుకోరును. కావునముందు పాపనివృత్తికొరకు పాపహరుడగు హరునే పిలువవలయును. మరియును పుష్పదంతుడీశ్వరకటాక్షముతప్పినందున తనగొప్పతనము బోగొట్టుకొని పిమ్మట పశ్చాత్తప్తుడయి తెలివిగలిగి ఈనుతినారంభించెను. కావున తనకదివరకీశ్వరానుగ్రహము తప్పిన పాపమును బోగొట్టుకొనుటకు సైతము హరాయని పిలిచెను. ఎటులజూచినను హరయను సంబోధనమెంతో ప్రాసగి సొగసుగానున్నది.

ఇంకనొక విశేషమునుజూడుము. మనకు మనస్సునకుదోచినదంతయు నోటి మాటలకు సాధ్యముకాదు. మాటలతో దెలుపజాలము. నోటిమాటలతో జెప్పజా

లినసుతి యొకటి మాటలతో దెలుపనసాధ్యముకాకున్నను మనస్సునకుమాత్రము గోచరించు నుతియొకటి మహాగంభీరములగు పర్వతాదులను జూచునపుడు మనస్సునకొక విలక్షణమగు అద్భుతమహిమదోచును గాని నోటితో మాత్రమిట్టి దని తెలుపనేరము. ఈ రెండువిధములగు నుతులను దెలియజేయుటకు సామాన్యముగా స్తోత్రశబ్దముపయోగింపబడినది. కాని యొక్క విధమగునుతికే కాదు. శ్రుతియందు కంఠోక్తిగా వాక్కులు బలుకనేరవు. మనస్సు నైతమూహింపనేరదని తెలుపు మీదవివరించిన శ్రుతిననుసరించి రెండువిధములగు నుతులును సంపూర్ణము కావని తెలుపబడినది.

బ్రహ్మను పేర్కొనుటచేత సురజ్యేష్ఠుడగు బ్రహ్మయే సమర్థుడు కానపుడు తక్కినవారిమాట చెప్పనేల అని కైముత్యన్యాయము.

స్వామీ స్తోత్రము చేయుటయందు నాయీపరికరము అనగా ప్రారంభము నింద్యము కాదుకుమా అనిఅనెను. ఇందలి సొగసును గనిపెట్టితివా నాస్తోత్రము మిక్కిలి తక్కువది నేను అసమర్థుడను. కాన నది మనోహరముగానుండక దో

షయుక్తమయి నింద్యముకానోపును. అయినను నాయుత్సాహము పూర్ణమగు భక్తితోగూడినది కాన నాప్రారంభముమాత్రము దోషయుక్తముకాదు. అని వినయమును భక్తియును సూచింపబడినవి.

శి॥—అయ్యా ఈగ్రంథమునందు కావ్యలక్షణములున్నవా?

గు॥—ఆలంకారికుల నియమములనుబట్టి కొంచెము విచారింతము. కావ్యము అత్యుత్తమము భక్తిభూయిష్ఠము. నాయకుడు భగవంతుడు. కవి మహాభక్తుడు. విషయము భగవంతునిమహిమ. ఫలము సంసారసంతారకమగు భగవదనుగ్రహము.

కావ్యాదియందలి మొదటివర్ణము మ ఇది స్త్రీలింగవర్ణము. కృతిపతికి చిరవిభూతినిచ్చును. ఇది మహేశ్వరుని నుతించునపు డాదియందుంచుటయుచితమేకదా. దీని కధిదైవతము శూలధరుడగు శంకరుడు. మూడుగుణములను దెలుపుత్రిశూలమును ధరించు శివుడు త్రిగుణాత్మకమైన సంసారమును దొలగించునని సూచించుచున్నది. మ అను వర్ణమునకు ప్రత్యేకఫలము వంశనాశనము అనగా సంసారనాశనము మొదటివర్ణమీతీరున శుభవర్ణము.

మొదటిశబ్దము మహిమ ఇది మిక్కిలి శుభమైన యర్థముకలది. కావున మొదటి శబ్దముసయితము శుభశబ్దము.

మొదటిగణము "మహిమ్నః" అనునది యగణము. ఇది జలగణము. దీనికి గుణము రసము అనగా పరమాత్మస్వరూపము "రసో వైసః" అని శ్రుతి. ఈయగణమునకు ఫలము జయము (సంసారజయముకంటె నెక్కుడు ఫలమెయ్యది). ఇటుల శుభవర్ణమును శుభశబ్దమును శుభగణమును కావ్యాదియందు ప్రయోగింపబడినవి. ఇంకను విచారించినచో కావ్యగుణము లెంతో సొగసుగా సమరియున్నవి మహాభక్తులకావ్యంబులెన్నడు దోషయుక్తములుకావు. అయినను మనకు ప్రకృతమున జూడవలసినది కావ్యవిమర్శనముకాదు. కావ్యానందముమాత్రమె వలయువార లావిమర్శనము జేయనిమ్ము. స్వామిమహిమను అందలిసొగసులును భక్తి ప్రేరితములగు వాక్యములును నక్షత్రానుగ్రహము మొదలగు సంశయములును మనము విచారించి తెలియవలసినవి కాన వానినే విమర్శింతము

ఇటుల ప్రథమశ్లోకమున స్వామి మహిమను నుతించుటకు భక్తిగలిగినప్రతి

వాడును మూఢుడయ్యును అధికారియేయనియు తానునుతించుట కారంభించుట దోషముకాదనియు సాధింపబడినది. అయినను నిక్కముగా నుతించుటకారంభించినపుడు నోరురాదనియు మనస్సు సైతము భయపడి యూరకుండుననియు తనయశక్తిని రెండవశ్లోకమున సప్రమాణముగా కవి చెప్పుచున్నాడు.

శ్లో॥ అతీతఃపంథానంతవచమహిమావాఙ్మనసయో
రతద్వ్యావృత్త్యాయంచకితమభిధత్తే శ్రుతిరపి
సకస్యస్తోతవ్యఃకతివిధగుణఃకస్యవిషయః
పదేత్వర్వాచీనేపతతినమనఃకస్యనవచః॥ ౨

టీ॥ ఓమహాదేవా; చ=మరియును, తవమహిమా=నీమహత్త్వము, వాఙ్మనసయోః=వాక్కుయొక్కయు మనస్సుయొక్కయు, పంథానం=మార్గమును, అతీతః=దాటిపోయినది (అనగా చెప్పుటకు మాటలుగాని యూహించుటకు మనస్సుగాని నీమహిమకు చాలవు). అయం శ్రుతిరపి=ఆప్రసిద్ధమైన వేదముసైతము, అతద్వ్యా

వృత్త్యా=ఇదికాదు ఇదికాదని తీసివేయుటచేత (నేతివాక్యములచేత) చకితం=వణకును (భయమును) అభిధత్తే=ధరించుచున్నది, సః=అట్టి (నీవు) కస్య=ఎవనికి, స్తోతవ్యః=నుతిచేయుటకు సాధ్యమయినవాడవు, కతివిధగుణః=ఏవిధమయినగుణములు కలవాడవు, కస్య=ఎవనికి, విషయః=కనుగొనఁజాలువాడవు, అర్వాచీనే=(సృష్టికి) పూర్వమునుండియున్న, పదేతు=(నీ) స్థానమును(గురించిప్రసంగించునపుడు) నందు, కస్య=ఎవనియొక్క, మనః=మనస్సు, నపతతి=పడిపోవదు, వచః=మాటయు, న(పతతి)=పడిపోవదు. (పడిపోవునని తాత్పర్యము.)

గు॥— మొదటిశ్లోకము భగవంతునిమహిమ బ్రహ్మాదులయినను పూర్తిగా నుతింప శక్యముకాదని సామాన్యముగా జెప్పబడెను. దానినే శ్రుతిప్రమాణార్థమూలమున స్థిరపరుచుచున్నాడు. ఈశ్రుత్యర్థము యీరెండవశ్లోకార్థమున జెప్పబడినది.

శి॥— అయ్యా, శ్రుతి భగవంతునిగూర్చియే చెప్పుచున్నదిగదా. శ్రుతి చెప్పనేరదనుట సరిపోవునా?

గు॥—నిక్కమే, శ్రుతి బ్రహ్మమునుగూర్చియే చెప్పుచున్నది. ఇచ్చట శ్రుతికి చెప్పబడిన యశక్తి బ్రహ్మమునుగూర్చి పూర్తిగా జెప్పనేరకుండుట.

శి॥— చెప్పనలవికాని మహిమమును శ్రుతిమాత్ర మెటులచెప్పనోపును?

గు॥—అతద్వ్యావృత్తివలన?

శి॥— అనగానేమి?

గు॥—వినుము, మన కొకవస్తువునుగురించి చెప్పునపుడు గురువు రెండువిధములుగా జెప్పును. మొదటిది వస్తువునుజూపించి బోధించుట. అది సాధ్యముకానపుడు ఆవస్తుస్వరూపమును సామాన్యముగాజెప్పి పిమ్మట మనకుదెలిసినట్టియు మనకుదెలియవలసినవస్తువును బోలియున్నట్టియు యితరవస్తువుల నొక్కొక్కటి పేర్కొని అది ప్రస్తుతవస్తువుకాదుసుమా అని ఒక్కొక్కటిని తీసివేయును. అందువలన పొరబడుటకవకాశములేక యథార్థమైన జ్ఞానము కలుగును. ఇందు కుదాహరణము ఒక శిష్యునికి గురువు నిమ్మపండు స్వరూపమును జెప్పవలసియున్నదనుకొనుము. దానిని ప్రత్యక్షముగా జూపి దానిలక్షణములను బోధిం

చుట యొక మార్గము. అది సాధ్యము కానపుడు దాని లక్షణములను మాత్రము సాధారణముగా జెప్పును. గుండ్రముగాను, పచ్చగాను, పుల్లగాను, ఈ రేలతో నుండునని ముందు చెప్పును. ఇంతమాత్రము చాలదు. పిమ్మట దానినిబోలియుండు దబ్బ, నారింజ, కమలా మొదలగు ఫలములను పేర్కొని యివి కావని చెప్పును. అందువలన శిష్యుడేనాటికిని పొరబడుట కవకాశము కలుగదు. నిమ్మపండును గురించిన జ్ఞానము స్పష్టముగా దోషరహితమయి దృఢముగానుండును. ఈ తీరున రెండువిధములుగా నుపదేశమార్గమున్నది. తత్ అనునది ప్రకృతవస్తువు. (బ్రహ్మము.) దీనిజ్ఞానమే మనకు దెలియవలసియున్నది. ఇది నిత్యము, సత్తు చిత్తు, ఆనందము, జగత్కారణము అని సామాన్యముగా శ్రుతిచెప్పి పిమ్మట మనకు పొరపాటులేకుండునటుల అనగా జగత్తునుగాని మరిదేనినిగాని జూచి దానియందే ఆలక్షణముల నారోపించి అదియే బ్రహ్మమని మనము భ్రాంతి పడుదుమేమో యని అట్టివి బ్రహ్మము కావు అని బోధించుచున్నది. ఒక్కొక్క పదార్థమును గైకొని దానిని విమర్శించి ఇది బ్రహ్మము కాదు ఇది కాదు అని

చెప్పును. నన (కాదు కాదు) అను వాక్యములకే నేతి (న+ఇతి) వాక్యములని పేరు. ఇకను అతత్ అనగా మనము ప్రసంగించుచుండు బ్రహ్మమునకంటె భిన్నమగునది. వ్యావృత్తి యనగా తీసివేయుట. తొలగింపు అని. అతత్తుయొక్క వ్యావృత్తి యనగా అతత్తును తీసివేయుట తొలగించుట. అనగా బ్రహ్మమని భ్రాంతికలుగజేయువస్తువులను ఒక్కొక్కదానిని పేర్కొని అది నిక్కముగా బ్రహ్మము కాదు కాదని బోధించుమార్గము అతద్వ్యావృత్తి యనబడును. దీనినే పాశ్చాత్యతార్కికులు (Process of elimination & definition by negation) అని యందురు.

శి॥ —అయ్యా ఇదిచెప్పుటకు శ్రుతి వణకుటయేల?

గు॥—భాష సృష్టిలోనిది. సృష్టియంతయు నామరూపాత్మకమైనది. నామరూపములులేనిపదార్థమును భాష చెప్పజాలదు. సృష్టిపూర్వుడయి సృష్టిని జేసిన భగవంతునికి నామరూపములు లేవు. అన్నినామములును రూపములును అతని యందు వర్తించవచ్చును. జలమున కాకృతియున్నదా ఒకటే జలము మనమే

యాకారముగల పాత్రయందుంచిన నాయాకారమునే పొందుచున్నది. ఆరీతి నే నామరూప రహితుడగు భగవంతుడు జగత్తంతయును వ్యాపించియున్నాడు. ఏరీతిని యుపాధినికల్పించిన దానికే సరిపోవుచున్నాడు. ఆయుపాధినే భగవంతుడని మనము భ్రాంతిపడకుండుటకు శ్రుతి నేతివాక్యములను చెప్పుచున్నది. భగవంతుడు శ్రుతినిటుల నడుగుచున్నా డనుకొనుము. ఓశ్రుతీ నేను ఏపదార్థమును; శ్రుతి విమర్శించి స్వామీ నీ వేపదార్థమునుకావు. కాని అన్నిటియందున్నావు. ప్రతిపదార్థమును నీవేయందునా అది సరికాదు. ప్రతిదానికిని నామరూపములున్నవి. ఆనామరూపములు నీవు సృష్టించుటవలన గలిగినవి. అంతకుముందేయున్న నీకు నామరూపములులేవు. పోనిమ్ము నీవెద్దియును కావనియందునా అదియును సరికాదు నీవులేని దొకటియు జగమునలేదు. నీవు సర్వవ్యాపివి. కావున నేనేమిచెప్పుటకును శక్యములేకున్నది. ఇంతియేకాక నిన్ను ప్రత్యక్షముగా (direct) చెప్పుదమనంటేనా నీవు సచ్చిదానందమనుటకంటె నధికము చెప్పనేరను. నామరూపము లాధారముగాగలభావముతో నామరూప

రహితుడవగు నిన్నెటుల జెప్పగలను. కావున నీవేదియుకావు. అన్నియు నీవే యనుటకు దగునటులనున్నావు. నిక్కమూహించినచో నీయుపాధులు నీవు కావు. అని యిటుల ముందువెనుకలుదోచక స్వవచనవ్యాఘాతమోయనునటుల బలుకుటచేత శ్రుతిశక్తిచాలక వణకుచున్నదని సొగసుగా జెప్పబడెను.

శి॥— అర్వాచీనమెట్టిది ?

గు॥—సృష్టికి లోబడినదంతయును వర్ణనకు లోబడినదే. అంతకుపూర్వమునయితము నున్న భగవంతుడు అర్వాచీనుడు ఆతని ప ర్వాచీనము. అది వర్ణనాసాధ్యముకాదు.

శి॥ —పతతి అనుటలో సొగసేమి ?

గు॥—తనకుమించిన సూర్యబింబము నంటబోయి పిట్టయొకటి మీదికెగిరియెగిరి యలసి క్రిందబడునటుల మనబుద్ధిసయితము మూఁరవస్తువు నెరుగగోరి పరువులిడి శక్తి చాలక క్రిందబడుచున్నది. అని సూచించుచున్నది.

ఇటుల మొదటిశ్లోకమున దనయుత్సాహమును సంపూర్ణమహిమాస్తుతి

యసాధ్యమగుటచే యథాశక్తిసన్నుతియే గ్రాహ్యమగుటచే తనకు నుతిచేయ నధికారము కలదని నిర్ణయించెను. వర్ణ్యమగు భగవన్మహిమ ఇట్టిదని చెప్పుటకు సయితము సర్వోత్తమమగు శ్రుతి భయపడుచుండగా నితరుల కెవ్వరికి సాధ్యమగును. అని మహిమముయొక్క గొప్పతనము ప్రమాణ సహితముగా నుతింపబడినది.

మరి యింతటి యసాధ్యకార్యమునకు ప్రయత్నింపనేల అని శంక రాగా తరువాతి శ్లోక మాశంకను పరిహరించుచున్నది.

శ్లో॥ మధుస్ఫీతావాచఃపరమమమృతంనిర్మితవత
స్తవబ్రహ్మన్కింవాగపిసురగురోర్విస్మయపదం
మమత్వేతాంవాణీంగుణకథనపుణ్యేనభవతః
పునామీత్యర్థేస్మిన్పురమథనబుద్ధిర్వ్యవసితా॥ 3

టీ॥ హేబ్రహ్మన్=సర్వవ్యాపకుడవగు శివుడా; పరమమమృతం=సర్వోత్కృష్ట

మగు నమృతస్వరూపమయి, మధుస్ఫీతావాచః=తేనెవలె మధురమగు వాక్కులను (వేదములను) నిర్మితవతః=సృష్టిచేసినట్టి, తవ=నీకు, సురగురోః=దేవగురుడయిన బృహస్పతియొక్క, వాగపి=మాటసయితము, విస్మయపదం=ఆశ్చర్యమునుగలిగించునది, కిం=(అగునా) ఏమి. (కాదనుట). తు=మరియేమనిన, భవతః=నీయొక్క, గుణకథనపుణ్యేన=గుణములను వర్ణించుట అనెడు సుకృతముచేత, మమఏతాంవాణీం=నాయీనోటిని (స్తోత్రమును మాటలను) పునామి=పవిత్రము చేసికొనుచున్నాను. ఇతి అస్మిన్నర్థే=అనునట్టి యీ పనియందు, హేపురమథన=ఓత్రిపురహర, బుద్ధిః=నాబుద్ధి, వ్యవసితా=ప్రవర్తింపబడినది.

గు॥—మొదటిశ్లోకమున రెండంశములు చెప్పబడినవి. అందు మొదటిది భగవంతునిపూర్తిగా నుతింపజాలుట అసాధ్యమనునది. రెండవది అసాధ్యమయ్యును శక్తివంచన చేయక నుతించువారి నుతులను స్వామి గైకొనక తప్పదనునది. అంతమాత్రము నజాలదు. ఈరెండవయంశముయొక్క అంతర్భాగముగా మఱియొకటి కలదు. జీ

వులు శక్తివంచనలేక నుతిచేయునపుడు దానిని స్వామి యంగీకరింపక తప్పదను
ట నిర్ణయింపబడెను కాని జీవులు శక్తివంచనలేక నుతింపకతప్పదనుసంగతి యె
చ్చట విధింపబడినది. అని శంక కలుగునపుడు దానికి సమాధానమిందు పొందు
పరచబడినది. అది వివరించెదను వినుము. ఓస్వామీ సర్వశ్రేష్ఠమగు నద్భుతమౌ
యవాఙ్మనస్కగా వేదమునొనరించితివి. అట్టినీవు (దేవగురునికవనమైనను) ఆశ్చ
ర్యమును కలిగించునది కానేరదు. మరినాకవనము నిన్ను సంతోషింప జేయునా?
కాదు ఈసంగతినే నెరిగియుండు నిన్ను నుతించుట కారంభించుచున్నాను. ఏలన
నగా నిన్ను నుతించుటవలన పవిత్రుడనగుదునని ఆశచేత నిటుల నాబుద్ధిప్రవర్తిం
చినది.

అనిశ్లోకతాత్పర్యము.

శి॥—అయ్యా జీవులునుతింపక తప్పదని మీరువివరించిన శంకాసమాధానము లిందులేవే.

గు॥— ఉన్నవి. తెలిపెదను. అయినను ఒకటి యడిగెదను. శ్లోకమంతయు నీకు లెస్స
గా తెలిసినదా?

శి॥— తెలిసినది.

గు॥— పుష్పదంతుడు నుతియందేల ప్రవర్తించెను?

శి॥— మోక్షముకొరకు.

గు॥— దేనినుండి?

శి॥— సంసారబంధమునుండి.

గు॥— బంధము అనగానేమి? ముక్తి అనగానేమి?

శి॥— బంధము దుఃఖము. ఆదుఃఖనాశనమూలమున సుఖప్రాప్తి ముక్తి.

గు॥— మంచిది. ముక్తిని కోరనేల?

శి॥— ప్రతిజీవునకును ముక్తినిగోరుట స్వభావసిద్ధము.

గు॥-స్వభావసిద్ధమగు నంశమును మరలప్రమాణాంతరములచే సాధింప నవసరముండునా?

శి॥— ఉండదు.

గు॥— కావున ప్రతిజీవుడును ముక్తినిగోరుట సిద్ధమే (Proved or Established
or Admitted) కదా?

శి॥— అగును.

గు॥— అటులయిన దుఃఖరూపమగు సంసారనాశనమూలమున సుఖప్రాప్తిని గోరుట సర్వజీవస్వభావ మనుట సిద్ధము.

శి॥— ఇదియే మీద జెప్పిన సిద్ధాంశము.

గు॥— మంచిది. ఏదేని యొక కార్యము స్వభావసిద్ధమగునపుడు అది కర్తవ్యమా కాదా?

శి॥— కర్తవ్యముకాని కార్యమెన్నడును స్వభావసిద్ధము కానేరదు.

గు॥— అనగా స్పష్టముగా జెప్పుము.

శి॥— ఏదేని యొకటి సర్వజీవులును స్వభావసిద్ధముగనే కోరునపుడు అది విధిగా వారు సాధింపవలసినదియే యగును. అసాధ్యమగు దానియందు గాని నింద్యమందు గాని సర్వజీవులకు నొక్క తీరున బుద్ధి ప్రవర్తించదు.

గు॥— అటులైన నొక ఫలము సర్వజీవులును గోరునపుడు దానిని సాధించుట వారికి విధింపబడినదే కదా?

శి॥— అవును.

గు॥— ఫలము విధింపబడినపుడు తత్ప్రాప్తికి హేతువగు సాధనమో?

శి॥— అనింద్యసాధనమగు నేని సాధనముసైతము విధింపబడినదే.

గు॥— అనింద్యసాధనమని యనుటేల?

శి॥— సాధనాబహుత్వమున్నపుడు అనింద్యసాధనమే గ్రాహ్యము. నింద్యసాధనము త్యాజ్యము. ధనము సాధ్యఫలమగునపుడు చౌర్యహింసాది సాధనములు నింద్యములు, త్యాజ్యములు, తదితరములగు సాధనములు గ్రాహ్యములు.

గు॥— ఇందుకు ప్రమాణమేమి?

శి॥— శ్రుతియే.

గు॥— ఏది?

శి॥— "యాన్యనవద్యానికర్మాణి। తానిసేవితవ్యాని! నోఇతరాణి। యాన్యస్మాకం సుచరితాని। తానిత్వయోపాస్యాని। నోఇతరాణి" అని.

గు॥— ఇందువలన విహితకర్మాచరణమును నిషిద్ధకర్మత్యాగమును విధింపబడినవేకదా?

శి॥— అవును.

గు॥— ముక్తియును దానిసాధనమును విధ్యుక్తములేనా?

శి॥— అవును. శ్రుతియునుకలదుగదా, "బ్రహ్మవిదాప్నోతిపరం" "యోవేదనిహితం గుహాయాం। సోఽశ్నుతే సర్వాన్ కామాన్" "ధర్మంచర" ఇత్యాదులెన్నియో శ్రుతులుకలవు.

గు॥— అది నిక్కమే. ముక్తిసాధనములు విధింపబడినవా?

శి॥— విధింపబడినవి.

గు॥— ఎవ్వి?

శి॥— జ్ఞానకర్మలు.

గు॥— వీని స్వరూపమెట్టిది? నింద్యసాధనములా? అనింద్యములా?

శి॥— శ్రుతిచోదితములు నింద్యములెటులగును. విహితములే.

గు॥— అనింద్యసాధనములెవ్వి?

శి॥— భక్తిహీనములగు జ్ఞానకర్మలు.

గు॥— ఏల?

శి॥— జ్ఞానకర్మల రెండింటియందును భక్తి శరీరమున ప్రాణమువలె వ్యాపించియుండు ననియును భక్తి లేనపుడు ప్రాణహీనమగు కళేబరములవంటివేయనియును శ్రీమద్భాగవతశిరమున మీరే చెప్పియుంటిరికదా.

గు॥— అవును. అందువలన జ్ఞానకర్మలు రెండును ముక్తిసాధనములనియు వాని నాచరించుట విధియనియు నిశ్చితమేనా?

శి॥— ఆగును.

గు॥— ఇందు ప్రాణమేది?

శి॥— భక్తి.

గు॥— స్వామిమహిమను నుతించుట భక్తికార్యమా?

శి॥— సంశయమేమి?

గు॥— భక్తివిహితమగునపుడు భక్తిప్రదర్శినియగు సన్నుతి విహితమా? కాదా?

శి॥— ఎటులకాకుండును. తప్పక విహితమే.

గు॥— ఇపుడీచర్చవలన దేలిన ఫలితమేమి? సూక్ష్మముగా జెప్పుము.

శి॥— జీవులందరు సంసారబంధమునుండి ముక్తిని కోరుదురు. ముక్తియును ముక్తిసాధనమును శ్రుతియందు విధింపబడినవియే. ముక్తిసాధనములగు జ్ఞానకర్మలకు భక్తిప్రాణము. సన్నుతి భక్తిస్వరూపము. కావున భగవంతుని సన్నుతించుట సర్వజీవులకును విహితకార్యము. (Duty or obligation.)

గు॥— ఇదిచూచియే పుష్పదంతుడు స్వామీ నేను (ముక్తినపేక్షించి) పవిత్రుడనగుదును గాక యని నిన్ను నుతించుచున్నాననెను. మీదచెప్పిన శంకాసమాధానము లీశ్లోకమున నున్నదియు లేనిదియు నిపుడు చెప్పుము.

శి॥— అయ్యా బాగుగా నాచేతనే చెప్పించితిరి.

గు॥— మరియొకటికలదు చూడుము. స్వామిని నుతించుట శ్రుత్యుక్తము కావున జీవులకు విధి అనిమాత్రమే యీచర్చవలన తేలినది. అంతేకాక శ్రుతిప్రమాణముక్కూరిలేకయే యీయంశము సాధింపవచ్చును.

శి॥— ఎట్లు?

గు॥— జగత్తును విచారించునపుడు విమర్శకొలదిని మనకు జ్ఞానముప్రబలుచు మనయల్ప

తయును జగత్కర్తయగు భగవంతుని మహిమోన్నతియును కొంచెముకొంచెము తెలియుచుండును. అందువలన మనకు సంతోషము ఆశ్చర్యముకలుగుచుండును. మనబుద్ధిబలము చాలదని తోచుచుండును. భగవంతుని మహిమ మవాఙ్మానసగోచరమని తెలియును. ఇదియంతయు నుతియేకదా. ఇదియును సర్వజీవ స్వభావసిద్ధమేకాక మరియేమి?

శి॥— అయ్యా భగవంతుని జీవులు నుతించుట విధి వారినుతుల నాత డంగీకరించుట యాతనికి విధియని తేలినది. అయినను జీవులనుతు లాతని కవసరములా?

గు॥— కావు. జీవులకే యావశ్యకములు. అయినను ఆతడానందించును. స్తోత్రములు కవితాధర్మమునుబట్టి యెంతప్రశస్తములయినను గాకున్నను ఆతడుమాత్రము వాని యందలి భక్తినిబట్టి గైకొనును. ఆతడానందించుటయు జీవసంరక్షణార్థమే. జీవుల యధికారతారతమ్యమునుబట్టి వారియందు కటాక్షించుచు ముక్తినిచ్చును. మరియు తనతోసాటియగువాడు మరియొకడులేమింజేసి తనకల్పులయ్యును భక్తులతో విలాసముగ నాటలాడుచుండును.

శి॥— భగవంతుని లీల లతిచిత్రములు. ఆతనిభక్తులకు గాక లాతివారి కేటుల దెలియ నగును. అయ్యా శ్లోకమున 3 వ చరణముననున్న " తు అను అవ్యయమునకు సారస్య మేమి?

గు॥— మొదటి రెండు చరణములందును తన [illegible]శక్తిని పుష్పదంతుడు స్థిరపరిచెను. ఆ మీద ఏల నీ నుతికి పూనుకొంటివని తనపై యాక్షేపమురాగా ప్రయోజనమును జెప్పుచు నాయాక్షేపమును శ్లోకముయొక్క ఉత్తరార్థమునబరిహరించుచున్నాడు. తానశక్తుడయినను భగవత్కటాక్షప్రాప్తిద్వారమున ముక్తిఫలమున పేక్షించి దానికి సాధనమగు స్వామిసన్నుతి యవశ్యముకావున జేయుచున్నానని చెప్పబడెను.

శి॥— అయ్యా తనను పవిత్రునిజేయుము అని వేడుకొనునప్పుడు పురమథన అను వీర రౌద్రరసవాచకంబగు శబ్దముచేత స్వామిని సంబోధించుట యుచితమా!

గు॥— ఓయీ పురమథన యను పదము ఇచట విశేషార్థమున వాడబడినది. అది సాభిప్రాయము. జీవునకు శరీరము నవద్వారములుగల పురము. శరీరము వెనుక శ

రీర మెల్లపుడు జీవుడు పొందుచుండును. "వాసాంసి జీర్ణాని యథా విహాయ నవానిగృహ్ణాతి నరోపరాణి । తథాశరీరాణి విహాయజీర్ణా న్యన్యాని సంయాతి నవానిదేహీ॥" అను గీతావాక్యము నూహింపుము. మాసినవస్త్రములను విడిచి నూతనవస్త్రముల మానవుడు ధరించుచుండునటుల జీవుడు మాసినదేహములను విడిచి నూతనదేహములను పొందుచుండుననికదా.

ఇదియే జననమరణరూపమగు సంసారము. శరీరధారణ మెన్నడును లేకుండుటయే ముక్తి. అది కావలసినవాడు పురనాశకుడు అనగా సంసారనాశకుడగు వానినే శరణము వేడవలయునుగదా.

శి॥— అయ్యా త్రిపురాసురులని ముగ్గురుండగా నిటుల చెప్పదగునా?

గు॥— పురమథన అను సమాసమున పురశబ్దమునకు బహువచనమే చెప్పవలయునను నీమము లేదు. ఏకవచనము చెప్పుటయు సరియే. అయినను ఇచ్చట బహువచనము చెప్పవచ్చును. జీవునకు స్థూల, సూక్ష్మ, లింగశరీరములు మూడును కలవు. ఈమూడును నశించిననేకాని ముక్తుడు కానోపడు. కావున ఈ మూడు

శరీరములను త్రిపురాసురులవలె జీవుని బాధించుచుండ పురమథనుడే ముక్తినిచ్చు వాడు. అందువలన నీశబ్దము మిక్కిలియుచితముగానున్నది.

శి॥— అయ్యా నేను ప్రవర్తించుచున్నానని యనక నాబుద్ధి ప్రవర్తించినది అని యను ట భాషారీతియేనా లేక అందుసైతము సారస్యమున్నదా?

గు॥— ఉన్నది. బుద్ధిఅనునది అధ్యవసాయము. అనగా ఇదిఇదియని నిశ్చయించుశక్తి. నేను అని సామాన్యముగా జెప్పక యుక్తాయుక్తములను విమర్శించు నాబుద్ధి శక్తి నిన్ను నుతింప నిశ్చయించినదనెను.

శి॥— ఈతనిబుద్ధిశక్తి చేసినవిమర్శయేమి?

గు॥— ముక్తి తనకవశ్యకమనియు దానినిపొందుటకు బ్రహ్మవిచారమావశ్యకమనియు అది భక్తిచే నను ప్రాణితమగునది యనియు శరీరత్రయవిలక్షణమగు ముక్తినిచ్చుటకు చిరకాలవాసనాప్రాప్తమగు సంసారరూపశరీరమును నాశనముజేయు పురమథ నుడే సమర్థుడనియు విమర్శచే సప్రమాణముగా నిశ్చయించెను. ఇదియంతయు బుద్ధిశక్తియొక్కపని. కావుననే శ్రీకృష్ణభగవానుడు "యదాతే మోహకలిలం

బుద్ధిర్వ్యతితరిష్యతి। తదాగంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్యచ॥" అని గీతలం దుపదేసించెను. జగత్తు సత్యమనియు, ఆత్మ అసత్యమనియు పామరులకు భ్రాంతికలుగుచుండగా బుద్ధిశక్తి విమర్శించి దీనికి వ్యతిరేకముగా నిశ్చయించుచు న్నది. ఆవిమర్శయందు దోషములేకుండునటుల శ్రుతియును భగవత్కటాక్ష మును బుద్ధికి తోడగును. కావున నీబుద్ధియందు అజ్ఞానమాలిన్యములేకుండునపు డు యదార్థము తెలియునని యుపదేశము. కావున నాబుద్ధిశక్తి నిర్దుష్టముగావిమ ర్శించి ప్రవర్తించినదని యుచితముగా జెప్పబడెను.

శి॥— అయ్యా శ్రుత్యనుగ్రహీతతర్కము బుద్ధికి తోడగుట యుక్తము. భగవత్కటా క్షము సైతము తోడగుననుటకు ప్రమాణమేమి?

గు॥— తనకెవనియందు కటాక్షముకలుగునో యాతని యందున్న తనయందలిభక్తిని పు ట్టించును. "యమేవైష వృణుతే తేనలభ్యః" ఇత్యాది ప్రమాణము లనేకములు గలవు. శ్రీమద్భాగవతశిరమున విపులముగా జెప్పబడెను.

శి॥— సురగురువనగా సురజ్యేష్ఠుడగు బ్రహ్మయని యర్థముచేయరాదా?

గు॥— చెప్పవచ్చును. శ్లోకమున కర్థమునందు భేదముండదు. అయినను ఇచ్చటచెప్ప గాదు. మొదటిరెండుశ్లోకములందును బ్రహ్మముఖమునుండి వెల్వడిన శ్రుతిని గూర్చి ముచ్చటించెను. పుష్పదంతుడీస్తోత్రమును శ్లోకరూపమున జేయు చుండుటచే సర్వోత్తమకవియగు బృహస్పతియొక్క కవనమే నీకాశ్చర్యము ను గలిగింపనేరదుకదా నాకవనమా నిన్ను ఆనందింపజేయును. చాలదు. అని కవితాశక్తినిగూర్చి ముచ్చటించుచు బృహస్పతి నుద్దేశించెను. బ్రహ్మయనియర్థ ము చెప్పవచ్చునుగాని పునరుక్తిదోషము బట్టును. కావున నది గ్రాహ్యముకాదు. ఇంతేకాక సురగురు శబ్దము పంకజాదిశబ్దములవలె బృహస్పతియందు రూఢిప దము అనవసరముగా అవయవార్థమునుబట్టి బ్రహ్మయనిచెప్పరాదు.

శి॥—అయ్యా బుద్ధిర్వ్యవసితా (ఉంచబడినది) అనెను ఎవనివలన?

గు॥—విమర్శవలన. బుద్ధిబాగుగా విమర్శించి అందువలనదేలిన సిద్ధాంతములవలన ఉంచబ డినది. అనగా శ్రుత్యనుగ్రహీతవిమర్శాసాధిత సిద్ధాంతములననుసరించి ప్రవర్తించె ననుట అనగా పుష్పదంతుడన్నియు బాగుగానాలోచించి స్వామిని నుతించుట

యే ముక్తిసాధనమని నుతింపనారంభించెను.

ఇటుల భగవంతుని మహిమ యనంతమనియును వేదములకునైతము పూర్తి గాదెలుపసాధ్యముకాదనియును భక్తులొనరించు స్వల్పనుతులయినను భగవంతు డంగీకరింపక తప్పదనియును తానునుతించుట విధియనియును అయినను తన శ్లో కరూపమగునుతి కవితాశక్తియందైనను స్వామినిసంతోషింప జేయజాలదనియు ను భక్తిమాత్రమునే స్వామిగైకొనవలయుననియును సాధించి తాను నుతిజేయ భగవంతుని యైశ్వర్యోన్నతి నిటు తరువాతిశ్లోకమున జెప్పుచున్నాడు

శ్లో॥ తవైశ్వర్యంయత్తజ్జగదుదయరక్షాప్రళయకృత్
త్రయీవస్తువ్యస్తంతిసృషుగుణభిన్నాసుతనుషు
అభవ్యానామస్మిన్వరదరమణీయామరమణీం
విహంతుంవ్యాక్రోశీంవిదధతఇహైకేజడధియః॥ ౪

టీ॥ హేవరద=అభయప్రదానమొసగెడు ఓదేవా, యత్తవఐశ్వర్యంతత్=నీప్రభుత్వము, త్రయీ=మూడువేదములయందును (కొనియాడబడుచుండు) వస్తు=పదార్థము; మరియు, గుణభిన్నాసు=గుణములనుబట్టి వేరువేరుగాగనబడు, తిసృషు, తనుషు=(బ్రహ్మవిష్ణురుద్రరూపములగు) మూడుశరీరములందును, న్యస్తం=ఉంచబడినది, (అందువలననే) జగదుదయరక్షాప్రళయకృత్=లోకముయొక్క ఉత్పత్తిస్థితిలయములను జేయునట్టిది, (అయినను) అస్మిన్=ఇట్టిమహోన్నతమగునీప్రభుత్వమందు (దానిని) విహంతుం=కొట్టుటకు, అభవ్యానాం=పాపులకు, రమణీయాం=మనోహరముగానుండునట్టియు, అరమణీం=(నిక్క మెరిగినవారికి) మనోహరముకానట్టియు, వ్యాక్రోశీం=నిందారూపమగు మొర్రను, ఏకేజడధియః=కొందరుమందబుద్ధులు, ఇహ=ఈలోకమున; విదధతే=చేయుచున్నారు.

గు॥— భగవంతునిఐశ్వర్యము మిక్కిలిగొప్పది. అనిసామాన్యముగా జెప్పుచు కొందరు దుష్టచిత్తులు తెలివిలేక అమంగళములగు పలుకులనుపలుకుచున్నారనిచెప్పుచున్నాడు.

శి॥—అయ్యా, స్వామినినుతింప సమకట్టువాడు నుతిమాని యితరులను దూషింపనారంభించుట యుచితమగునా?

గు॥— ఉచితమే. ఎటులనిన, నుతిచేయబడువస్తువును దూషించువారిని నిందించుటయు నొకరీతి నుతియే. మరియు స్వామినినుతించు నానందము మిక్కిలిప్రశస్తమని తాను సద్విమర్శాపూర్వకముగా నిర్ణయించి నుతినారంభించితిననికదా గతించిన శ్లోకమున జెప్పబడినది. అందువిూదనొకశంకకలిగినది. “ఓయీపుష్పదంతా! నీవలెనే మరికొందరు బుద్ధిమంతులు విమర్శాపూర్వకముగానే మరియొకతీరున నిర్ణయించిరికదా దానికేమనియెదవు” అనిశంకరాగా, దానికి సమాధానమిందు చెప్పుచున్నాడు. వారివిమర్శ సద్విమర్శకాదు. వారుచెప్పునదివట్టిమొర్ర. దానియందుతత్వములేదు. అదిభాగ్యహీనులకే రమణీయముగానుండును గాని స్వామికటాక్షమునకు పాత్రులయి భాగ్యవంతులగువారికిమాత్రము రమణీయముగానుండదు. కారణమేమనిన అదిశ్రుత్యనుగ్రహీతతర్కముకాదు, కుతర్కము. ఈసంగతి యింకను ముందుముందుబాగుగా చర్చించబడును.

ఇంకను కావ్యారంభమున కుకవినిరసనము చేయుట ఆలంకారికులు విధించిన యాచారము. ఇదియు మహాకావ్యము. కావున నాలంకారికుల యాచారము ననుసైత మెప్పియున్నది. శ్రుత్యేతర మతనిరసనము కుకవినిరసనము కావున నన్నివిధములచేతను శ్రుతివిరుద్ధమతనిరసనము మిక్కిలియుచితముగానున్నది.

ఇంతేకాక మహాభక్తులు తమవలెనే తక్కినవారును సుఖింపవలయునని కోరుచుందురు. వారికి జీవులందరియందును ప్రీతియే. తనకు ప్రీతిగలవాడు చెడుచుండునపుడు వానినిగూర్చి కనికరించును. మందబుద్ధియయి చెడుచున్నాడని పరితపించును. ఇదిభక్తులహృదయధర్మము. మునుపు ప్రహ్లాదుండు నృసింహమూర్తినినుతించుచు జీవులనుద్ధరింపుమని యిట్లు వేడుకొనెను.

మ॥ భగవద్దివ్యగుణానువర్తన సుధాప్రాస్త్యైకచిత్తుండనై
బెగడన్ సంసరణప్రవైతరణికిన్ భిన్నాత్ములై తావకీ
య గుణస్తోత్ర పరాఙ్ముఖత్వమున మాయాసౌఖ్యభావంబులన్
సుగతింగానని మూఢులంగని వదిన్ శోకింతు సర్వేశ్వరా॥ భా॥ ౭ స్కం॥ 365.

నాకు సతమిటుల నే శోచుచుండు.

శా॥ నీభక్తుం డెవడేని కష్టపడునే నీవండగానుండగా
నీభవ్యాంఘ్రిసరోజసేవనకళా నీమంబె సద్భక్తియున్
నీభద్రాద్భుతలీలలం దెలియుటే నీయాభిముఖ్యంబు స
ర్వాభీష్టాప్తియె ముక్తి తావక కృపైకాయత్తమో యీశ్వరా॥

శా॥ స్వామీ, నాగతికించమైన వగవన్ సద్భక్తియుక్తుండనై
నీమాహాత్మ్యము తేటతెల్లమగుచు న్దీపింపనన్నింటిలో
నీమర్త్యావళి భక్తిలేమిగన వేరేమందు వీరెట్లు నీ
ధామంబున్గని ధన్యులౌటయని సంతాపంబు నాకీశ్వరా॥

కావున భక్తలక్షణముల నెరింగితిమేని యిది నిందకాదు—కనికరమే యగును.

శి॥— వ్యాక్రోశియనిన నిందయేకదా

గు॥—అగును అది లక్షణార్థము. శబ్దార్థముమాత్రము విరుద్ధమగు పెద్దకేక, మొఱయని

యర్థము. అది నిందారూపమగుటచే నిందయను నర్థము లక్షణార్థము. ఇచ్చట రెండర్థములును పొసగియున్నవి

శి॥— అయ్యా! ఇందలి నుతిస్వరూపమెట్టిది?

గు॥—భగవంతుని మహిమ జగత్కారణరూపమున నుతింపబడినది.

శి॥— అయ్యా భక్తిహీనులు అమంగళములగు వాక్యములను బలుకుచున్నారనియె అనెను. కాని ఆవాక్యము లెవ్వియో చెప్పకుండుటకు కారణమేమి?

గు॥— ఈశ్లోకమున వానిస్వభావము అమంగళమని సామాన్యముగా జెప్పి ముందు వానిని వివరించుచున్నాడు చూడుము.

శ్లో॥ కిమీహఃకింకాయస్సఖలుకిముపాయస్త్రిభువనం
కిమాధారోధాతాసృజతికిముపాదానఇతిచ
అతర్క్యైశ్వర్యేత్వయ్యనవసరదుస్థోహతధియః
కుతర్కోఽయంకాంశ్చిన్ముఖరయతిమోహాయజగతామ్॥ ౫

టీ॥ కిమీహః=ఎట్టివ్యాపారముకలవాడయి (మరియు) కింకాయః=ఎట్టిశరీరముకలవాడయి (మరియు) కిముపాయః=ఎట్టి యుపాయముకలవాడయి (మరియు) కిమాధారః=ఎట్టి ఆధారముకలవాడయి, త్రిభువనం=మూడులోకములను, ధాతా=బ్రహ్మరూపమునుపొంది సృష్టిచేయుచున్న భగవంతుడు, సృజతి=సృష్టిచేయుచున్నాడు; ఇతిచ=ఇట్టులను, అతర్క్యైశ్వర్యే=ఊహింపశక్యము కాని మహిమగల, త్వయి=నీయందు, అనవసరదుస్థః=అవసరము (అక్కర, జరూరు) లేనట్టిదుర్మార్గతగల, అయంకుతర్కః=మీదవివరించినట్టియు దోషములతో నిండినట్టియు తప్పువిచారము, కాంశ్చిత్ హతధియః=కొందరు చెడుబుద్ధి గలవారిని (వారిచేత) జగతాంమోహాయ=లోకులను భ్రమపెట్టుటకొరకు, ముఖరయతి=ధ్వనిచేయించుచున్నది.

గు॥—ఈశ్లోకముమొదలు ౯వ శ్లోకమువరకును విమతశంకానిరసనపూర్వకముగా బ్రహ్మవిష్ణుమూర్తులను నుతించుచున్నాడు.

శి॥—అయ్యా, శివమహిమను నుతించునపుడు బ్రహ్మవిష్ణుమూర్తులను నుతింపనేల?

గు॥— ఓయీ ఈస్తోత్రమునకు పేరు మహిమ్నస్తోత్రమనియే కాని యెవనిమహిమయో చెప్పబడలేదు. ఆయన పేరు వక్కాణించి చెప్పినచో గుణములతో గూడిన మూర్తినే నుతింపవలసివచ్చును. సగుణమూర్తియె పొడకట్టును గాని జగత్కారణమగునట్టియు నామరూపాది గుణాతీతమగునట్టియు భగవన్మహిమ యనితోచదు. పుష్పదంతుడు జగత్కారణమును నిర్గుణమును మహిమామాత్రమునగు భగవంతుని నిర్గుణముగాను సగుణముగాను రెండువిధములను నుతింపసమకట్టి నిర్గుణమహిమోన్నతితో నారంభించెను. పిమ్మట సగుణరూపములను నుతించెను. ఇదివరకు భగవంతుని మహిమోన్నతి సత్వరజస్తమోగుణములను గైకొని బ్రహ్మవిష్ణురుద్రరూపములచే సృష్టిస్థితిలయము లొనరించు నని వెనుకటిశ్లోకమున జెప్పెనుగదా!

అందు ముందుసృష్టికార్యమునందు ప్రవర్తించినట్టియు రజోగుణరూపమయినట్టియు బ్రహ్మమూర్తిని ముందుగానిందు నుతించుచున్నాడు. ఈనుతి రజోగుణ విశిష్టమగు భగవన్మహిమకే గాని దానికంటె భిన్నమగుదానికి కా

నేరదు. సగుణోపాసనయందు రూపభేదము మొదలగు భేదములుండును. అయినను తత్వమొకటియే. నామరూపాది భేదములులేని వస్తువును మనమూహింపజాలము. కావున సగుణోపాసనము మనకవసరముమాత్రమే కాక సుకరమును క్షేమకరమును అగును.

ఇక నీశ్లోకార్థమును బాటింపుము. వెనుకటిశ్లోకమున సామాన్యముగా జడధియులమతమును నిరసించి యిదిమొదలు వారి మతములను విశేషముగా చెప్పుచున్నాడు. వారుచేయునట్టి కుశంకలను వివరించుచున్నాడు.

ఓ పుష్పదంతుడా భగవంతుడు రజోగుణమును గైకొని ధాతృనామమున జగత్తు సృష్టిచేయుచున్నాడని అనుచున్నావుగదా! ఈప్రశ్నలకు సమాధానము చెప్పుము.

1 ఆతడు ఎట్టి శరీరముకలవాడు?

2 ఆతడు ఎచ్చోటనుండి యీపనిచేయుచున్నాడు?

3 ఏలాగునచేయుచున్నాడు?

4 ఉపాయ మెయ్యది ?

5. ఉపాదానకారణ మెయ్యది?

అని ముందు ఈఅయిదు ప్రశ్నములెత్తుకొనబడియెను.

శి॥— అయ్యా మిక్కిలి ముచ్చటగానున్నది వివరముగా నంతయు వినఁగోరెదను.

గు॥— ఓయీ, ఈవిమర్శలన్నియు మహావిపులములగు శాస్త్రగతములు. విశేషపరిశ్రమచే బహుకాలమునకుగాని బోధపడుట కష్టము. అయినను స్థాలీపులాకన్యాయమున యించుక చెప్పెదను వినుము.

సృష్టికర్తకు శరీరము, ఆధారము, ఉపాయము, ఉపాదానము మొదలగునవి యుండుట మనసృష్టియందు జూచుచున్నామనుట నిక్కమె ఒకకుండను మనము చూచినతోడనే కులాలుఁడొకఁడు, మన్ను, కుళాలచక్రము, మొదలగునవియుండక కుండచేయబడదని యెరుగుచున్నాము. ఈఅభ్యాసమును బట్టి జగత్తునైత మొకనిచే చేయబడవలెననియు నిశ్చయించుచున్నాము. కావుననే మీఁదిప్రశ్నల డుగుట కవకాశము కలిగినది కాని జగత్కర్తవిషయమున నిట్టి ప్రశ్నలడుగ

రాదు. ఏలయనిన భగవంతుడు సృష్టినొనరించుటకు దలచుట తనకంటెభిన్నమగు పదార్థమును కల్పించుటకాదు. జగత్తనునది యాతనికంటె భిన్నమయిన వేరొకపదార్థముకాదు, అద్వితీయుడుగానుండు భగవంతుడే 'అనేకత్వరూపమున వ్యవహరింతునుగాక' యనిసంకల్పించెను. వస్తువు ఒక్కటేయుండునపుడనేకత్వమెటులవచ్చును? బంగారమొకటియేకదా అనేకత్వమెటులవచ్చును? నామరూపముల ననేకవిధముల గల్పించుటవలనవచ్చును కుండలములు, కంకణములు, వలయములు, నూపురములు మొదలగు నామరూపభేదములనుబొందిన యొక్క సువర్ణమే బహువిధముల వ్యవహరింపబడుచున్నది. ఆరీతినే జగదీశ్వరుడు తానొక్కఁడయ్యు ననేకనామరూపములను ధరించి తానే యానామరూపములందంతర్యామియయి జగద్రూపమున పరిణమించుచున్నాడు. అయినను కుండలాదికములన్నియు నామరూపములనువిడిచినపుడు మరల స్వర్ణమే యెట్లగుచున్నదో ఆరీతినే నామరూపములనువిడిచి జగత్తంతయు మరల బ్రహ్మమునందే పరిణమించును. అనగా కుండలాదిభేదము స్వర్ణమునకె నామరూపములనుబొంది

న యవస్థకెట్టుల వ్యవహారనామమో, ఆతీరుననే బహుత్వముగా వ్యవహరించునవస్థయందు భగవంతునికే జగత్తుఅని పేరు. అనగా నామరూపములకే జగత్తని పేరు. ఇది కల్పితముకాని యథార్థముకాదు ఇది అవస్థకు పేరు ఈఅవస్థ ఆద్యంతములుకలది. నిత్యముకాదు. భగవంతుడుజగత్తునకుముందును జగత్తునశించినవెనుకనుగూడ నిర్గుణుడైయుండువాడు. జగత్తనువ్యవహారదశయందుసైత మాతడుగాక మరియొకపదార్థములేకున్నను నామరూప బహుత్వమువలన నామరూపములే ప్రబలమయి యాతనినించుక మాటుపరచుచున్నవి. కుండలాదుల నామరూపములనుజూచుచు అవియన్నియు స్వర్ణమేయనుజ్ఞానమించుకతిరోధానమునొందుచుండలేదా? మనజగత్తను జ్ఞానముసైతమట్టిదే. ఇదిశ్రుతిసమ్మతము.

ఇది లెస్సగా భావించితివేని మీదవివరించిన ప్రశ్నలు అనవసరములు అని తెలియకమానదు. ఇక్కడ, అక్కడ, ఇప్పుడు, అప్పుడు, వాడు, వీడు అనుమొదలగు భేదములేలేని దశయందు, అనగా సృష్టికిపూర్వము ఈప్రశ్నలుండవుకదా. కుమ్మరివాడు కుండనుజేయునటుల భగవంతుడు జగత్తును నిర్మాణముచేసెనేని

ఈప్రశ్నలడుగవచ్చును. ఒకపుడు మంటియందే చైతన్యముండి తానె అనేకవిధములగు నామరూపములను గయికొని మన్నే వ్యవహరించుచున్నపుడు కుమ్మరియెవడు, చక్రమెయ్యది, అనుమొదలగు శంకలురావుకదా? ఆతీరుననే ఒక పురుషుడే అనేక అద్దములను ఒకగదిలో చుట్టునుంచి తాను నడుమనుండునపుడు తానొక్కడే అనేకరీతుల ననేకులుగా ప్రతిఫలించుట అందరెరిగినదే. ఆతీరున భగవంతుడు అనేకత్వమును గైకొందునని (సృష్టిచేయుదునని) సంకల్పించినతోడనే అనేక నామరూపములను తాను గైకొని వ్యవహరించుచుజగత్తను పేరునొందుచున్నాడేకాని యాతనికి నిక్కముగా నొకశరీరము, ఉపాయము, ఉపాదానము మొదలగునవి యుండనవసరములేకయే సృష్టిజరుగుచున్నది. కావున మీదిప్రశ్నలనవసరములు. కుండ కులాలునికంటె భిన్నమగునటుల జగత్తు ఈశ్వరునికంటె భిన్నమయినదని దోషయుక్తమగునూహతో తర్కించుట వలన నిట్టితప్పుశంకలు పొడముచున్నవి.

శి॥— అయ్యా ఉపాదాన కారణమన నేమి?

గు॥— కుండ కార్యము. మన్ను ఉపాదానము. సమీపమునకు తెచ్చుకొనబడినదని శబ్దార్థము. మన్ను తెచ్చి దానిని కుండగాచేయుదురు. స్వర్ణము తెచ్చి యలంకారములను జేయుదురు. ఇటుల వస్తువులను జేయుటకుముం దేవస్తువును దెత్తురో అది యుపాదానము (material cause)

శి॥— అయ్యా, ఇట్టిశంక లేలచేయబడును?

గు॥—భగవంతుడు జగత్కర్త కాడనుటకు.

శి॥— అందువలన ఫలమేమి?

గు॥—ఇట్టిశంకలను జేయువారు తాముచేసినశంకలు మిగులకఠినములనియు, నెవరుగాని సమాధానము నుడువజాలరనియు, కావున తాముమహాపండితులమనియు, వెల్లడిచేయుచు తమవంటి మందబుద్ధులవలని గౌరవముసంపాదించుటయొకటి, వారును తామునుగూడ మహేశ్వరుని మహామహిమ నెఱుంగక చెడుట మరియొకటి. అందువలన నేనాటికిని దరిజేరరాని సంసారసాగరమున దుఃఖములనొందుచుండుట మరియొక్కటి. మొత్తమున నిరంతరదుఃఖమే ఫలము. ఇదిమీదవివరించిన దోషయుక్తమగు కుతర్కమువలన గలుగుచున్నది.

జగత్తునువ్యవహారదశయందే ప్రవర్తించెడుతర్కము యావ్యవహారదశతో పుట్టి మరలదానితో నశించును జగత్తునకు పూర్వమునందును పరమందును నీతర్కమునకు ప్రవృత్తిలేదు. అది తెలియక పిడుగుబియ్యములకొకటే మంత్రమని యీయల్పతర్కము నాధారముచేసుకొని మహేశుని మహిమార్ణవము నీదబోయినచో నెవడు కడతేరగలడు.

శి॥— అయ్యా, మరియేరీతిని భగవంతుని సృష్ట్యాదికార్యముల మనమెరుంగగలము.

గు॥—మనతర్కముచాలదనియే మనకూహింపరాని విషయములను దెలియుటకు శ్రుతిని భగవంతుడిచ్చెను. దానినాశ్రయించి మనమెరుగవలయు.

శి॥— ముఖరయతి అననేల?

గు॥— ఈప్రశ్నలు అర్థములేనిధ్వని విశేషములని తెలుపుటకు అనగా ఇవి మొరకుల యరుపులుగాని నిక్కముగా వీనియందర్థములేదని తాత్పర్యము.

శి॥— అయ్యా, పుష్పదంతుడీశంకలకేమిచెప్పెను?

గు॥—స్వామి ఐశ్వర్యము. అతర్క్యము అనగా జగత్తులో పురుషులవలెనున్న మన

అల్పబుద్ధికి గోచరముకాని మహామహిమనుగూర్చి మనము చర్చించి తెలియనేరము. అటుల చేయుట అనవసరమే కాక మనమందబుద్ధిని వెల్లడించును అని.

శి॥— అయ్యా పోనిండు. ఆప్రశ్నలను నేను చేయను. మరియు భగవంతు డీజగత్తును చేసెననియును అనను. దీనికేమందురు.

గు॥—ఓయీ, నీవీనా డొక క్రొత్తశంకను చేసితివనుకొనకు. ఇదియు నీవరకు చేయబడినదే. ఇటుతరువాతి శ్లోకమును వినుము. ఈసంశయము నీకు వీడును.

శ్లో॥ అజన్మానో లోకాః కిమవయవవన్తోఽపి జగతా
మధిష్ఠాతారం కిం భవవిధిరనాదృత్య భవతి
అనీశో వా కుర్యాత్ భువనజననే కః పరికరో
యతో మందాస్త్వాం ప్రత్యమరవర సంశేరత ఇమే॥ ౬

టీ॥ హే అమరవర=ఓ దేవదేవ, లోకాః=లోకములు, అవయవవన్తోఽపి=అవయవములుగలవియయ్యును, అజన్మానః=పుట్టుకలేనివి, కిం=(అగునా) ఏమి;

(మరియు) జగతాం భవవిధిః=లోకములపుట్టుకయొక్క (సృష్టి) విధానము, అధిష్ఠాతారం=కర్తను, అనాదృత్య=ఆదరింపక (అక్కరలేక)యే, భవతికిం=అగుచున్నదాయేమి? (కాదనితాత్పర్యము) మరియు, అనీశః=ఈశ్వరునికంటె వేరగు మరియొకడు, కుర్యాత్ వా=చేయనగునా (ఈశ్వరునికంటె మరియొకడు చేయ నేరడని తాత్పర్యము), భువనజననే=లోకములను సృజించుటయందు, కః పరికరః=ఎవడు సమర్థుడు (ఈశ్వరుడేయనుట) యతః=ఎందువలన, ఇమే మందాః=ఈమందబుద్ధులు, త్వాం ప్రతి=నిన్ను గూర్చి, సంశేరతే=సంశయించుచున్నారో (అందువలన నీచర్చ కలిగినదనుట.)

గు—ఓయీ, అవయవములనగా దెలియునా?

శి॥— అవయవములనగా భాగములు. ఒకపదార్థముయొక్క వివిధభాగములను వివిధములగు నవయవములు.

గు॥—అవయములు గలిగినట్టియు మరియొకడు చేయనట్టియు పదార్థమొకటి చెప్పగలవా?

శి॥— లోకమున ప్రతివస్తువును ఒకడుచేయక కలుగనేరదు.

గు॥—జగత్తు అవయవములుకలదియేకదా?

శి॥— అగును.

గు॥—పుట్టుక అనగా నొకకారణముకదా

శి॥— అగును.

గు॥—జగత్తున కొక కారణముండవలదా? కారణములేక యింత కార్యసంఘాత మెటుల కలుగనేర్చును? కావున జగత్తునకు కారణములేదనుట సరికాదు.

శి॥— ఉండుగాక అంతమాత్రమునలాభ మేమి.

గు॥— పుట్టుకకలిగియు కర్తలేనివస్తువేదైన నొకటికలదా? లేదు. అందువలనజగత్తునుపుట్టించునది అనగాచేయునట్టిది అనగానొక కర్తయుండవలయును అతడేజగత్కారణమనియు ననబడును.

శి॥— అయ్యా కర్తయైతె మొకడుండుగాక అతడీశ్వరుడని యెట్లుతెలును? జగత్తును సృష్టిచేయునంతటి శక్తిమాత్రముండిన జాలును. అతడుసర్వేశ్వరుడనియు, సర్వజ్ఞుడనియు, సర్వశక్తివంతుడనియు నెటుల సర్వశబ్దములచే వ్యవహరింపదగును?

గు॥— లెస్సగానూహించితివి. ఈతీరుననే పాశ్చాత్యతార్కికుడు (Mill) మిల్లనువాతడు తన (Essays on Religion) మతవిషయికోపన్యాసములందు చర్చించెను. అయిననేమి నీవు జగత్తునుమించిన యూహజేయగలవా?

శి॥— నేను జగత్తుకంటె మరియొకటి యెరుంగను.

గు॥— అటులనే మనమనుకొను సర్వము అనుదానికర్థము జగత్తుఅంతయుననికదా?

శి॥— అగును యేదిచెప్పినను జగత్తులోనిదే సర్వమన్నను జగత్తన్నను ఒకటియే.

గు॥—మరిదీనియందు దోషమేమున్నది జగత్తుసృష్టిచేయుటకు జాలినంతశక్తి అనగాసర్వశక్తిఅనియే తేలుచున్నది.

శి॥— అగునగును.

గు॥— కావుననే సర్వశక్తుడనగా ఈశ్వరుడుజగత్కర్త అనియంటిని కావుననెపుష్పదంతుడిట్లనెను “ఓస్వామీ జన్మములేనిఅవయవి (అవయవములుగలది) యెచ్చటనులేదు అనగా అన్నియవయవులును జన్మముకలవి జగత్తు అవయవి. కావునజగత్తు జన్మముకలది. పుట్టుక కర్తలేక కలుగదు. కావున జగత్తునకొక కర్త

యుండకతీరదు. అట్టికర్తసర్వప్రభువగు ఈశ్వరుడే అనగా నీవే నీకంటెతక్కువవాడెటుల నీజగమును జేయుటకు సమర్థుడగును. ఓదేవదేవ యిదియెఱుంగక మందబుద్ధులు జగత్కర్తవగు నినుగూర్చి పలువిధముల సంశయించు చున్నారేల? వారటులసంశయించుచుండుటవలన నింతచర్చించవలసివచ్చెను. (కాని నీమహిమను, చర్చింప నేర్తునని కాదుసుమాయనిమనవి)

మఱియును. ఒకవేళనీవుచెప్పిన సర్వమనునది జగత్తుకంటె నధికమగుపదార్థమయినను బాధలేదు. జగత్తునుసృష్టించుటకు తగినశక్తిమాత్రముగలకర్త నొప్పుకొంటిమికదా. అతడు సర్వశక్తిమంతుడు కానక్కరలేదు కొంతశక్తి (అనగా జగత్తునుజేయుటకుజాలినంత) మాత్రముగలదేనిచాలును. అనియందువు. అటులనినిన సందర్భమేమియులేదు. జగత్సృజనకుచాలినమాత్రము శక్తిగల జగత్కర్తనొకనిని సర్వశక్తియుతుడయి జగత్కర్తకంటె అన్యుడగు మరియొకనిని యెవరునెఱుంగరు. కావున అట్టిసర్వశక్తుడింకొకడున్నాడనుట అసందర్భము. ఇకను నీవుచెప్పినజగత్కర్తయొక్క శక్తి జగత్తును సృజించుటకుమాత్రము సరిపో

వలయును గాని పరిపూర్ణము గునని కాకపోవచ్చును. అనియే తేలుచున్నది కాని, పరిపూర్ణముకాదు. అని నిర్ణయించుటకు వలనుగాదు ఇచ్చటనొక తార్కిక యుక్తి జూడుము.

ఒకదాత అర్థికొక రూప్యముమాత్ర మొసగెను. దానినిబట్టి దాతయొక రూప్యముమాత్రమే కలవాడు కాని అంతకంటె నెక్కుడు రూకలుకలవాడు కాడు అని యాచకుడు వాదించినచో నెవ్వరైన నామోదింతురా నీవాదుమిగుల నిందింతురు. అటులనే మనవాదమును దేలును స్వామీ నీవు జగత్తును సృష్టిచేసితివి, అంత మాత్రమునకు దగినశక్తి నీయందున్నది కాని పరిపూర్ణమగు సర్వశక్తిమంతుడవని నేననజాలను అనియొక జీవుడు పరమేశునితో విన్నవించెనేని యాతడిట్లనును. ఓయీ నీకొక్క యీజగమే యూహకు పొడగట్టుట కష్టముగానున్నది. ఇట్టివి వరకెన్నిగో పుట్టించితిని. ఇక నెన్నిగో పుట్టింతును. ఇపుడింక నెన్నిగో పుట్టియున్నవి. వానినిరక్షించుచున్నాను అల్పబుద్ధివగు నీకు అంతయుగోచరింపదు కావున సర్వశబ్దార్థము నీకెన్న మనుసరిగా తెలియజేయగదు. నీవు తెలిసినదే సర్వ

మని నీవనుకొనుచున్నావు. అటులనే జీవులందరు తమయజ్ఞానవశమున ననుకొందురు కాని నిక్కముగా నాయనంతశక్తి నెఱుంగరు అని ఇటులస్వామి ప్రత్యుత్తరమిచ్చెను.

శి॥— అయ్యా, ఇదియంతయు లెస్సగానున్నది. ఇంతటిమహాత్మ్యముగల నీమహిమల నెవరుదెలియగలరు జగత్తులనంతటతానే యున్నదన్నచో బాధకమేమి?

గు॥— ఆచ్చముటయు క్రొత్తదికాదు. ముందటిశ్లోకమునువినుము.

శ్లో॥ ధ్రువంకశ్చిత్సర్వం సకల మపర స్త్వధ్రువమిదం
పరోధ్రౌవ్యాధ్రౌవ్యేజగతిగదతివ్యస్త విషయే
సమస్తేప్యేతస్మిన్ పురమథన తైర్విస్మిత ఇవ
స్తువన్ జిహ్రేమిత్వాం నఖలుననుధృష్టాముఖరతా॥ ౭

టీ॥ హేపురమథన=ఓమహాదేవా; ఇదంసకలం=ఈసర్వమును (జగత్తంతయు) ధ్రువం=నిత్యము అని కశ్చిత్=ఒకడు, బ్రూతే=చెప్పుచున్నాడు; అపరః=

మరియొకడు, అధ్రువం=అనిత్యము; ఇతి=అని, (బ్రూతే=అనుచున్నాడు); పరః=ఇంకొకడు, ధ్రౌవ్యాధ్రౌవ్యేఅపి=నిత్యత్వము, అనిత్యత్వము రెండును, ఏతస్మిన్ సమస్తేజగతి=ఈసకలజగమునందును, వ్యస్తవిషయే=వేరువేరుభాగములందు (ఉన్నవి) (అని) గదతి=పలుకుచున్నాడు; త్వాం=నిన్ను, స్తువన్=నుతిచేయుచున్నవాడనయి, తైః=(మీదచెప్పిన) వారివలన, విస్మితఇవ=పరిహాసింపబడినవాడనువలె, నజిహ్రేమి=సిగ్గుపడను; ఏలననిన ననుఆహా, ముఖరతా=వాచాలత, ధృష్టాఖలు=లజ్జలేనిదికదా

గు॥— ఓయీ వెనుకటిశ్లోకమున జగత్కారణమొకటియుండక తప్పదని నిర్ణయించి అట్టికారణ మక్కరలేదను వారి మతములను ఖండించుచు జగత్కారణమగు నీశుని మహిమమును పుష్పదంతుడు నుతించుచున్నాడు వినుము జగత్తునకొక కారణమవసరములేనిచో జగత్తు తనంతట తానే యుండవలయునుకదా?

శి॥— అగును.

గు॥— అటులయిన మూడు మతము లేర్పడును. జగత్తు నిత్యమనువారు కొందరు, జగత్తు అనిత్యమనువారు కొందరు, జగత్తు కొంతనిత్యము, కొంత అనిత్యము అనువారు కొందరు. ఇటుల మూడుతెగలవారు మతముల చర్చలన్నియు దర్శనములందు దెలియవలయునే గాని యిట్టిచోటుల సంపూర్ణముగా వివరించుటకు వలను గాదు. అయిన నుత్సాహముచేత నొకింతమాత్రము స్థూలముగా దెలిపెదను. అందువల్ల ప్రకృతమున పుష్పదంతుడొనరించిన స్తోత్రమహిమము నొకింత దెలియనగును.

మొదటిమతమున జగత్తునిత్యము. అటులయినచో నిత్యమగుదాని కొక కర్త అవసరము లేదు. షడ్భావవికారములు సయితము లేవు. అదిస్వతంత్రము కావలయును. మరియు జడము కాకూడదు. చైతన్యము కావలయును. ఇట్టిలక్షణములు జగత్తునందు లేవు. అనుక్షణము జగము మారుచునేయున్నది. షడ్భావవికారములకును లోనైయేయున్నది: జడమైయున్నది. కావున జగత్తునిత్యము కానేరదు.

రెండవ మతమున జగత్తు అనిత్యము.

ఇదినిక్కమె. అనగా దీనికి ఉత్పత్తిస్థితిలయములు కలవు కావున దీనికొక కర్తయుండకతీరదు అతడే ఈశ్వరుడు.

మూడవమతమున కొంతనిత్యము కొంతఅనిత్యము అనగా ఆకాశాదిమహాభూతములు నిత్యములు అవిఅనేకవిధములుగా పరిణమించి జగత్తులోని చిత్రములగుచున్నవి. ఈమతమువారునైతము నిత్యమగు భూతములు జడములని యంగీకరింపకతప్పదు. కావున మొదటిమతమువలెనే ఇదియును అంగీకరించుటకవకాశము లేదు. మరియొకకర్తనే యపేక్షించుచున్నది.

శి॥— అయ్యా ఈప్రశంసకీశ్లోకముతోడి సందర్భమేమి.

గు॥— వినుము. ఈమూడుమతములవారును స్వామిభక్తులను అపహసింతురు. మొదటి మతమున జగత్తునిత్యముకావున దానికొకకర్తలేదు. లేనివానిని నుతించుట వెర్రితనము.

రెండవమతమున జగత్తు అనిత్యము కావున జగత్తునశించినతోడనే అందరునన
శింతురు. అదియేముక్తి. అది యెప్పుడో యొకపుడు రాకతప్పదు. దానికయి
యింతశ్రమపడి ప్రయత్నించుటయు వెఱ్ఱితనము.

మూడవమతమున మొదటిదానియందువలెనే స్వామినినుతించుట వెఱ్ఱితనము
ఇటుల నీమూడుమతములవారును భక్తులను పరిహసించుచున్నారు.

శి॥— అయిన నేమి?

గు॥— అందువలననే ఓస్వామీ యీమతములవారు నిక్క మెరుగక నిన్ను నుతించు
భక్తులను పరిహసించినను నేనుమాత్రము నిన్ను నుతించుటకు సిగ్గుపడను వారి
యుక్తులకు దగినసమాధానము చెప్పి ఖండించుటకు దగినంతప్రజ్ఞ నాకు లేదు-అందు
వలన వారు నన్ను జూచినగుచున్నారు అయిన నేమి నీకటాక్షమువలన నీమహిమ
మించుక నాబుద్ధికి స్ఫురించుచున్నది కావున నుతించెదను- అనియిటుల తనవిన
యమును, స్వామిమహిమయొక్క దురవగాహత్వమును, అనంతత్వమును పుష్ప
దంతుడు వెల్లడిచేయుచున్నాడు.

శి॥— అయ్యా నిక్కముగా నెవ్వరీపుష్పదంతుని పరిహసించిరి.

గు॥— అటుకాదు మతసిద్ధాంతముల ననుసరించి పరిహసించినటులనేలును. అందువలన
నే విస్మితఇవఅని ఇవప్రయోగము.

శి॥— అయ్యా పుష్పదంతుడు వారిమతములకు తగినయుక్తుల నొసగనేరనని యొప్పు
కొనుచు తనమతముసరియైనదని పుష్పదంతుడెటుల చెప్పనేర్చును?

గు॥— ఓయీ వారిమతములన్నియు కేవలతర్కము నాశ్రయించినవి. ఈతనిమత
ము శ్రుతిననుసరించినది కావున శ్రుత్యనుగ్రహీత తర్కము నాశ్రయించిన తనమత
ము శ్రేష్ఠమని యీతని సిద్ధాంతము. "అప్రాప్తైశాస్త్రప్రసిద్ధవత్" అని శుద్ధతర్క
ము చాలదు. కావుననే శ్రుతిసహాయము కావలసినచ్చును.

శి॥— అయ్యా నుతించుటకు సిగ్గుపడననియు వాచాలతసిగ్గులేనిదనియు పుష్పదంతుడ
నుటకు కారణమేమి.

గు॥— ఓయీ ఇదివినుము. ఇతరమతములపై వినుము. ఎటులనిన, ఓయీ ఇతరమతావలం
బనులాగా నేనుచెప్పనది ప్రల్లదమనియు నేను ప్రేలుడుకాయననియు విరాగనిన

చో నందురుగాక! త్రేలుడు కాయరు సిగ్గెటులనుండును? అని నింద్యావాక్యము వారుసెప్పనవియే త్రేలాపనలనియు, శ్రుతిప్రతిపాద్యుడగు భగవంతునివిషయమున తాముచేయుచున్న కుతర్కములు ప్రల్లదములని వారుసిగ్గు నొందవలసియుండగా సిగ్గునొందక వృథాలాపములను జేయుచున్నారని వ్యంగ్యార్థము.

శి॥— అయ్యా స్తువన్ జిహ్రేమి-ననుముఖరతాధృష్టానఖలు అని అన్వయించరాదా?

గు॥— వచ్చును- అపుడు సైతము తాత్పర్యము భేదించదు-వినుము స్తువన్ జిహ్రేమి=నిన్ను నుతించుటకు సిగ్గుపడుచున్నాను. ముఖరతా=వాచాలత, ధృష్టానఖలు= లజ్జలేనిది కాదాఏమి? (అగుననుట)- ఇందువలనతాత్పర్యమేమి?ఓస్వామీఅంతటి మహావిద్వాంసులే నీమహిమ నెరుంగలేక నానామార్గములద్రొక్కి చిక్కుపడుచుండగా నావంటియల్పజ్ఞుడునిన్ను నుతింపసమకట్టుట సిగ్గుకాదా- (నుతింపనలవికాదనుట) నామించినపనికి సమకట్టితినని సిగ్గుపడుచున్నాను. అయినను శ్రుతి సహాయముగలుగుటచే మొదలుపెట్టితిని ఆసహాయములేని యితరమతములు సిగ్గుజెందకున్నవి. వృథాప్రలాపములు చేయుచున్నవి. ప్రలాపములను జే

యువారు సిగ్గునొందకుండుట సహజమేకదా అనితాత్పర్యము. మీదవివరించినయర్థమునకును దీనికిని వైషమ్యమేమియును లేదు. ఇచ్చట ఇతరమతముల వాచాలతయని యన్వయము.

ఇంకొకతీరునసైతమన్వయించవచ్చును ఏటులనిన; ముఖరతానధృష్టాఖలు= వాచాలతసిగ్గులేనిదికాదుకదా అనగా సిగ్గుపడవలసినదే- ఇందులతాత్పర్యమేమనిన- స్వామీ మహాపండితులు చిక్కుపడుచుండ బాలిశుడనగు నేనునుతింప సమకట్టితిని నామాటలునీమహిమను చెప్పుటకుజాలవు. ప్రల్లదములేయగును. అందులకు సిగ్గుపడుచున్నానని తాత్పర్యము. ఇందుతనవాచాలతయనియర్థము. ఎటులైనను తాత్పర్యమొక్కటియే.

శి॥— అయ్యా కానిండు భగవంతుడు జగత్తును సృజించినాడని యింతదూరము చెప్పెను గదా; మరి సృష్టించి దీనితోడి సంబంధము చాలించుకొనెనాయేమి.

గు॥— అటులగునా? ఈవిషయమునందు సైతమనేకవిధములున్నవి. ముందుశ్లోకమును భావింపుము. ఇదివరకు మూడుశ్లోకములందు రజోగుణవిశిష్టుడయి జగత్కార

ణరూపమునుబొంది బ్రహ్మయను నామముతో వ్యవహరించుస్వామిని నుతించెను. ఇటుమీదసృజింపబడిన జగత్తును సత్వగుణప్రధానుడయి విష్ణురూపమున రక్షించుచున్నాడని విష్ణుమూర్తిని నుతించుచున్నాడు.

శ్లో॥ త్రయీసాంఖ్యంయోగఃపశుపతిమతంవైష్ణవమితి
ప్రభిన్నేప్రస్థానేపరమిదమదఃపథ్యమితిచ
రుచీనాంవైచిత్ర్యాత్ ఋజుకుటిలనానాపథజుషాం
నృణామేకోగమ్యస్త్వమసిపయసామర్ణవఇవ॥ ౭

టీ॥ త్రయీ=వేదములసముదాయము (వేదోక్తకర్మమార్గమనుట), సాంఖ్యం=సాంఖ్యమతము, యోగః=యోగశాస్త్రమతము, పశుపతిమతం=శివమతము, వైష్ణవం=వైష్ణవమతము, ఇతి=ఈతీరున, ప్రస్థానే=(నిశ్చయముగాను) ముక్తిమార్గము, ప్రభిన్నే (సతి)=(అనేకవిధముల) భేదించుచుండగా, చ=మరియును, ఇదం=ఈమతము, పరం=శ్రేష్ఠమయినది, అదః=ఆమతము, పథ్యం=

మేలుచేయునట్టిది, ఇతి=అనియును, రుచీనాంవైచిత్ర్యాత్=తమతమరుచులు అనగా అభిమతములు అనేక విధములుగానుండుటవలన ఋజుకుటిలనానాపథజుషాం=దోషరహితములయినట్టియు, దోషసహితములయినట్టియు, అనేకవిధములగు మార్గములననుసరించిన, నృణాం=మనుష్యులకు, పయసాంఅర్ణవ ఇవ=నీటికి సముద్రమువలెనే, త్వం=నీవు ఏకోగమ్యః=ఒక్కడవే పొందదగినవాడవు, అసి=అగుచున్నావు.

గు॥—ఓయీ! ఈశ్లోకమునందలి తాత్పర్యమును ముందు తెలిసికొనుము. ఓస్వామీ జనులందరు తమతమ రుచులనుబట్టి అనేకమార్గములగు మతముల నవలంబించుచున్నారు. వారిమతము లెంతభిన్నముగానుండినను అందరును జగత్కారణమగు పదార్థమును బొందుటకే యత్నించుచున్నారు. నీవే జగత్కారణము కావునతుదకు వారందరకును నీవేగతి. అని పుష్పదంతుని తాత్పర్యము.

శి॥ — శ్లోకమున జెప్పబడిన మతముల భేద మెట్టిది?

గు॥—ఓయీ? జగత్తునకు కర్తయెవ్వఁడు? ఎట్టివాఁడు, అనుప్రశ్నలకుత్తరముగా నొక్కొక్కరొక్కొక్కవిధమున సమాధాన మొసంగిరి. అవి యొక్కొక్క మతమయ్యెను. ఎటులనిన -

మనుజుఁడు తానొనరించు కర్మమువలన ననేకజన్మములను బొందుచూ సుఖదుఃఖముల ననుభవించుచున్నాఁడు. జగత్తంతయు నీతీరున కర్మజనితము ఇదియే మన యనుభవమువలనసైతము దెలియుచున్నది. కావున జగత్కారణము కర్మ. వేదవిహితములగు పుణ్యకర్మలుమాత్రము తుదకు మిగిలి దుష్టకర్మలు లేశమైనను లేకుండునపుడు జీవుఁడు ముక్తినొందును. జననమరణాదిరూపమగు జగత్తు కర్మఫలము అనువారిమతమొకటి. ఇదియే పూర్వమీమాంసాశాస్త్రమువలన నిర్ణయింపబడిన జగత్కారణస్వరూపము. ఈమతమే త్రయీమతము.

జగత్తంతయు మహత్తుమొదలగు తత్త్వముల సంమేళనమువలన గలిగినది. ఈమహదాదితత్త్వములన్నియు ప్రకృతియను పదార్థముయొక్క కార్యములు. ప్రకృతియేజగత్కారణము. ఇది సాంఖ్యమతము. అనగా యిరువదినాలుగు

తత్త్వములు జగత్తుగానగుచున్నవనుటచే నిది సాంఖ్యమతమనబడినది. ఇది శుద్ధసాంఖ్యము. దీనియందు ఈశ్వరుఁడులేఁడు. అందువలన దీనిని నిరీశ్వరసాంఖ్యమని సయితము నందురు. ఈసాంఖ్యమతమున మరియొక యంతర్భాగము కలదు. దాని నవలంబించువారు ఈశ్వరుఁడుసైతమున్నాఁడుకాని యాతఁడేమియు చేయఁడు. ప్రకృతిమాత్ర మాతనిసన్నిధానమువలన జగత్తుయొక్క పుట్టుక, స్థితి, నాశనములను జేయుచున్నది. ఈపనులుచేయుటకు ప్రకృతి జడముగావున తనంతటతనకే శక్తిలేదు. పురుషుని సన్నిధానముకలిగినమాత్రాన దానికిశక్తికలుగుచున్నది. తక్కిన మతమంతయు మీఁదవివరించిన నిరీశ్వరసాంఖ్యమువంటిదే. ఈసాంఖ్యమతమునకు సేశ్వరసాంఖ్యమని పేరు. ఈరెండుమతములును శ్లోకమునందు జెప్పబడిన సాంఖ్యమనుదానియందిమిడియున్నవి.

ఇకను యోగమనునది జీవుఁడెల్లప్పుడు చిత్తవృత్తులతోనున్నవాఁడు. చిత్తవృత్తులుదుఃఖరూపములు. ఇవి నశించినంతనే జీవుఁడు తనస్వరూపమును బొందుచున్నాఁడు. అదియే ఈశ్వరుఁడు. జీవేశ్వరులకైక్యమే ముక్తి. దానిని దెలుపు

శాస్త్రమే యోగశాస్త్రము. ఈశాస్త్రము మీదవివరించిన సేశ్వరసాంఖ్యమే అయినను వేదాంతశాస్త్రమందుసమ్మతము చిత్తవృత్తి నిరోధమావశ్యకముగావున నీమతము వేదాంతమతమునకు సమ్మత మంగముగా అంగీకరింపబడుచున్నది. ఏదియెటులున్నను ఈమతమున జగత్కర్త ప్రకృతియేకాని ఈశ్వరసన్నిధానముకావలెను. పశుపతిమతము మరియొక్కటి దీనినవలంబించువారు గౌరీమొదలగు పరివారముతోగూడిన రుద్రుడే జగత్కారణమనియందురు.

వైష్ణవమతమున మహాలక్ష్మీ విష్వక్సేనాదులతోడను నిత్యసూరులతోడను గూడిన మహావిష్ణువే జగత్కారణమని సిద్ధాంతము. ఈతీరున జగత్తునకు కర్త యిట్టివాడని యనేకు లనేకవిధముల ననుచున్నారు.

శి॥— అయ్యా యీ మతములనన్నిటిని పుష్పదంతు డెటులనంగీకరించెను.

గు॥—పుష్పదంతు డిందుకొన్ని ఋజుమార్గములనియు తక్కినవి కుటిలములనియు శ్లోకమునందే చెప్పెను. ఈశ్వరుడు జగత్కారణమని యొప్పుకొనని త్రయీ సాంఖ్యయోగమతములు కుటిలములు. జగత్కర్తయగు నీశ్వరుని నంగీకరించిన మతములు మంచివి.

శి॥— పుష్పదంతుడు పరస్పరవిరుద్ధములగు పశుపతి వైష్ణవమతముల నెటుల మంచివిగా నంగీకరించును. మరియు నీరెండును దనమతమునకు విరుద్ధములే.

గు॥—అటుకాదు. జగదీశ్వరుడు గుణభేదములచే బ్రహ్మవిష్ణురుద్రరూపములతో వ్యవహరించుచు లోకముయొక్క పరిపాలన మొనరించుచున్నాడు. ఎవరు యేయే రూపములను గయికొని సేవించినను వారిచిత్తవృత్తి యెట్టిది? తాము జగదీశుని నుద్దేశించిరేకదా సేవించుచున్నారు. జగదీశునకు వేరుగానామములు లేవు. భక్తులు తమయుపాసనాసౌలభ్యముకొర కట్టినామరూపములను గల్పించినను అవి యన్నియు భగవంతునికి జెల్లును. కావున వారిమతములందు జీవులుభక్తులనియు జగదీశుని నుపాసించి యాతనికటాక్షమునకు బాత్రులయి ముక్తులగుదురనియు నిశ్చితజ్ఞానమున్నది. అందువలన ఆగంతుకములును అనిత్యములును ఉపాసనాసౌలభ్యముకొరకు కల్పితములును అగు నామరూపములను గణింపక సత్యమగు పరమేశ్వరారాధనము నంగీకరించుటచే యీమతములు అతనికి సమ్మతములు. ఈసంగతిశ్లోకమునందే సూచింపబడియున్నది. బావి, నుయ్యి, గొయ్యి, చెరువు

నది, మొదలగు భేదములతో వ్యవహరింపబడుచున్న జలములన్నింటికి గమ్యస్థాన మొకటియేకదా ఆదిసముద్రము అటులనే జీవరాసులందరు తాము భిన్నభిన్న రూపములతో నున్నను పరస్పరవిరుద్ధములగు పదార్థములనారాధించినను తుదకన్నియు నీయందే పరిణమించుచున్నవి. తటాకాదులందలి యుదకములు నదులందును నదులందలి యుదకములంతకంటె పెద్దనదులందును గలియుచూ తాము దేనియందు కలియుచున్నవో దానినానురూపములను తాముపొందుచున్నను తుదకన్నియును సముద్రమునందే చేరునటుల స్వామీ అందరిసేవలును తుదకు నీయందే చేరుచున్నవని చెప్పబడెను.

I— అయ్యా కుటిలమతములం దీసమాధానము సరిపోవునా.

II— సరిపోవును-ఆమతములవారు సైతమొక జగత్కారణమునంగీకరించిరి. దానిసర్వోన్నతత్వము నంగీకరించిరి. ఈమాటలతో జెప్పకున్నను వారిమతములన్నియు తుదకు జగత్కారణమునందే చేరుచున్నవి అనగానిక్కముగా ఈశ్వరునికే వారిసేవలు చెందుచున్నవని సమాధానము చెప్పబడినది.

I—అయ్యా నిక్కముగా అన్నివిధములకు నుపాసనలును స్వామియందే మునిగియునా?

II— చిత్రముగా నడిగితివి. ఆకాశాత్పతితంతోయం యథాగచ్ఛతిసాగరం సర్వదేవనమస్కారః కేశవంప్రతిగచ్ఛతి అని చిన్ననాడే నీకుపదేశింపబడినదే- మరియు ఆపూర్యమాణమచలం ప్రతిష్ఠమ్ సముద్రమాపః ప్రవిశన్తియద్వత్ తద్వత్కామాయం ప్రవిశన్తి సర్వేసశాన్తిమాప్నోతి నకామకామీ అనుసాంఖ్యయోగాధ్యాయమునందలి గీతావాక్యమును మరచితివా?

I— ఔనౌను- ప్రత్యక్షానుభవమువలన సైతము జలములనుగూర్చిన యుపమ మిక్కిలిపొసగియున్నది. కానింకు రెండుచరణమునందలి 'చ' అనునది సార్థకమా లేకపాదపూరణార్థమా.

II— ఓయీ మహాకవులకు గొందరియాధునికకుకవులవలె పాదపూరణగ్రహాచారమేమి? చ- అనుటవలన సారస్యమున్నది, యేదనుకొన్నిమతములను బేర్కొని తక్కినమతములను సైతము మీతీరునవే సమన్వయము చేసికొనవలయునని వ్యాససూత్రమునందలి మొదటిసుధ్యాయమునందలి సమన్వయమంతయు సూచింపబడుచున్నది.

— పుష్పదంతునిమతము పేరేమి?

॥— అది వేదాంతమతము-ఒక్క వేదాంతమతమునందే యీమీద చెప్పబడిన సమన్వయమున్నది. తక్కినవానియందు లేదు. తనమతము వేదాంతము. కావుననే సుప్రసిద్ధమగు నామతమును పేరు పెట్టి ప్రత్యేకముగా వక్కాణింపలేదు.

— అయ్యా ఇందు విష్ణురూపముయొక్క నుతియున్న దంటిరే-ఏది?

॥— కాదా? సృజియింపబడిన జగత్తునకు గతికుడయి భక్తుల సేవల సంగ్రహించుచు నన్ని మతములవారికిని గమ్యుడొక్కడేయని జగత్పరిపాలనాధికారమును దెలుపుచు చేయుచుండుటచే నిదివిష్ణురూపనుతియని యెరుగవలయును.

ఇకమీద తమోగుణశిష్టుడగు రుద్రునిరూపము నుతింపబడుచున్నది. అదియును సగుణమూర్తియగు శివరూపమున నుతింపబడుచున్నది. ఇటుపిమ్మట స్తోత్రమంతయును శివస్తోత్రమే. శివరూపమునే యిందుముఖ్యముగా నుతింపుచున్నాడు కావున ముందు అవతారికగా నిదివరకు గతించినశ్లోకములను భావింపవచ్చును-ఇకను శివస్తోత్రమును మీదిశ్లోకమునుండి వినుము.

శ్లో॥ మహోక్షఃఖట్వాంగం పరశురజినంభస్మఫణినః
కపాలంచేతీయత్తవ వరదతంత్రోపకరణం
సురాస్తాంతామృద్ధిందధతితు భవద్భ్రూప్రణిహితాం
నహిస్వాత్మారామం విషయమృగతృష్ణాభ్రమయతి॥ ౮

టీ॥ హేవరద=కోరికలనిచ్చు ఓదేవా, మహోక్షః= పెద్దరెంటముగలఎద్దును, ఖట్వాంగం= (మంచపుకోడువంటి) దండెముతోగూడిన కపాలమును, పరశుః—గండ్రగొడ్డలియు, అజినం= చర్మమును, భస్మ= భస్మమును, ఫణినః= పాములును, కపాలంచ=పుర్రెయును, ఇతి=అనునట్టివి, ఇయత్ =ఇంతమాత్రమే, తవ= నీకు, తంత్రోపకరణం=ప్రపంచమునకు కనబడే కార్యసాధనము (అనగావీనిని సాధనములుగాధరించి పనుల నొనరించుచున్నావనుట) తు= అయితేనేమి; సురాః= దేవతలు; తాంతాం=ఆయా (తమతమ) బుద్ధిం=విభవమును, భవత్ = నీయొక్క, భ్రూప్రణిహితాం=కనుబొమలచేతకూర్చబడినదానినే, దధతి=

పొందుచున్నారు. (కావున) స్వాత్మారామం=తనయందే సమస్తమును జూచుచు ఆనందించువానిని. విషయ=ఇంద్రియభోగములు అనువట్టి, మృగతృష్ణా=ఎండమావి, నభ్రమయతిహి= భ్రమింపజేయదుకదా.

గు॥— ఇందలికల్పన మిగులసులభముగా దెలియవచ్చును. ఓస్వామీ నీకటాక్షమువలన ఇంద్రాదిసురలందరు తమతమవిభవములను బొందుచున్నారు నీవు అందరికిని ప్రభువవు నీకు సమానుడే లేడు. ప్రభు వెటులనుండును? లోకమునదవ సేవకులకంటె నెక్కుడు వేషమును ప్రభువుధరించుట సామాన్యముగానున్నది: నీవుమాత్రమటుగాదు నీసేవకులగు నింద్రాదులు మహావైభవముతోనుండ నీవుమిక్కిలిబీదవాని వేషముదధరించి స్వల్పపదార్థములనే యుపకరణములుగాగైకొని ప్రభుత్వమును నడిపించుచున్నావు. ఇదియుక్తమే తక్కినవారందరును లోకాంతర్గతులు, నీవొక్కడవే లోకాతీతుడవు కావున లోకవిరుద్ధమగు మార్గము నీయందుగనుపట్టుచున్నది. ఉపకరణములు విడంబనార్థములు కాని నిక్కముగా నీకవసరమున్నవి కావు. నీమహామహిమచేతనే సకలకార్యములును నిర్వర్తిల్లును. విలాసమునకొరకుమాత్ర

మీయుపకరణములను గ్రహించితివి. నీకటాక్షమునకు వశులమయియుండు విభవములు సర్వోన్నతుడవగు నిన్ను భ్రమింపజేయునా, అని తాత్పర్యము.

శి॥— అయ్యా పరిహాసకునివలె నొకదానికొకటి సంబంధములేని యీయుపకరణముల నేల భగవంతుడు గయికొనును? ఇట్టియుపకరణములను ధరించిన వేషము మిగుల హాస్యాస్పదముకదా?

గు॥—ఓయీ విలాసమునకు గారణముండునా? అయినను గారణము చెప్పవచ్చును. భగవంతుడు తనమహిమను భక్తులకు వెల్లడిచేయుటకొఱకీరీతి నవలంబించియుండును. మరియును ఒకడు మనకు ప్రియమగు వస్తువునందు చూపించునట్టి దోషములుసయితము మనప్రీతినిబట్టి గుణములుగానే తోచుచుండును. అటులనే శివునియందు దోషములుగా పైకి గనబడునవిసయితము భక్తులమగు మనకు గుణములుగా గానుపించునుగదా.

శి॥— స్వామీ అటులయిన నీఖట్వాంగాది సాధనములందు గుణ మెటులజూపించ గలరు?

గు॥—అది నీభక్తినిబట్టి యుండును. నాకు దోచినగుణములను వివరించెదను. వినుము మహోక్షము అనగా పెద్దమెంటముగలయెద్దు. మెంటము పెద్దదియగుకొలది యెద్దునకు గమనము మందమగును. ఈశ్వరునకు వాహనము నిక్కముగా నవసరముండినచో నాతడీవాహనమును గయికొనుటదోషమే కాని సర్వవ్యాపియగు నాతనికి గమనాగమనము లేల? గమనాగమనము లేనివానికి వాహనమేల ఇదియొక వేడబము. మరియు భక్తులు సేవించుట కొకప్రదర్శనము. భక్తులు తమతమ ప్రేమాతిశయము ననుసరించి భగవంతుని అనేకవిధముల సేవింతురు. ఒకప్పుడు పరిహసింతురు. మరియొకప్పుడు నిందింతురు. ఈవిషయము భాగవతమున గొంత విపులముగా దెలుపబడియునుగదా. ఇత్తెరున పరిహాసమునకయినను నిందకయినను స్వామియొక్క మూర్తినిగురించి చింతించుట సంభవించును. ఇది పెద్దలాభముకదా. ఇంతేకాక మరియొకవిధమున నయితము మనకు మహోక్షము జ్ఞానము నుపదేశించుచున్నది.

ఉక్షశబ్దమునకు గోవులందు రేతస్సును విడుచునదియని యర్థము. (ఉక్షతి

రేతస్సించతీతిఉక్షః) మహోక్షమనగా (మహాంశ్చాసౌఉక్షశ్చమహోక్షః) గొప్పదియగునుక్షము. తక్కిన యుక్షములవంటిది కాక యిది మిక్కిలి గొప్పదని తాత్పర్యము. ఏటులననగా తక్కినఉక్షములు తమరేతస్సును గోవులయందు అధోముఖముగా విడుచును. ఈయుక్షము తన రేతస్సును అధోముఖముగాగాక యూర్ధ్వముఖమున గోవునందు అనగా స్వర్గమునుగూర్చి ప్రసరింపజేయును. అనగా ఊర్ధ్వరేతస్కుడై స్వర్గమనగా నిత్యానందమునుగూర్చి చింతించుచుండును. అందువలననే నిత్యానందరూపుడగు శివుని వహించుచుండును. కావున నీతీరున జీవు డూర్ధ్వరేతస్కుడయి యింద్రియోన్మాదములనడచివేయు నేని యెల్లపుడు నిత్యానందరూపుడగు శివుని తనయందు గాంచుచుండునని లోకమున కొక జ్ఞానోపదేశము.

ఇకను ఖట్వాంగమునుగూర్చి విచారింతము. పూర్వ మొకప్పుడు బ్రహ్మదేవుడు పంచముఖుడయియుండునపు డందు ఒకముఖమునుండి యమంగళధ్వనులు వచ్చుచుండగా శివుడు దానిని ఖండించెను. ఆశిరము తన బాణమునకు తగి

లించుకొనెను. అదియేఖట్వాంగము దీనివలన అన్నియోగసంగోపములనుబోగొట్ట జాలువాడను నేనే యనిలోకమునకు భగవంతుడు దెలుపుదుచేయుచున్నాడు దానికిగుర్తుగా (బిరుదసూచకముగా) ఖట్వాంగమును ధరించుచున్నాడు. కావుననిదిశంకరుని సర్వోపసంహారశక్తిని భక్తులకుబోధించుచున్నది తమ తమ మహాత్మ్యములను సూచించుచిహ్నములను ధరించుట లౌకికచక్రవర్తుల కీనాటికిని స్వభావముకదా.

పరశువనగా గండ్రగొడ్డలి-ఇదిఅన్నిపదార్థములను ఛేదించుట కుత్తమాయుధము. అందును వృక్షములనుఛేదించుటకిట్టిది మరియొకటిలేదు. జీవుల ననాదిగా నావరించి విజృంభించుచున్న యజ్ఞానవృక్షమును నిర్మూలించుటకు మిక్కిలి యమోఘశస్త్రమగు పరశువుస్వామిధరించెను. దీనివలననో జనులగుజీవులారా మీకుసకలదుఃఖములకును హేతువగు నజ్ఞానవృక్షమును నిర్మూలముగా ఛేదించి మిమ్ము ముక్తులంజేయు శస్త్రమునాయొద్దనున్నది. కావుననాయందుభక్తిగలిగి యారాధించువారల నవలీలలో ముక్తులనుజేయుదునని భగవానుడు తనచేతపరశు

వునుధరించి లోకమునకు దానిరూపమునజాటుచున్నాడు. "అశ్వత్థమేనం సువిరూఢమూల మసంగశస్త్రేణదృఢేన ఛిత్వా" అను గీతవాక్యములను స్మరింపుము. అజినం-అనగా చర్మము. ఇది తపోయోగ్యసాధనము. ఈసాధనముధరించి దీనిమూలమున భక్తులకు దపమావశ్యకమని జాటుచున్నాడు. ఇంతేకాదు భక్తులకుపదేశించుకొరకే తనకు తపశ్చర్య అవసరములేకుండినను యొల్లపుడు తపమొనరించుచు తాపసులలో శ్రేష్ఠుడుగా గణింపబడుచున్నాడు. "కాంతాసంమిశ్రదేహోప్యవిషయమనసాం యఃపరస్తా ద్యతీనాం" అనికాళిదాసు పొగడెను. ఇదిగాక యథారాజా తథాప్రజాః అను న్యాయమననుసరించి భక్తులకు మార్గదర్శియై అజినమును ధరించి తపముయొక్క ఆవశ్యకతను ప్రకటించుచున్నాడు.

భస్మము శివుడు తన శరీరమునందంతటను ధరించుచుండును. జడమై పంచభూతముల మేళనమగు శరీరమున కెన్నటికైన తుదిగతి భస్మమగుటయే కావున శరీరమునందు భస్మమునందుకంటె నెక్కువ అనురాగము పెట్టరాదని వైరా

గ్యము బోధింపబడుచున్నది. మరియు లోకమునందలి శరీరభోగములను మహదైశ్వర్యములను పరమేశ్వరునకు భస్మతుల్యములనియు నెరుగవచ్చును. ఇంకను పరమేశ్వరుడు ధరించు భస్మము లోకులకు విభూతి అనగా ఐశ్వర్యమగుచున్నది.

" సురవరులమ్మహానటుడు • సొంపుగ నాట్యము సేయు వేళలన్ ।
బరువిడి నేలపైబడిన • భస్మము దాల్చి కృతార్థులౌదురు "

అని శివోద్వాహమున చతుర్థాంకమున జెప్పబడినది.

ఫణినః=పాములు- ఇవి తమవిషమువలన సర్వలోక లయంకరములు-భయంకరములు. ఇట్టివానిని తనకు సేవకులుగాను, అలంకృతులుగాను, ధరించి జగత్ప్రళయమునొనరించు దన రుద్రరూపమును వెల్లడిచేయుచున్నాడు. మృత్యుంజయము, రుద్రత్వము తేటపడుచున్నది.

కపాలం. ఇది భిక్షాపాత్ర నుపయోగించుపుర్రె. రుద్రుడు తానారగించు పదార్థములను దీనియందుంచి యారగించును. కపాలము చిత్తస్థానము. దానియం

దలి మెదడు మొదలగుపదార్థములు శూన్యమగునప్పుడే కదా శివుడు దానిని ధరించును. అనగా చిత్తవృత్తులు శూన్యమగునప్పుడే శివుని గయికొనును. చిత్తవృత్తులు (మెదడు మొదలగువానికార్యములు) ప్రబలుచుండునపు డాతనికి గ్రాహ్యముకాదు. చిత్తవృత్తి శూన్యమగు సమాధియందుండు జీవులనే తానత్యంతప్రీతితో గయికొనును. వారియందు తనకు భోగ్యమగు నానందము నుంచి తనలో జేర్చుకొని సాయుజ్య మొసగునని సూచన.

ఈమీదచెప్పినవానివలన భగవంతుని లక్షణములు వెల్లడియగుచున్నవి.

ఎటులనన గా—

సంపూర్ణత్వము	...	...	మహోక్షము.
ఐశ్వర్యము (అజ్ఞానచ్ఛేతృత్వశక్తి)		...	పరశు
విజ్ఞానము (తపము)	...	...	అజినము
వీర్యము { దుష్టశిక్షణ	...	...	ఖట్వాంగము
వీర్యము { శిష్టరక్షణ	...	...	కపాలము.

వైరాగ్యము-శరీరాభిమానరాహిత్యము ... భస్మము.
కీర్తి-అనన్యసాధ్యసాధకత్వము ... ... పాటము.

భగవంతుడనగా నీమీద చెప్పిన యారునుగలవాఁడు. "సంపూర్ణైశ్వర్యవిజ్ఞాన వీర్యవైరాగ్యకీర్తిషు ॥ షట్స్వేతేషు ప్రయుజ్యం తేమునయోభగవానితి" అని

ఇటుల భక్తానుగ్రహముకొరకు స్వామి యనేక భావగర్భితములగు వేషముల దాల్చుచుండును. నిక్కముగా నతనికి వీనితో బనిలేదు. అతని కటాక్షము వలన నింద్రాది దేవతలు తమ విభవములను గడించుచున్నారని జెప్పబడినది. ఇది సర్వేశ్వర లక్షణము.

॥—అయ్యా ఈయుపపత్తులు నిక్కమైనను గాకున్నను భక్తులకుమిగుల మనోహరము గాను సహేతుకముగానున్నది.

॥—ఇందలి తుదిచరణము తఱచుగా ప్రస్తావవలం దర్థాంతరన్యాసమువలె వాడబడు చుండును.

ఇటుల సామాన్యముగా రుద్రుని విశ్వర్యము నిందుజెప్పి యికముందు ప్రత్యే

కముగా నొక్కొకటియు గొనియాడబడును. ముందుశ్లోకమును జూడుము. దాని యందీశ్వరుని సంపూర్ణత్వము ప్రత్యేకముగా నుతింపబడుచున్నది.

శ్లో॥ తవైశ్వర్యం యత్నాద్యదుపరి విరించో హరిరధః   విరిఞ్చిర్హరిరధః
పరిచ్ఛేత్తుంయాతావనల మనలస్కంధ వపుషః
తతోభక్తిశ్రద్ధాభరగురుగృణ ద్భ్యాంగిరిశయత్
స్వయం తస్థేతాభ్యాం తవకిమనువృత్తిర్న ఫలతి॥   ౧౧

టీ॥— హేగిరిశ=ఓయీశంకరా, అనలస్కంధవపుషః=అగ్నిస్తంభమువలెనున్న, తవ= నీయొక్క, ఐశ్వర్యం=ప్రభుత్వమును, పరిచ్ఛేత్తుం=పరిక్షించుటకు, ఉపరి= మీదికి, విరించః=బ్రహ్మయును, అధః=క్రిందికి, హరిః=విష్ణువును, యత్నాత్=యత్నముతో, యాతౌ=వెళ్ళిరి; (అయినను) అనలం=చాలిరికారు (పరీక్షింప శక్తులుకాకైరి); తతః=పిమ్మట (లేక) అందువలన అనగా తెలియ జాలనందువలనను, భక్తి=నమ్రతతోగూడిన నీయందలిప్రీతియు; శ్రద్ధా=(నీవు

తప్పక రక్షించునను) విశ్వాసముయొక్కయు, భర=అతిశయముతో; గురు= మిక్కిలిగా, గృణద్భ్యాం=నుతిచేయుచున్న, తాభ్యాం=ఆయిరువురికొరకును, యత్=ఏకారణమువలన, స్వయం=నీయంతటనీవు (నీవే కటాక్షించి), తస్థే= ప్రకాశించియుంటివో (వారికి తెలియునట్లు వెలసితివో) (ఆకారణమువలననే అని అధ్యాహారము), తవ=నీయొక్క (నిన్ను గూర్చిన), అనువృత్తిః=అనుసరణము (భక్తి) నఫలతికిం=ఫలించదాయేమి. (తప్పక ఫలించుననుట.)

స॥—పూర్వ మొకప్పుడు బ్రహ్మయు, విష్ణువును శివునియాకారమును పూర్తిగా బరీక్షింప నెంచిరి. అపుడు శివుడు తేజోరూపుడయి అగ్నిస్తంభాకారమున నిలిచెను. ఒకచోట నారంభించి బ్రహ్మ మీదికిని, విష్ణుడు క్రిందికినిపోయి యాద్యంతములు జూడ నెంచిరి. కాని యెప్పటికిని జూడజాలక మరలివచ్చి స్వామిని భక్తితో నుతించిరి. పిమ్మట భక్తాధీనుండగు శివుడు వారియం దనుగ్రహించి వారికి గోచరమగునటుల లింగాకారమున దర్శనమిచ్చెను. తనకాద్యంతములు లేవు. భక్తులప్రీతిననుసరించి వా రుపాసించుటకు సులభముగా నుండునటుల

రూపములను గైకొని వారిని రక్షించుచుందుననని స్వామివారికపుడు బోధించెను.

ఇందు సగుణరూపమున ముందు స్థూలాకారముయొక్క సంపూర్ణత్వము నుతింపబడినది. శ్లోకమున తుదియం దర్థాంతరన్యాసాలంకారమున్నది. ఇటు పిమ్మటి శ్లోకములందు స్వామియొక్క గుణసంపూర్ణత్వము నుతింపబడును.

శ్లో॥ అయత్నాదాపాద్యత్రిభువనమవైరవ్యతికరం
దశాస్యోయద్బాహూనభృతరణకండూపరవశాన్
శిరఃపద్మశ్రేణీరచితచరణాంభోరుహబలేః
స్థిరాయాస్త్వద్భక్తేస్త్రిపురహరవిస్ఫూర్జితమిదం॥ (౧౧)

టీ॥— హేత్రిపురహర=ఓత్రిపురాంతకుడా; దశాస్యః=రావణుడు, త్రిభువనం= మూడులోకములను, అవైరివ్యతికరం=శత్రువులు లేనిదానినిగా, అయత్నాత్= అనాయాసముగా, ఆపాద్య=చేసి, రణకండూపరవశాన్ బాహూన్=యుద్ధముకొరకు దూలపట్టిన తనబాహువులను, అభృత=ధరించెను; అనుసంగతి,

యత్=ఏదికలదో ఇదం=ఇది, శిరః......బలేః=తన శిరస్సులనెడు, పద్మపంక్తులచే, రచింపబడిన, చరణములకొరకైన, పద్మములతోడి పూజగలిగినట్టియు, స్థిరాయాః=దృఢమైనట్టియు, త్వద్భక్తేః=నీయెడల భక్తియొక్క; విస్ఫూర్జితం=విస్ఫురణము (ప్రభావము).

గు॥—ఓస్వామీ! మూడులోకములను రావణుడు అనాయాసముగ జయించెను. పిమ్మట తనకు సాటియగువా రెవరును లేనందున యుద్ధములేక బాహువులు తీటబట్టియుండెను. ఇంతటిశక్తి యారావణుని కెటులగలిగినది. నీయందు దృఢమైన భక్తితో నీ పాదకమలములకు తన శిరస్సులనే పద్మములుగా గూర్చి వానిని వరికి నీ పాదములకు పూజవొనరించెను. నీ పాదములందలి భక్తిచేత నిట్టి శక్తి యాతనికి కలిగినది. కావున నీ సంపూర్ణప్రభుత్వము స్పష్టము. నీ భక్తుడు నీ చరణములను బూజించి మూడులోకములను జయించినపుడు నీ ఐశ్వర్యమును వీర్యమును జెప్ప శక్యమా? అని స్వామియొక్క సంపూర్ణత్వము, వీర్యము, ఐశ్వర్యము ఇందు నుతింపబడినది. రావణుని కథల నాధారముచేసికొని పరియు స్వామిగుణములు నుతింపబడుచున్నవి.

శ్లో॥ అముష్యత్వత్సేవా సమధిగత సారంభుజవనం
బలాత్కైలాసేపి త్వదధివసతౌ విక్రమయతః
అలభ్యాపాతాళేప్య లసచలితాంగుష్ఠశిరసి
ప్రతిష్ఠాత్వయ్యాసీద్ధ్రువ ముపచితో ముహ్యతిఖలః॥ ౧౧

టీ॥ త్వత్సేవా=నీసేవచేత, సమధిగతసారం=బాగుగాపొందబడిన సారముగల, భుజవనం=బాహువులసమూహమును, త్వదధివసతౌ=నీనివాసమైన, కైలాసే అపి=కైలాసమునందుసైతము, బలాత్=బలమువలన, విక్రమయతః=పరాక్రమమును జూపించిన, అముష్య = ఆరావణునికి, త్వయి=నీవు, అలసచలితాంగుష్ఠశిరసి= అనాయాసముగా, చలింపచేయబడిన బొటనవ్రేలుకొనగలవాడవు కాగా, పాతాళేపి = పాతాళలోకమునందును, ప్రతిష్ఠా=ఉనికి, అలభ్యా= పొందరానిది, ఆసీత్ = ఆయెను; ఉపచితః=ఉపకారము పొందినవాడైనను, ఖలః=దుష్టుడు, ముహ్యతి=మోసపోవును, ధ్రువం=నిశ్చయము.

గు॥— మీదిశ్లోకమున స్వామియందలి భక్తివలన గలుగు ఫలమును జెప్పుచు స్వామిగుణముల నుతించెను. ఈశ్లోకమునందు స్వామియెడల ద్రోహముకలని ఫలమును జెప్పుచు స్వామిని నుతించుచున్నాడు.

శి॥ —అయ్యా ఇందలి ఇతిహాసమేమి.

గు॥— రావణుడు శంకరుని నారాధించి త్రిలోకవిజయమునొంది యసమానైశ్వర్యసంపన్నుడాయెను. ఇటులచిరకాలమెదురులేక మహదైశ్వర్యము ననుభవించి పిసికను ఈలోకసంబంధమగు నైశ్వర్యములన్నిటి ననుభవించి పిసికి విరక్తుడయి త్వరలో ముక్తుడనెటులగుదునని యాలోచించుకొనుచుండెను. ప్రారబ్ధము అమరణాంతముండునది; శరీరపతనముగాక శుద్ధముక్తి చేకూరదు. ఆత్మహత్యచేత శరీరపాతము పాపహేతువు. తనకెందునుసరియగు శత్రువులేనపుడు తనకితరులవలన మృతియెటుగలుగును. కావున నెటులనైనను త్వరలో శరీరపతనమగు నుపాయములనాలోచించుచుండెను.

నిత్యముపార్వతీశంకరులను ప్రత్యక్షముగాబూజించువాడు. ఒకనాడచటి

కేగి వారినిబూజించి మరలునపుడొకతలంపుపొడమెను. ఆనాడాతనికి మోహమించుకజనించెను అంతటపార్వతియందాతనికి మనము తగిలెను. ఆమెను గైకొనుటకాశపడెను. ప్రత్యక్షముగా శివునియెదుట నదిచేయనేరక కైలాసపర్వతమునదిగి దానిక్రిందదూరి యాపర్వతమును పెకుకుటముగా కదిలింపనారంభించెను. అటులజేయుటవలన దానిపై శంకరునితొడపై గూర్చునియున్న పార్వతి క్రిందజారిపడునని యూ నపుడు దానామెనెత్తుకొని పోవచ్చుననియు దలంచెను. మోహమువలన నొనరింపబడు కార్యములకొక త్రోవతెన్నుండునా?

ఆరీతిని కొండవడకసాగెను. పార్వతియు క్రిందబడకుండునటుల సమీపముననున్న శివుని సహజముగా నాలింగనముచేసి గట్టిగాపట్టుకొనెను. శివుడీకల్లోలము నెరింగెను. తనలోననే మందహాసముచేసెను. కొండకదలకుండ స్థిరముగానుండునటుల తనకాలిబొటనవ్రేలితో దానినడిచెను. అంతటక్రిందనుండు రావణుండు అడుగంటి యుక్కిరిబిక్కిరియై కటాక్షించుమని శివునిగోరెను. పిమ్మటశివుడు కటాక్షించిరక్షించెను.

ఇందువలన స్వామియొక్క నిగ్రహానుగ్రహరూపగుణములు వర్ణింపబడెను శివుని ఐశ్వర్యము, వీర్యము, భక్తిప్రభావమును వెల్లడియగుచున్నవి.

శి॥— అయ్యా ఈముచ్చట చిత్రముగానున్నది. సాంతముగా వినగోరెదను.

గు॥—ఓయి ఇది అప్రస్తుతమె కాని చెప్పెదను వినుము. అటుల రావణుడాకొండక్రింద కోయునది లేక శివుని మరల నారాధించి యాతని కటాక్షమున వెలువడెను. శివుడు సర్వజ్ఞుడయ్యును పార్వతీప్రీతికొరకు రావణునియడ్డుగ నాతడిట్లనియె. స్వామీ యీదినంబున భార్వతీరూపము నాకు మిగుల మోహావహమయ్యెను. అందువలన నేనామెను హరింపదలచి యిటుల నొనరించితిననెను. అందుకు స్వామియు నిట్లనియె. ఓయీ పార్వతి భగవంతుడనగు నాకుగాక లాతివారల కలవడదు. అయినను నీవు భక్తుడవుకావున భార్వతికంటె సుందరియగు నొకదాని నీకిచ్చెద గయికొనుము నీవు మరలి యింటికిబోవుదారిలో నొక కొండ క్రిందనున్నది, ఆకొండ పెకలించి దానిని గయికొనుమనియెను. అంతట సంతుష్టాంతరంగుడై రావణుడుబోవుచు మార్గమున నాకొండంగాంచి యుత్సహించి

దాని పెకలింప నొడిగెను గాని నేరకుండెను. ఇంతట వాలి సముద్రస్నానమును దన యలవాటుచొప్పున జేసికొని యింటికేగుచు నాదరిని వచ్చుచుండెను. వచ్చుచు రావణునిజూచి కుశలంబడిగి యాతడొనరించుదాని యుదంతమడిగెను, వాలి తనకంటె బలశాలియగుటచే నాతనిదెస వెరచి రావణుడు నిజమునుమాటు పరచి బాహుకండూతినిదీర్చుకొన విలాసార్థముగా నాకొండను పెకలించుచున్నానని మారుచెప్పి యూరకుండెను. వాలియు నుత్సహించి యదిచూచెదనని యచ్చోట నిలిచెను. రావణుడు తప్పించుకొనజాల కాతనియెదుట నాకొండ నెత్తబోయినను సాధ్యముకాకుండుటయు నాతడు విరమింపకుండుటయు వాలి గాంచి యిది విలాసార్థము గానోపదు, నిక్కమెరిగింపుమని రావణుని మందలించెను. మరిదాపనేరక రావణుడంతయు నాతనికెరింగించెను. వాలియు రావణుని యశక్తినెరిగి యోయీ యీగిరిక్రిందనున్న సుందరాంగిని ముందుగా నేనొకసారి యనుభవింప నిచ్చగింతువేని నీశైలము నవలీల నేపెకలింతునని వాలి పలికెను. రావణుండును కొంతతడవు చింతించి చిరకాలానుభూతయగు పార్వతి

శంటె నీమండోదరి వాలిచే నేకవారానుభూతయయ్యెను మేలేకదాయని దానికియ్యకొనెను. వాలి యంతట దన వాలమునా శైలమునకుజుట్టి పైకెంబ దానిని బెకలించునంతలో నచ్చో నపరిమేయ సౌందర్యమందిరయగు మండోదరి గానవచ్చె. దానిసౌందర్యమున కాయిరువురు నచ్చెరువంది మెచ్చుకొని వాలి తన నిర్ణయముచొప్పున దాని ననుభవించి యంగదుడను నొక సుందర నందనునిగాంచి వాని నెత్తుకొని మండోదరిని రావణునకువిడిచి నిజవాసమునకుజనియె. రావణుండును మండోదరినిదోడ్కొని యింటికరిగెను.

శి॥— అయ్యా చిత్రముగానున్నది, కాని యింతగొడవపెట్టు టెందుకు?

గు॥—ఓయీ తాను పెకల్చిన సామాన్యగిరియైనను రావణుడెత్తజాలడుకదా తన నివాసంబగు కైలాస మెత్త యత్నించుట బుద్ధిహీనత యనియు బాహుబల గర్వము తగదనియు దన భక్తుడగు రావణునికి గర్వపరిహరణముకొరకు కిటుల శంకరుడు రచించెను. ఈ అంశము నిక్కముగా రామాయణాంతర్గతము. అచ్చోట దీని నెచ్చుగా జర్చించవచ్చును. ఇందు తెలియవలసిన రహస్యము లనేకములు గలవు. ఇచ్చట నప్రస్తుతములు గావున ప్రకృత మనుసరింతము.

శి॥ —కానిందు అయ్యా శంకరుని కటాక్షముచే వృద్ధినొందిన రావణుడాతనియెడ నిట్టి యపకృతి కేలసలుపకట్టెను?

గు॥ ఓయీ ఇందునకనేక కారణములుకలవు. రావణుడుమహాజ్ఞాని- సకలైశ్వర్యములకును విసికి భగవంతునిసన్నిధికెన్నడేగి ముక్తుడగుదునని గోరి శీఘ్రముగా శరీరపాతముకొరకిట్టి పనులనెన్నియోచేసెను. తుదకుసీతాహరణముజేసి స్వామిని జేరుకొనెను. ఒకపక్షమున రావణుడు జ్ఞానికాకుండెనేని యాతని చరితమువలన మహా దుష్టుడని చెప్పకతప్పదు. పామునకు బాలుపోసిన క్రియదుష్టునకొనరించిన మేలు నిష్ప్రయోజనమగును. కావున నాతనిదుష్టస్వభావము కారణమనియు స్థూలదృష్టిచే భావింపవచ్చును. ఇంకనెన్నియో యుపపత్తులున్నవి. కాని వానియవసరమిందులేదు.

ఇకను ముందుశ్లోకమున మఱియొకభక్తునిచరిత్రము నెత్తుకొని స్వామిని నుతించుచున్నాడు-వినుము.

శ్లో॥ యదృద్ధిం సుత్రామ్ణోవరద పరమోచ్చైరపిసతీ
మథశ్చక్రేబాణః పరిజనవిధేయత్రిభువనః
నతచ్చిత్రం తస్మిన్వరి వసితరిత్వచ్చరణయో
ర్నకస్యాఉన్నత్యైభవతి శిరసస్త్వయ్యవనతిః॥ ౧౩

టీ॥ హేవరద=భక్తాభీష్టములనిచ్చుశంకరుడా; పరిజన=తనసేవకులకు, విధేయ=వశమైనత్రిభువనః= ముల్లోకములుగలవాడగు, బాణః=బాణాసురుడు, పరమోచ్చైః=మిక్కిలి గొప్పతనముతో, సతీం=ఉన్నట్టి, సుత్రామ్ణః=ఇంద్రునియొక్క, ఋద్ధిం=విభవమును, అపి=సైతము, అథశ్చక్రే=జయించెను, తత్=ఆసంగతి, త్వచ్చరణయోః=నీపాదములందు, వరివసితరి=సేవకుడైన, తస్మిన్=ఆబాణాసురునియందు, నచిత్రం=ఆశ్చర్యమైనది కాదు-, (ఏలననిన) త్వయి=నీయందు, శిరసః అవనతిః=శిరమువంచుట (నమస్కారము) కస్యాః=దేనియొక్క, ఉన్నత్యై=ఉన్నతికొరకు (ఏయున్నతినిచ్చునది) నభవతి=కాకున్నది- (అన్నియైశ్వర్యములనిచ్చునది.)

గ॥— ఇందు భక్తవరదానరూపమున స్వామియొక్క కీర్తి నుతింపబడుచున్నది. బాణాసురుడు స్వామినారాధించి యాతని దన ద్వారపాలునిగానొనరించుకొనెను. కావుననే మూడులోకములును దనసేవకులకు వశమైయున్నవని శ్లోకమున జెప్పబడెను. ఇట్టి యైశ్వర్యముమాత్రమేకాక తనను సైతము సర్వస్వముగా భక్తులకు దానమొసగిన దాత వీవేకదా యని స్వామియొక్క కీర్తి నుతింపబడెను. బాణాసురుని వృత్తాంత మందరెరిగినదేకదా.

ఇక నీదిశ్లోకమున హరియొక్కవిషయమును గైకొని స్వామియొక్క అనంతశక్తి నుతింపబడుచున్నది.

శ్లో॥ అకాండబ్రహ్మాండక్షయచకిత దేవాసురకృపా
విధేయస్యాసీద్యస్త్రినయనవిషం సంహృతవతః
సకల్మాషఃకంఠే నతవ్రకురుతేనశ్రియమహో
వికారోపిశ్లాఘ్యో భువనభయభంగ వ్యసనినః॥ ౧౪

టీ॥— హే త్రినయన=ఓ ముక్కంటీ; అకాండ=అకాలమునందైన, బ్రహ్మాండక్షయ=బ్రహ్మాండమునకు గానున్న నాశనమునకు, చకిత=భయపడి వడకుచున్న, దేవాసుర=దేవతలందును రాక్షసులందును, కృపావిధేయస్య=దయను చూపించుటకు పూనుకొనినట్టియు, (అందువలననె) విషం=కాలకూటవిషమును, సంహృతవతః=సంహారము చేసినట్టియు, తవ=నీయొక్క, కంఠే=కంఠమునందు, యః కల్మషః ఆసీత్=ఏ నల్లనిమచ్చ గలిగెనో, సః=అది, శ్రియం=శోభను, నకురుతే ఇతి న=చేయుక పోలేదు. అహో=ఆశ్చర్యము, భువనభయ=లోకమునకు గలిగెడు ఆపదను, భంగ=తొలగించుటయందు, వ్యసనినః=పూనినవానికి, వికారోపి=(అందువలన గలిగిన) వికృతిసైతము, శ్లాఘ్యః=నుతింపతగినది.

గు॥— పాలసముద్రమథనకాలమందు హాలాహలము బుట్టి మూడులోకములను దహించుటకు సిద్ధముగానున్న పుడు దేవాసురులచే ప్రార్థితుండై స్వామి దానిని భక్షించి కడుపులోనికి బోకుండ కంఠమునం దొకమూలనుంచగా దాని వేడిమిచే కంఠము కమిలి నల్లనిమచ్చ కట్టెను. అది మొదలు నీలకంఠుడు, కాలకంఠుడు, శ్రీకంఠుడు

మొదలగు నామములు స్వామియందు ప్రవర్తించెను. అటుల నన్యసాధ్యమగు కార్యమొనరించి ముల్లోకములను రక్షించిన స్వామియొక్క సంపూర్ణత్వము, ఈశ్వరత్వము, వీర్యము, కీర్తి మొదలగు గుణము లిందు నుతింపబడినవి. ఈ గాథ సుప్రసిద్ధము.

శి॥— అయ్యా అది అకాండమని చెప్ప నేల?

గు॥— బ్రహ్మాండ మింక చిరకాలము ప్రవర్తించవలసిన కాలమున్నను అప్పు డావిషముచేత క్షయమగుటకు సిద్ధమగుటచే దాని నకాండమని చెప్పెను. ఆకాలమృత్యువువంటిది కావుననే స్వామి పరిహరించెను. యుక్తకాలమునందు గలిగెనేని దానిని స్వామి పరిహరింపడు. కావున నావిశేషణము సాభిప్రాయము.

శి॥— బ్రహ్మాండమునంతయు దహింపజాలిన కాలకూటము శివు నేల దహింపలేదు.

గు॥— శివుడు భగవంతుడు. జగత్ప్రభువు. అతని కన్నియు వశమునసుండును. అతని యాజ్ఞానుసారమగునవి యాతని నెట్లు నిర్జించును. "భీషాస్మా ద్వాతః పవతే" అను మొదలగు శ్రుతులను జూడుము.

శి॥— అంతటి సర్వదమనుడు మచ్చలేకుండమాత్రము మ్రింగలేకపోయెనా?

గు॥— అటుల జేయనేరక కాదు. అదియొకవిలాసము, మరియు బ్రహ్మాండమునంతయు గాల్చజాలు శక్తి నావిషమునందు తానేయుంచి యది వ్యర్థమగునటులచేయుట యుచితమగునా? దానిశక్తిని సంపూర్ణముగా నిరర్థకముజేయక తాను కొంతవరకు దానికి విలాసార్థముగను భక్తులకు విశ్వాసము చెడకుండుటకును లొంగి నటించెను. జగద్వ్యాపారముల నెప్పటికప్పుడు స్వామి చుల్కనగా త్రిప్పివేయుచుండినచో జనులు కాతని నిబంధనలందు విశ్వాసముచెడి లోకప్రవృత్తి కనర్థము వాటిల్లును. ఈయంశము కొంతదనుక శ్రీమద్భాగవతశిరమందు వివరింపబడినది చూడుము.

శి॥— త్రినయనశబ్ద సారస్యమేమి?

గు॥— లోకములను సంహరింప ప్రవర్తించినది కాలకూటము. దానిసంహారము కావలసియున్నది. సంహారమొనరించు కార్యము రుద్రునిది. అతనికే సర్వనాశకరణ సాధనమగు మూడవనేత్రముకలదు. కావున నాతని దేవాసురులు వేడుట త్రి

నయన అని సంబోధనచే అన్నిటిని నాశనముచేయగల నేత్రముగల స్వామీ! మరియొకటి లోకనాశన మొనరింపవచ్చుచున్నది. నీవుగాక మరియొకటి అట్టిపని జేయవచ్చునా? అని యాతని బిరుదముతో సాభిప్రాయముగా దేవదానవులు వేడికొనిరి.

ఇక ముందుశ్లోకమున స్వామియందు మోసముదలచిన దానిఫలమును మన్మధునినిధనకథను గైకొని వర్ణించుచున్నాడు చూడుము.

శ్లో॥ అసిద్ధార్థానైవక్వచిదపిసదేవాసురనరే
నివర్తంతేనిత్యంజగతిజయినోయస్యవిశిఖాః
సపశ్యన్నీశత్వామితరసురసాధారణమభూత్
స్మరస్స్మర్తవ్యాత్మానహివశిషుపథ్యఃపరిభవః॥ ౧౫

టీ॥— హేఈశా=ఓప్రభువా, సదేవాసురనరే=దేవతలు-అసురులు, నరులు వీరితో గూడిన, జగతి=జగమునందు, యస్య=యెవనియొక్క, నిత్యం=ఎల్లప్పుడు, జ

యినః=జయశీలములగు, విశిఖాః=బాణములు, క్వచిదపి=ఒకప్పుడైనను, అసిద్ధార్థాః=నిష్ఫలములయి, ననివర్తంతే(ఏవ)=తిరిగిరానేరవో సః=(అటువంటి) స్మరః=మన్మథుడు, త్వాం=నిన్ను, ఇతరసురసాధారణం=తక్కినదేవతులతో సమానునిగా, పశ్యన్=చూచుచున్నవాడై, స్మర్తవ్యాత్మా=జ్ఞాపకమునకుమాత్రము తెచ్చుకోతగిన ఆత్మకలవాడు (అనగా తలచుకొనుటకేగాని చూచుటకు సాధ్యము కానివాడు అనగా నశించినవాడు) గా, అభూత్=అయెను. (ఇదియుచితమే ఏలననిన) వశిషు=ఇంద్రియనిగ్రహముగలవారియందు, పరిభవః=అవమానము, నపథ్యః=శ్రేయము కాదు.

సు॥— ఇందు స్వామి మదనునిజయించిన ముచ్చట నుతింపబడుచున్నది. మన్మథుని బాణములు మూడులోకములందును అడ్డులేక అందరిని లోబరుచుకొనుచున్న వనుట లోకవిదితమే. ఆగర్వముచేతనిన్ను సైతము తక్కిన దేవతలవంటివాడవేఅనియెంచి యెదిరించి తానెన్నడెరుగని పరాజయముమాత్రమే కాక తానే నశించెను. ఇంద్రియనిగ్రహముగలిగిన మహాత్ములనెదిరించినచో నెంతవాడైనను శ్రేయమును

(7)

గాంచనేరడుకదా. అని స్వామియొక్క వీర్యమును వైరాగ్యమును నుతింపబడుచున్నవి. అంతేకాక స్వామిభక్తిచే సాధ్యుడుకాని ఎదిరించెడువారికి నాశకుడేయని సూచింపబడుచున్నది. మహాత్ములయెడల భక్తి పథ్యముకాని పరిభవము పథ్యముకాదని చెప్పబడినది.

ముందుశ్లోకమున స్వామిలోకసంరక్షణము నొకచిత్రరూపమున నొనరించిన ముచ్చట నుతింపబడుచున్నది.

శ్లో॥ మహీపాదాఘాతాద్వ్రజతిసహసాసంశయపదం
పదంవిష్ణోర్భ్రామ్యద్భుజపరిఘరుగ్ణగ్రహగణం
ముహుర్ద్యౌర్దౌస్థ్యంయాత్యనిభృతజటాతాడితతటా   ద్యౌః
జగద్రక్షాయైత్వంనటసిననువామైవవిభుతా॥   ౧౬

టీ॥— పాదాఘాతాత్=నీపాదములదెబ్బలచేత, మహీ=భూమి, సంశయపదం (ఉన్నదాలేదాయని) సందేహించుటకు తగిన యవస్థను, సహసా=త్వరగా, వ్రజతి=

పొందుచున్నది. (మరియు) విష్ణోఃపదం = ఆకాశము, భ్రామ్యత్ = తిరుగుచున్న, భుజపరిఘ = అర్గళములవంటి నీభుజములచేత, రుగ్ణ = భంగమైన, గ్రహముల సముదాయముకలది (అగుచున్నది) మరియు ద్యౌః = స్వర్గము, ముహుః = మాటిమాటికి, అనిభృత = నిశ్చలమైన, జటా = నీజడలచేత, తాడిత = కొట్టబడిన తటా = ప్రదేశములుకలదియై, దౌస్థ్యం = దుస్థితిని, యాతి = పొందుచున్నది (ఇటుల) త్వం = నీవు, జగద్రక్షాయై = లోకరక్షణముకొరకు, నటసి = నాట్యముసేయుచున్నావు; నను = అయ్యా, విభుతా = ప్రభుత్వము, వామైవ = చిత్రమైనదేను. గ్రహాః

గు॥— బలవంతుడగు శత్రుడొకడు సంధ్యాసమయమున జెలరేగి లోకములను బాధించుటకు ప్రారంభించగా వానినిసంహరించుటకు స్వామి తాండవముచేయుచున్నాడు. ఆతాండవమున పాదఘట్టనముచేత భూమియు, చేతులుత్రిప్పుటచే నక్షత్రమండలముతో ఆకాశమును మిక్కిలి దట్టమగు జటాజూటముచేత స్వర్గమును మిక్కిలి కష్టమును పొందుచున్నవి. ఇటుల ముల్లోకములను రక్షించుటకొరకే యఖండతాండవమాడుచు వానికి గష్టమును గలిగించుచున్నావు. ఓస్వామీ నీప్రభుత్వము మిక్కిలిచిత్రమైనది అనినుతి.

శి॥— అయ్యాయిందుచిత్రమేమి.

గు॥—లోకములను రక్షించువాడు వానికిక్లేశమును గలిగించుటచిత్రము. మరియొకక్రూరునిబాధ తొలగించుటకు వానిని జయించుటయుక్తము. వానితో బోరాటకు మారుగా తాండవ రూపమున వానిని జయించుచున్నావు. శత్రుసంహారమిటుల వినోదరూపముగా జేయుచున్న నీతాండవము లోకములు భరింపజాలనంత బలముగా నున్నది. ఇట్టి నీవిభుత్వ మతిచిత్రమైనది. అని స్వామియొక్క ఐశ్వర్యము నుతింపబడినది.

ఇక మీదిశ్లోకమున స్వామి భక్తులకొర కెట్టిపనినైన జేయునని వర్ణింపబడుచున్నది.

శ్లో॥ వియద్వ్యాపీతారాగణగుణిత ఫేనోద్గమరుచిః
ప్రవాహోవారాంయః పృషతలఘుదృష్టశ్శిరసితే
జగద్వీపాకారం జలధివలయం తేన కృతమి
త్యనేనైవోన్నేయం ధృతమహిమదివ్యం తవవపుః॥ ౧౭

టీ॥— ఓస్వామీ! వియత్=ఆకాశమును, వ్యాపీ=వ్యాపించునట్టిస్వభావముకలదియు, తారాగణ=నక్షత్రగణములచేత, గుణిత=ఎచ్చింపబడిన, ఫేనోద్గమ=బయలుపడిన నురుగయొక్క, రుచిః=కాంతిగలిగినదియు, వారాం=గంగయొక్క, యః ప్రవాహః=ఏప్రవాహముకలదో అది, తే=నీయొక్క, శిరసి=శిరస్సునందు, పృషతలఘు=నీటిబిందుకంటె చిన్నదిగా, దృష్టః=కనబడినది. (మరియును) తేన=ఆనీటిబిందువువలెనున్న గంగాప్రవాహముచేత, జగత్=లోకము, జలధివలయం=సముద్రముచుట్టుగల, ద్వీపాకారం=ద్వీపమువంటిదిగా, కృతం=చేయబడినది. ఇతి=అను, అనేనైవ=ఈసంగతిచేతనే, తవ=నీయొక్క, దివ్యం వపుః=స్వప్రకాశముగల శరీరము, ధృతమహిమ=పెద్దమహిమగలదిగా, ఉన్నేయః=ఊహింపతగినది.

తా॥— ఆకాశగంగ స్వర్గమునుండి భూలోకమునకు దిగుచుండుసమయమున నా ప్రవాహమునందలి తెల్లనినురుగుచేత నక్షత్రగణము మరింత తెల్లగా నయ్యెను. అటుల నాకాశము నంతయువ్యాపించి వచ్చినప్రవాహమును నీ జటాజూటమున

నొక జలబిందువువలె ధరించితివి. ఆప్రవాహమునం దొకపాయను విడువగా నది జగత్తునుజుట్టి దానిని ద్వీపముగా నొనరించెను. ఈయంశము నెంచినచో నీదివ్యశరీరముయొక్క మహిమను వెల్లడియగునుగదా. అని స్వామి సంపూర్ణత్వముయొక్క నుతి. ఇదియుగాక భక్తుడగు భగీరథుని రక్షించుటయు, నాతడొనరించిన కార్యమువలన నవాంతరముగా లోకోపద్రవము గలుగుచుండ దానిని దొలగించి లోకములను రక్షించుటయుసైతము స్ఫురించుచు స్వామియొక్క ఐశ్వర్య, వీర్య, కీర్తులు నుతింపబడినవి.

మరియు స్వామియొక్క ఐశ్వర్యమును, వీర్యమును మరియొకతీరున ముందు శ్లోకమున నుతింపబడుచున్నది.

శ్లో॥ రథః క్షోణీయంతా శతధృతిరగేంద్రో ధనురథో
రథాంగే చంద్రార్కౌ రథచరణపాణి శ్శరఇతి
దిధక్షోస్తే కోయం త్రిపురతృణమాడంబరవిధి
ర్విధేయైః క్రీడంతో నఖలు ఫలతంత్రాః ప్రభుధియః॥ ౧౮

టీ॥— ఓస్వామీ! త్రిపురతృణం=త్రిపురాసురులనే గడ్డిపోచను, దిధక్షోః=కాల్చివే యుటకుదలంచిన, తే=నీకు, రథః=రథము, క్షోణీ=భూమి (అయినది), యంతా=సారథి, శతధృతిః=బ్రహ్మ, ధనుః=ధనువు, అగేంద్రః=పర్వతరాజైన మేరువు, అథః=క్రిందను, రథాంగే=రథచక్రములు, చంద్రార్కౌ=చంద్రసూర్యులు, బాణః=బాణము, రథచరణపాణిః=చక్రధరుడగు విష్ణువు, ఇతి=ఈ తీరున, అయం ఆడంబరవిధిః=ఈ ఆడంబరవిధానము (సన్నాహము), కః=ఏమిటిది అనగా ఎందుకింతసన్నాహము, ప్రభుధియః=ప్రభువులబుద్ధులు, విధేయైః=సేవకులతో, క్రీడంత్యః=ఆడుకొనునట్టివి, (కాని) ఫలతంత్రాః=ఫలము నందపేక్షగలవి, నఖలు=కావుగదా.

గు॥— త్రిపురాసురసంహారమునకు స్వామి బయలువెడలినపుడు మహాసన్నాహముతో బయలుదేరెను. శ్లోకమున జెప్పినతీరున బ్రహ్మ విష్ణువు మొదలగువారందరు నా సన్నాహమున నుండిరి. త్రిపురాసులు లోకముల కుపద్రవ మొనరించువారును మహాభయంకరులును అయినను తృణప్రాయముగా స్వామి సంహరింపగలడు.

అటుల శక్తిమంతుడయ్యును తనకు భృత్యులగు బ్రహ్మాదులకోరిక తీర్చుటకు వారిని సహాకారులుగా నంగీకరించెను. ప్రభువులు పెద్దకార్యము లొనరించినపుడు అసహాయముగా తాముచేయగలిగినను తమ భృత్యువర్గమునకు సైతము దాని గౌరవ మిచ్చుటకు వారితోగూడ నాకార్యముల నొనరింతురు. అంతేకాని వారివలన నొకఫలము నపేక్షించి కాదని మతి.

ఇందువలన భక్తానుగ్రహరూపమగు ప్రభుత్వము నుతింపబడినది.
ముందుశ్లోకమున మరియొకతీరు భక్తానుగ్రహము నుతింపబడుచున్నది.

శ్లో॥ హరిస్తే సాహస్రం కమలబలిమాధాయ పదయో
ర్యదేకోనే తస్మిన్నిజముదహరన్నేత్రకమలం
గతో భక్త్యుద్రేకః పరిణతిమసౌ చక్రవపుషా
త్రయాణాం రక్షాయై త్రిపురహర జాగర్తి జగతాం॥　　౧౯

టీ॥— హేత్రిపురహర=ఓత్రిపురాంతకా, హరిః=విష్ణువు తేపదయోః=నీరెండుపాద

ములందును, సాహస్రం=వేయిసంఖ్యగల, కమలబలిం=కమలములతోడి పూజను, ఆధాయ=ఉంచి, తస్మిన్=ఆపూజయందు, ఏకః=ఒకటి (కమలము) ఊనే=తక్కువగుచునుండగా, నిజం=తనయొక్క, నేత్రకమలం=నయనపద్మమును, ఉదహరత్=పెకలించి దానితో పూజించెను. ఇతియత్=ఈవిషయము, అసౌభక్త్యుద్రేకః=ఆభక్తియొక్క అతిశయము. చక్రవపుషా=చక్రముయొక్క రూపముతో, పరిణతిం=ఫలమును, గతః=పొందినదై, త్రయాణాంజగతాం=మూడులోకములయొక్కయు, రక్షాయై=సంరక్షణకొరకు, జాగర్తి=మేలుకొనియున్నది.

తా॥—మహావిష్ణువొకపుడు స్వామిపాదములకు వేయికమలములతో పూజించుటకు సమకట్టెను. అపుడు స్వామివిలాసార్థ మొక కమలము గానరాకుండ జేసెను. విష్ణువును స్వామిపాదముల బూజించుచు తుద కొక కమలము తక్కువగుట జూచి పూజావిఘ్నము రాకుండ తన నేత్రము నూడబెరికి కమలమునకు మారుగా నర్పించి పూజించెను. అంతట నాతని భక్తివిశేషమునకు స్వామి సంతసించి యాతని కన్ను మరల నెప్పటియటుల నొసంగి యొక చక్రము నాతనికొసం

గెను. ఆచక్రముతో విష్ణువు మూడులోకముల నెల్లపుడుసంరక్షించుచున్నాడు. దానికి సుదర్శనమని పేరు. ఇచట సుదర్శనమనగా మంచికన్ను అని యర్థము. కన్ను సమర్పించుటవలన లబ్ధమైనది కావున సుదర్శనమని పేరు. ఈశబ్దమువలన నీ ముచ్చట సూచింపబడుచున్నది.

ఇక ముందుశ్లోకమున భక్తిలేనివారికి శిక్షాపూర్వకముగా జ్ఞానోపదేశ మొనరించిన సంగతి సుతింపబడుచున్నది.

శ్లో॥ క్రతౌసుప్తేజాగ్రత్త్వమసి ఫలయోగేక్రతుమతాం
క్వకర్మప్రధ్వస్తం ఫలతిపురుషారాధనమృతే
అతస్త్వాం సంప్రేక్ష్యక్రతుషు ఫలదానప్రతిభువం
శ్రుతౌ శ్రద్ధాం బధ్వా దృఢపరికరః కర్మసుజనః॥ ౨౦

టీ॥—ఓదేవా! క్రతౌసుప్తేసతి=యాగము నిద్రపోయినది (సంపూర్ణమైనది) కాగా, క్రతుమతాం=యాగమునొనరించినవారికి, ఫలయోగే=యాగఫలమిచ్చుటయం

ము, జాగ్రత్ = మేలుకొన్న (సిద్ధముగానున్న) వాడవు, త్వమసి = నీవగుచున్నావు; ప్రధ్వస్తం = సంపూర్తియగుటచే నశించినట్టి, కర్మ = కర్మ (యాగము), పురుషారాధనమృతే = ఈశ్వరారాధనవలన గాక మరియొకతీరున, క్వఫలతి = ఎచ్చటఫలించును (ఫలింపనేరదనుట), అతః = అందువలన, త్వాం = నిన్ను, క్రతుషు = యజ్ఞములందు, ఫలదానప్రతిభువం = ఫలము నిచ్చుటయందు ప్రతినిధి (భారమును వహించినవాడు)గా, సంప్రేక్ష్య = చూచి (బాగుగానిశ్చయించి), శ్రుతౌ = వేదమునందు, శ్రద్ధాం = శ్రద్ధను, బధ్వా = కట్టి (ఉంచి), కర్మసు = కర్మలయందు, జనః = లోకము (జనులు), దృఢపరికరః = గట్టి సాధనము కలదియగుచున్నది.

గు॥—ఇంక మీమాంసకు లనుకొందరు వైదికకర్మలే సమస్తఫలమునిచ్చును. కర్మవలననే జగమంతయు గలుగుచున్నది కావున జగత్కారణము కర్మయేకాని యీశ్వరుడు కాడను మతమును నిరసించుచు స్వామిమాహాత్మ్యమును బుష్పదంతుడు నుతించుచున్నాడు. ఎట్లనిన,

ఓస్వామీ! సమస్తమునకు కర్మయే కారణమని కొందరనుచున్నారు. అది నిక్కముకానేరదు. యాగాదికర్మలు పూర్తిగాక ఫలము నీయనేరవుకదా. పూర్తియగుట అనగా నశించుటయే. అవి నశించి మరి కొంతకాలమునకవి ఫలము నెటుల నీయగలవు. ఏదియేని ఫలమునిచ్చునది తానుండి యీయవలయును గాని లేని దెన్నడును ఫలము నీజాలదు.

శి॥—అయ్యా, అటులననేల? ఫలము పుట్టునపుడు దానికారణముండనవసరమేల? ఒక కార్యము జరిగి మరియొకతీరునమారి ఫలమునిచ్చుచుండుట లోకమునకలదుకదా.

గు॥—అటులంటివేని అది పరంపరాకారణమనవలసివచ్చును. గాని ఫలము నిచ్చుకారణము కాదు. ఫలము నిచ్చునది దానికవ్యవధానముగా ముందుండినదియే గాని యంతకుపూర్వముండినది కానేరదు. మరియు ననవస్థాదోష మొకటి యొదవును. నీవు చెప్పినటుల పరంపరాకారణ మొప్పినచో హద్దేనాటికి లేక అన్నిటికన్నియు కారణములగును. మరియు జడమగు కర్మ చేతనమున కెటుల కారణమగును? కానోపదు. అని యిటుల కర్మప్రధానవాదులమతమును నిరసించుచు స్వా

మిని నుతించుచున్నాడు. కావున నో దేవా! సకలకర్మలకును తగ్గ దుచితఫలముల నొసంగువాడవు నీవే. అది తెలిసియు శ్రుతులందు విశ్వాసముంచి జనులు కర్మల నొనరించుచున్నారు. లేనిచో జడమగు కర్మను నవిఃష్ఠ యెవరును ప్రవర్తింపరుకదా యని నుతి.

శి॥—అయ్యా, ఈశ్వరుడే ఫలప్రదాత యగునపుడు మరి వేదక్రియల యవసరమేమి?

గు॥—ఓయీ! ఈశ్వరుడు సర్వఫలముల నిచ్చువాడు. ఎవ డేఫలమును బొందుటకు దగియుండునో యది వాడొనరించు కర్మ ననుసరించియుండును. తాను వేదవిహితకర్మల నొనరించి యధికారికాగా వానికి దగినఫలమును స్వామియిచ్చును. కర్మయొనరించినంతమాత్రమున ఫలము గలుగనేరదు. ఫలము నొందుట కధికారము మాత్రమే వచ్చును. ఈశ్వరారాధనమువలన ఫలప్రాప్తియగును. ఫలము ఈశ్వరాధీనము. దానిని బొందుటకు అధికారము అనగా అర్హతసంపాదించుటకు కర్మసాధనము. అనగా ఫలప్రాప్తికావలసినవాడు, దానికిసాధనమగు కర్మను ఫలదాతయగు నీశ్వరుని సంతోషింపజేయునటుల జేసినేని కర్మసాధన

మూలమున నీత డధికారి యయ్యెననియు దనభక్తుడనియు సంతసించి స్వామి ఫలమునిచ్చును. ఈశ్వరప్రీతిలేక కర్మ యొనరించినచో నది ఫలప్రదాతగాక నిష్ఫలమగుచున్నది. ఈవిషయము భాగవతశిరమున భక్తిస్వరూపవర్ణయందు విపులముగా జెప్పబడినదికదా.

శి॥—అయ్యా, ఈశ్వరారాధన లేని యాగ మెచ్చటనైనను వ్యర్థమగుచున్నదా?

గు॥—అయినది. సందేహ మెందుకు. ముందుశ్లోకమును జూడుము. ఈయంశము సహజముగా నీగ్రంథారంభమున కొన్నిమతములను ఖండించునపుడు చెప్పవలసియుండెను. ఇక్కడ చెప్పుటకు గారణమేమనిన- భక్తానుగ్రహవిలాసములను నుతించుచు భక్తి లేని కర్మసులకు శిక్షాపూర్వకముగా జ్ఞానోపదేశము చేసెనని స్వామి

భక్తి యొక్క ~~భక్తి~~ మాహాత్మ్యమును విస్తరించి చెప్పుచున్నాడు. ఈసందర్భమున ఈశ్వరారాధనము (భక్తి) సకలకర్మలకును ఫలమును సంపాదించుననియు నదిలేదేని యాకర్మలు ఫలము నీయజాలవనియు దెలుపుచు ముందు రాబోవుశ్లోకమున దక్షు డొనరించిన యాగమునుగురించి ప్రసంగించుచున్నాడు. దాని

కవతాళికగా నీశ్లోకము చెప్పబడినది. కావుననే యిచ్చట నీశ్లోకమునకు యుక్త స్థానము. ఇందు కర్మప్రధానవాదఖండనము అవాంతరప్రసంగము. కాని ప్రధానము కాదు.

శ్లో॥ క్రియాదక్షో దక్షః క్రతుపతిరధీశ స్తనుభృతా
మృషీణామా ర్త్విజ్యంశరణదసదస్యాస్సురగణాః
క్రతుభ్రంశ స్త్వ త్తః క్రతుషుఫలదానవ్యసనినో
ధ్రువంక ర్తుశ్శ్రద్ధావిధురమభిచారాయహిమఖాః॥

టీ॥—హేశరణద=శరణార్థులకు శరణమగుశివుడా, తనుభృతాం=శరీరధారులకు, అధీశః=ప్రభువును (సృష్టిజేయుప్రజాపతి కావున) క్రియాదక్షః=యాగాది కర్మల యందు నేర్పరియునగు, దక్షః=దక్షప్రజాపతి, క్రతుపతిః=యాగముచేయు వాడు, ఋషీణాం=ఋషులయొక్క, ఆర్త్విజ్యం=యాగమును చేయించువార లైయుండుట, సురగణాః=దేవతాసమూహములు, సదస్యాః=సభ్యులు, (ఇన్ని

యున్నను) క్రతుషు=యాగములందు, ఫలదానవ్యసనినః=ఫలమునిచ్చుటయందాసక్తిగల, త్వత్తః=నీవలన, క్రతుభ్రంశః=యజ్ఞనాశనము (కలిగెను) (అదియుక్తమే ఏలననిన) శ్రద్ధావిధురం=శ్రద్ధలేనివాడగు, కర్తుః=కర్తయొక్క, మఖాః=యాగములు, అభిచారాయహి=అనర్థముకొరకే యగుచున్నవికదా అనగా అనర్థము నేకలుగచేయుచున్నవి కాని ఫలమునీయ నేరవుకదా, ధ్రువం అనుపాఠము నందును అర్థమిదియె.

గు॥— వెనుకటిశ్లోకమును జూచితిమికదా ఆయంశమునకే నిదర్శనమిందుపొందు పరుచుచున్నాడు. ఒకపుడు దక్షప్రజాపతి క్రతువొనరించెను. అతడు సాధారణుడు కాడు సృష్టినిజేయు ప్రజాపతులలో నొకడు. క్రతువులొనరించుటయందు పూర్ణమగుప్రజ్ఞగలవాడు. క్రతువునుజేయించు ఋత్విక్కులును సాధారణులుకారు మహాపురుషులు, సదస్యులును సాధారణులుకారు దేవతలు అయినను క్రతువుగతి యేమాయెను? క్రతువునాశనమై యనర్థముగలిగెను. ఎవరివలన? ఈశ్వరునివలననే. ఈశ్వరుడుక్రతువిరోధియా? కాడు. మీదిమిక్కిలిక్రతువొనరించువారలకు ఫలమునిచ్చుటకు సిద్ధముగానున్నవాడు.

శి॥— అయ్యా ఇదిమిక్కిలిచిత్రముగానున్నది.

గు॥—అగును. మీదచెప్పినకారణములలో నొక్కొక్కటి యేఫలము నొడగూర్పజాలును. అన్నిగూడినను నాశనమేఫలమాయెను. మరియు చిత్రమేమనిన క్రతుఫలప్రదాతయగు నీశ్వరుడే దాని నాశనముచేసెను. ఇంతకారణ సంపత్తియుండినను కార్యోత్పత్తిలేదు సరేకదా అనర్థకార్యముసైతముకలిగెను. ఏల? ఈశ్వరారాధనలేదు కావున,

శి॥— ఈశ్వరారాధన దక్షుడేలచేయడాయెను?

గు॥— ఒకప్పుడు బ్రహ్మసభకు దక్షుడేగినప్పు డందరునాతనిరాకజూచి నిలువబడిరి. తనకల్లుడగు శివుడుమాత్రము కూర్చునియుండెను గాని నిలువలేదు. అతడు సర్వోత్తమప్రభువు. ఆతనిరాకకు అందరు నిలువవలయును గాని యాతడునిలువతగినవాడెవ్వడు. ఈమర్మము దెలియక తనకల్లుడయ్యును దన్నవమానించెనని తలంచి దక్షుడు శివునిపైయలుకవహించెను. కొన్నిదినములకు బిమ్మట దానొకక్రతువొనరించుచు నందరిని బిలిచెను గాని తనకవమానమొనరించిన శివునిగాని తనకూతురయ్యును

శివునిభార్యయగు సతీదేవినిగాని బిలువడాయెను. అందరునువచ్చి యాగమారంభమాయెను. ఆయాగసంగతి కర్ణాకర్ణికగా సతీదేవియాలకించి తన తండ్రియింటికి బోవుటకు పిలుపేలననియెంచి శివుడు వారించుచున్నను వినక యచ్చటికేగెను. అచ్చోట దన్నెవరును బలుకరించరైరి. దక్షునిభయమువలన దనతల్లి సయితము కుశలమడుగదయ్యె. ఆయవమానమును సహింపనోపక శివమహామముద్ఘోషించి యామె దేహమును జాలించెను. సభయంతయు హాహాకారముతో నిండెను. ఈ మరణవార్త శంకరుడువిని మిక్కిలిక్రోధావిష్టుడయ్యెను. సతీదేవి తనకు మహాభక్తురాలు. తన్నవమానించినను స్వామిసహించును గాని తనభక్తులయవమానమును సహించువాడుకాడు. కావున నాగ్రహించి యాయాగ్రహము నే మహాభయంకరమగు రూపమునబంచెను. అదియే వీరభద్రరూపమునబోయి యాగమును ధ్వంసముచేయగా ముందుకు మోముజూపువాడొకడైన గానరాక యందరును చెల్లాచెదరై పారిపోయిరి. ఈముచ్చట యిందెత్తికొని యీశ్వరారాధనలోపించిన కర్మ[illegible] నొనరించినను నాశనమగును. అనర్థము[illegible]

కావున స్వామీ కర్మలు ఫలదాతలు కావు. నీవే ఫలదాతవు. నీయనుగ్రహమునకు బాత్రమగు కర్మతే ఫలమునకు సాధనములు తక్కినవి యనర్థహేతువులని స్వామి యొక్క భక్తరక్షణయు భక్తిహీనులదండనయు చెప్పబడుచు స్వామిప్రభుత్వము ను సర్వశక్తిమత్వమును నుతింపబడినవి ఇట్టియంశమే మరియొకటి ముందుశ్లోకము న జెప్పబడుచున్నది చూడుము.

శ్లో॥ సతాంవర్త్మత్యక్త్వా శ్రుతిసమధిగమ్యం సహభువం
ఘృణామప్యున్మూల్య స్వజనవిషయస్నేహగుణితాం
ద్విజఃకృన్తన్పాదే పితరమపరాద్ధం త్వయి విభో
మనుష్యత్వం సద్యస్త్రిదశపరిణామేన విజహౌ॥ (౨౧)

టీ॥— హేవిభో=ఓస్వామీ, శ్రుతిసమధిగమ్యం=వేదములవలన పొందతగినదియు, సహభువం=వేదముతో గూడనున్నదియును అగు, సతాంవర్త్మ=సజ్జనుల మార్గమును, త్యక్త్వా=విడిచి, స్వజనవిషయస్నేహగుణితాం=తనవారియందలి

అనురాగముచేత నధికమైనట్టిదియు, ఘృణామపి=దయనుసైతము, ఉన్మూల్య= ఊడబెరికి (విడనాడి), త్వయి=నీయందు, అపరాద్ధం=అపరాధమును జేసిన, పితరం=తండ్రిని, పాదే=పాదమునందు, ద్విజః = విప్రుడు, కృంతన్=నరికి వేయుచు, సద్యః=తత్క్షణమే, త్రిదశపరిణామేన=దేవత్వమును బొందుటచేత మనుష్యత్వం=మానుషత్వమును, విజహౌ=విడిచెను.

గు॥—మునుపొకవిప్రకుమారుడు మిక్కిలిభక్తిగలిగి యొకపదార్థమునందు శివుని ప్రతిష్ఠించి పూజించుచుండెను. ఒకనాడాతని తండ్రి దానిజూచి యోరీ యేలనిట్టి యపవిత్ర వస్తువును బూజించుచున్నావని కోపించి దాని తనకాలితో దన్నెను. కుమారుని దృష్టిచే నది శివుడే కాని యపవిత్రవస్తువు కాదు కావున నీశ్వరుని తనకాలితో దన్నిన యపరాధమునకోర్వలేక తనతండ్రియందలి ప్రేమసైతము బాటింపక యాతని పాదమొక వేటున దెగనరికెను ఇందువలన నాతడొనరించినది శ్రుతివిరుద్ధమును సత్పురుషులు నిందించునదియు నైనను నీయందలి భక్తి అన్నిటికంటె బలవత్తమము కావున నోస్వామీ! నీ వాతనికి వెంటనే మనుష్యజన్మము బాపి దేవత్వమొసగితివి.

అనగా శ్రుతివాక్యోల్లంఘనము సైతము ఈశ్వరభక్తిచే సంభవించినపుడు శ్రేయోదాయకమగుననియు స్వామిరక్షించుననియు స్వామియొక్క సర్వప్రభుత్వము నుతింపబడినది.

శి॥— అయ్యా స్వామియైనను నిందితములగు కార్యముల నంగీకరించునా?

గు॥— అంగీకరింపడు ఈ శ్లోకమున తండ్రియొనరించినది నింద్యము. అందువలన శిక్షాపాత్రుడాయెను. భక్తిగలవాడు నింద్యకార్యములెన్నడు జేయడు, ఒకపుడు పితృహననము నింద్యము కావున విప్రకుమారుడొనరించినది నింద్యమందు వేమో అటుగాదు స్వామిద్రోహి తండ్రియైనను హంతవ్యుడే. నింద్యచరిత్రుడగు విప్రకుమారుని స్వామి రక్షించుటచే స్వామి నింద్యకార్యముల నామోదించువాడని సంశయింపకుము. నిక్కముగా నింద్యకార్యములొనరించువారు శిక్షాపాత్రులని మీది శ్లోకము చెప్పుచున్నది. చూడుము.

శ్లో॥ ప్రజానాథంనాథప్రసభమభికం స్వాందుహితరం
గతంరోహిద్భూతాం రిరమయిషుమృశ్యస్యవపుషా

ధనుష్పాణేర్యాతం దివమపిసపత్రాకృతమముం
త్రసంతం తేద్యాపి త్యజతినమృగవ్యాధరభసః॥ (౨౨)

టీ॥— హేనాథ=ఓస్వామీ, అభికం=కామాతురుడైనట్టియు, (అందువలననే) రోహిద్భూతాం=ఆడులేడిరూపమునుధరించిన, స్వాందుహితరం=తన కొమార్తెనే, ఋశ్యస్యవపుషా=లేడియొక్క రూపముతో, ప్రసభం=బలాత్కారముగా, రిరమయిషుం=క్రీడించుటకు కోరుచున్నట్టివాడయి, గతం=వెళ్ళినట్టియు, ప్రజానాథం=బ్రహ్మను; (అట్టి ఆ కార్యమునకు సిద్ధపడుచున్న బ్రహ్మను శిక్షించుటకు) ధనుష్పాణేః=ధనువు చేతధరించిన, తే=నీయొక్క, మృగవ్యాధరభసః=వేటగానియొక్క ఉత్సాహముతోగూడిన వేగము, సపత్రాకృతం=బాణముచే గొట్టబడినవాడును, (అందువలన) త్రసంతం=భయపడుచున్నవాడును, దివమపి=ఆకాశమును సైతము, యాతం=పొందినవాడును, అముం=ఆబ్రహ్మను, అద్యాపి=ఇప్పటికి సైతము, నత్యజతి=విడువకున్నది.

గు॥— పూర్వ మొకప్పుడు బ్రహ్మదేవుడు తన కుమార్తెయందు మోహముకలిగి దానిని కలయఁగోరెను. అది యిట్టి దుష్టకార్యమున కంగీకరింపక లేడియాకారమును ధరించి పారిపోయెను. బ్రహ్మయును మగలేడిరూపమున దాని వెంటనంటగా నది యాకాశమునకు పారిపోయెను. ఇది చూచి శివుడు మృగవ్యాధునిరూపము దాల్చి యాతనిని బాణముతో గొట్టెను. ఆబాణము తగిలి దానితోడనే యాతడును ఆకసంబునకు పారగా శివుడు వ్యాధునిరూపముననే వెంటనంటి కొట్టి యాదుష్టకార్యమును మాన్పించెను. వారు ముగ్గురును మూడు చుక్కలరూపముగా నిప్పటికినున్నారు. అందువలన నిప్పటికిని నీవలన భయమాతనికి బోలేదని నుతించుచున్నాడు.

శి॥— అయ్యా? ఋశ్యమనగా నేమి?

గు॥— మూడుశృంగములు గలిగి అశ్వమువలెనుండు నొకవిధమైన మృగము.

శి॥— ఇట్టిజంతువు నిక్కముగా గలదా?

గు॥— ఉండియుండును. ఇపుడున్నదో లేదో నే నెరుగను. ఉండకపోయినచో నిట్టి వ్యవహారముగాని శబ్దముగాని యుండనేరదు. ఒంటికొమ్ముగలవియు, పెక్కుకొమ్ములుగలవియు నింక ననేకచిత్రములుగలవియు నగు జంతువు లిప్పటికిని గలవుకదా. మరియు నేనొకజాతిమృగము నెరుగుదును. అశ్వముఖము, ఆవు డెక్కలు ఆవుకొమ్ములు గల జంతువొకటి కలదు దానిని నీలిగుర్రమందురు ఆదివిశాఖపట్టణజిల్లాలో జయపురరాజ్యమునందు నేనుజూచితిని. గుర్రమనుటకుగాని ఆవుఅనుటకుగాని పూర్తిగా సరిపోవదు. రెండులక్షణములును దానియందున్నవి. అతిరుననే మూడుకొమ్ములు కలిగి లేడియాకారము గల మృగమొకటియుండును. కాదేని అనేకశృంగములు గల దుప్పిజాతిలో నిది యొకజాతికావచ్చును.

శి॥— అయ్యా, ఇప్పటికిని శివుడింకను వెంబడించుచునే యున్నాడనుటచే దెబ్బతినియును బ్రహ్మయింకను మానకుండెననియు, శివుడు కొట్టుట వ్యర్థమైనదనియు తేలుచున్నదికాదా?

గు॥— అటుకాదు. ఆముచ్చట చిరకాలముక్రిందనే ముగిసెను. బ్రహ్మ యాదుష్ట కార్యమును మానెను. ఇంకను వారటుల దిరుగుచున్నారని యభిప్రాయము కాదు. మరియేమనిన జరుగుచుండినప్పటి యవస్థయుందే మిక్కిలిదుష్టకార్యము గావున వారు నక్షత్రరూపము నొందిరి. అందువలన లోకమునకొక యుపదేశము. బ్రహ్మకును ఉపదేశమే. ఇప్పటికిని ఒకయవస్థలో మనుష్యులు తమతమ ప్రతిరూపము (Photographs)ను తీయించుకొందురు. లేదేని యితరులు తీయుదురు. అంతమాత్రమున నాయవస్థ శాశ్వతావస్థయని యెంచ రాదు. అటులనే మహానీయులకును (Grate men) దోషకారులకును (Criminals) తాము విచిత్రకార్యము లొనరించుచుండు నవస్థలలోని ప్రతిరూపములను (Photos, statues మొదలగునవి) దీసి లోకమునకు జూపించుట కలదు. లోకమున కుపదేశము చెప్పగానగును. అందువలన నిట్టి విచిత్రకార్యము లోకమునకు ప్రదర్శింపబడెను. ఇటులనే త్రిశంకుడు, ధ్రువుడు మొదలగువారు నక్షత్రమండలములో నున్నారుకదా.

శి॥— అయ్యా ఈనక్షత్రములెవ్వి?

గు॥— ఇవి రోహిణి, మృగశిర, ఆర్ద్ర యనునక్షత్రములందురు.

మరియునీశ్లోకమున బ్రహ్మ స్త్రీసౌందర్య విమోహితుడై యకార్యకరణమునకు బూనుకొనెను. ఆతనిశిక్షించుటకు శివుడుసమర్థుడైను. ఇట్టియవసరములందు శిక్షించుటకు దగినయధికారము స్వామీనీకుగలదు. అనిచెప్పి నిన్నుగూర్చి తపించుచు నీకు వశవర్తినియై నీసన్నిధియందే యున్న భువనైకసుందరియగు పార్వతిచక్కదనమునకు మన్మథుడు తోడయ్యును నీకు మోహము కలిగింపలేకపోయెనని మీదిశ్లోకమున నుతింపబడుచున్నది చూడుము.

శ్లో॥ స్వలావణ్యాశంసాధృతధనుషమహ్నాయతృణవత్
పురఃప్లుష్టందృష్ట్వాపురమథనపుష్పాయుధమపి
యదిస్త్రైణందేవీయమనియతదేహార్ధఘటనా ౨౩
దవైతిత్వామద్ధాబతవరదముగ్ధాయువతయః॥

టీ॥— హేపురమథన=ఓత్రిపురాంతకా; ధృతధనుషః=ధరింపబడిన చాపముగల (అందువలన నే) అహ్నాయ=మిక్కిలి వేగముతో, తృణవత్=గడ్డిపోచవలె, ప్లుష్టం=దగ్ధుడైన, పుష్పాయుధం=కుసుమసాయకుడగు మన్మథుని, దృష్ట్వాపి=చూచియును, దేవీ=పార్వతీదేవి. యమనియతదేహార్ధఘటనాత్=యోగాభ్యాసముచే దృఢమైన (నీ) శరీరార్ధమునందు గూర్చుటచేత, స్వలావణ్యాశంసా=తనచక్కదనమును మెచ్చుకొనుచున్నదై, త్వాం=నిన్ను, స్త్రైణం=స్త్రీలోలునిగా, అధ్యైతియది=భావించున్నదయ్యేనేని, బత=అక్కటా, హేవరద=భక్తులకోరికల దీర్చునోస్వామీ, యువతయః=యౌవనప్రాదుర్భావముగల స్త్రీలు, ముగ్ధాః=ముద్దరాండ్రు; అద్ధా=ఇదినిక్కము.

యమనిరత అను పాఠమునందు, యోగాభ్యాసమునం దాసక్తిగల అని యర్థము. తాత్పర్యము రెండింటికొక్కటే.

గు॥—ఇందలి విషయము శివోద్వాహమను నాటకమున మిగుల రసవంతముగా వ్రాయబడి యున్నది. స్వామి మహాయోగి మన్మథుడు ముల్లోకములందు నడ్డులేని

వాడని గర్వించి తనశక్తిని స్వామిపై జూపబోయెను. అందుకు పార్వతీదేవి యొక్క నిరుపమానసౌందర్యవిలాసములను సాధనముచేసికొని స్వామినెదిరించెను. స్వామి వీనికి లోబడువాడు కాడు. ఈతనికి గర్వపరిహారమగునటుల మూడవకంటితో నొక్కమారు చూచువరకీతడు భస్మమాయెను. ఇది కన్నులార జూచెను. పిమ్మట శివుని నారాధించగా నాతు భక్తాధీనుడగు శంకరుండీమె కర్ధశరీర మొసగి భార్యగా గయికొనెను. తనయం దిట్టి యనన్యసాధారణమగు ప్రేమను శివుడు చూపించుటచేత తన సౌందర్య మెక్కుడనియు తన చక్కదనమును మెచ్చుకొని తనను వరించెననియు పార్వతి తలచరాదు. తన చక్కదనము మాత్రమే కాక మదనుడు సైతము తనకు సహాయకుడగు నపుడే శివుడు లొంగకపోవుట కన్నులార జూచియు తన చక్కదనమునకు మాత్రమే మనసు కరగెనని తలంచుట యుక్తముకాదుకదా! లోకమున సాధారణముగా స్త్రీలందరు తాము మిక్కిలి చక్కనివారమని తలచుకొనుచుండుట కలదు. సాధారణముగా నిది స్త్రీల స్వభావము. తానును స్త్రీగనుక నా

స్వభావము ననుసరించి పార్వతిసైతం మటుల ననుకొనవచ్చును గాని అది సరి కాదనుట ఆమెకే తెలియును. అప్పటికిని తక్కిన యాడువారివలెనే తలచినచో నామెసైతము ముద్దరాలే కదా? అని కల్పన.

ఇందు అహంకారయుక్తుడగువాడు మన్మథునివలె జెడుననియు భక్తిచే నారాధించువారికి తన శరీరమైనను శివుడిచ్చి పార్వతినివలె రక్షించుననియు స్వామియొక్క శత్రునిగ్రహమును భక్తానుగ్రహమును వెల్లడి యగుచున్నవి. మరియు నాతని మహావైరాగ్యమును జ్ఞానమును ప్రకటింపబడినవి.

మరియు శంకరుని మనసునందలి వైరాగ్యమిందు నుతించి స్థూలశరీరమునందు వైరాగ్యము ముందు శ్లోకమున నుతింపబడుచున్నది.

శ్లో॥ స్మశానేష్వాక్రీడాస్మరహరపిశాచాస్సహచరాః
చితాభస్మాలేపస్స్రగపినృకరోటీపరికరః
అమంగళ్యంశీలంతవభవతునామైవమఖిలం
తథాపిస్మర్తౄణాంవరదపరమంమంగళమసి॥ ౨౪

టీ॥— హేస్మరహర=ఓ కాముని జయించినవాడా; తవ=నీకు, ఆక్రీడా=విహారము, స్మశానేషు=స్మశానములందు; సహచరాః=సహచరులు, పిశాచాః=పిశాచములు; ఆలేపః=శరీరమునకు బూసుకొను ద్రవ్యము, చితాభస్మ=చితియందలి బూడిదె (శవములను గాల్చిన బూడిద); అపి=మరియు, స్రక్=అలంకారార్థము నీవు ధరించెడు మాల; నృకరోటీపరికరః=నరుల పుఱ్ఱెలయొక్క దండ; (ఇటుల) తవశీలం=నీవ్యాపారము, అఖిలం=అంతయును (పూర్తిగా) అమంగళ్యం=అపవిత్రమగునది భవతునామ=అగుగాక; తథాపి=అయినను హేవరద=ఓయీభక్తాభీష్టప్రదాతా; స్మర్తౄణాం=నిన్నుస్మరించువారికి, పరమం మంగళం=సంపూర్ణమంగళదాయకుడవు, అసి=అగుచున్నావు.

భా॥— ఇందు స్వామియొక్క స్థూలరూపమును అతనివైరాగ్యమును దెలుపుడు చేయుదానిగా వర్ణించుచున్నాడు. లోకమున నెవనినైనను బరీక్షించు నపుడాతని యునికిపట్టు, సహవాసము, వేషము మొదలగునవి పరీక్షింతురు. అటులనే ఓస్వామీ నీయోగ్యత పరీక్షించితిమేని లోకసామాన్యదృష్టి కంతయు

నమంగళముగా గానవచ్చుచున్నది. అయినను నిన్ను భజించువారికి సమస్త మంగళములను నీవిచ్చుచున్నావు. ఇదిమిక్కిలిచిత్రముగా గానవచ్చుచున్నది. అయిన నిక్కముగా జిత్రముకాదు. ఏలననిన లోకమునందలి యైశ్వర్యము లన్నియు నీసేవకులకైశ్వర్యములుగాని నీకుకావు. నీయైశ్వర్యమద్వితీయము లోకవిభూతులు తుచ్ఛములు కావున వానియందు నీకనురాగములేదు. కావున మిగుల విరాగివై విహరించుచున్నావు. మరియు లోకమునందలి యమంగళ ములుసైతము నీవుకటాక్షించినచో పవిత్రములయి నీసేవకావళికి కళ్యాణదా యకంబులగును. మరియు నీవుసర్వమంగళాస్థానము. నీయందమంగళము లెటులనుండును లోకు లజ్ఞానముచేత నీవేష మమంగళమని తలచుచున్నారు గాని నిక్కముగా లోకమునకు నీవు నీవేషముచేత నే వైరాగ్యమును బోధించు చున్నావు-అని యిటు స్వామివైరాగ్యమును నుతించుచున్నాడు.

శి॥— అయ్యా ఇట్టివేషమువలన లోకమునకు వైరాగ్య మెటుల బోధింపబడును?

గు॥— స్మశానము స్థూలదేహములను గాల్చుచోటు. అజ్ఞానమువలన వచ్చుచున్న దేహము కాల్చు చోటునందే అనగా జ్ఞానమునందే శివుడు విహరించుచోటు అని బోధించును. పిశాచములు దేవయోని జాతి. వారికి స్థూలదేహము లేదు. సూక్ష్మశరీరము మాత్రమే కలదు. జ్ఞానయుక్తమగు సూక్ష్మశరీరములుగలవారు స్వామికి సహచరులనుట యుచితమేకదా. భస్మలేపనుచేత పృథ్వీతత్త్వము మెండుగాగలిగి మంటివికారమైన స్థూలశరీరమునకు మూలరూపము మన్నే సుమా యని మాటిమాటికి జ్ఞాపకముచేయుచు నభిమానయోగ్య మీశరీరము కాదని చెప్పుచున్నది. మరియు నరునకు శరీరమంతటిలో శిరము ఉత్తమాంగము. అదియే జ్ఞానమునకును బ్రహ్మరంధ్రమునకు స్థానము. ప్రధానములగు జ్ఞానేంద్రియములన్నియు దానియందే కలవు. అందువలన, నన్ని తెరగులచేత "సర్వస్య గాత్రస్య శిరః ప్రధాన"మ్మనుట యుక్తమే కావున స్థూలశరీరమునందు జ్ఞాననిలయమగు నరముండములు మాలికగా ధరించి యందువలన జ్ఞానమే తనకు మిక్కిలి ప్రియమనియు జ్ఞానవంతులు తనయందు జేరుదురనియు లోకమునకు

వెల్లడి చేయుచున్నాడు. ఈరీతిని సూక్ష్మదృష్టి గలుగువారలకు స్వామి జ్ఞానోపదేశము చేయుచు వైరాగ్యమును బోధించుచున్నాడు.

మరియు తాను స్వయంప్రకాశుడగు బ్రహ్మమేగాన తనకీ నామరూపాది క్రియలు అంటవని సూచించి ముందు శ్లోకమున స్వామి బ్రహ్మస్వరూపమును నుతించుచున్నాడు.

శ్లో॥ మనఃప్రత్యక్చిత్తేసవిధమవధాయాత్తమరుతః
ప్రహృష్యద్రోమాణఃప్రమదసలిలోత్సంగితదృశః
యదాలోక్యాహ్లాదంహ్రదఇవనిమజ్యామృతమయే
దధత్యంతస్తత్త్వంకిమపియమినస్తత్కిలభవాన్॥

టీ॥— ఓస్వామీ; యమినః=యమముగలిగినవారలు (యోగులు) ఆత్తమరుతః=పొందబడిన వాయువుగలవారై (యోగశాస్త్రమున జెప్పబడిన యభ్యాసములవలన వాయువును స్వాధీనముజేసికొన్నవారలై); అంతః=తమలోపలను, ప్రత్యక్=

ఇంద్రియవ్యాపారములనుండి మళ్లిపోయిన, చిత్తే=చిత్తమునందు, మనః=మనస్సును, సవిధం=యోగశాస్త్రమున జెప్పబడిన విధిప్రకారముగా, అవధాయ=ఉంచి, ప్రహృష్యత్=మిక్కిలి సంతోషించుచున్న, రోమాణః=రోమాంచలముగలవారయి (అత్యంతసంతోషముచే పులకాంగులై) ప్రమదసలిలోత్సంగితదృశః=ఆనందబాష్పములతోగూడిన కన్నులుగలవారై, యత్ తత్త్వం=ఏవస్తువును, ఆలోక్య=చూచి, అమృతమయేహ్రదే=అమృతస్వరూపమగు మడువులో, నిమజ్య ఇవ=మునిగినటువలెనే, హ్లాదం=సంతోషమును, దధతి=ధరించుచున్నారో, తత్=అట్టి, కిమపితత్త్వం=చెప్పశక్యముకాని యొకవస్తువు, భవాన్ కిల=నీవేకదా.

గు॥—వినుము, మనస్సు మిక్కిలి చంచలమైనది. అందువలన చిత్తవృత్తులు అనుక్షణము మారుచుండును. అదియే దుఃఖస్వరూపము. ఇట్టి దుఃఖరూపమగు సంసారమునుండి ఇంద్రియవ్యాపారములను దిగనాడి అంతరాత్మయం దేకాగ్రముగా మనస్సు నిలిపి బ్రహ్మానందానుభవము చేయవలయును. ఇటుల చిత్తవృత్తులు

నిరోధించుటకే యోగశాస్త్రము ప్రవర్తించినది. ఆశాస్త్రమునందు చెప్పబడిన యమము నియమము మొదలగు నభ్యాసములచే యోగులు శరీరమునందు విచ్చలవిడిగా సంచరించుచున్న వాయువు నరికట్టి యొకచోట నిలుపుదురు. అందువలన బాహ్యప్రపంచము మరుగుపడును. అంతర్జ్యోతియగు బ్రహ్మపదార్థము (అంతరాత్మ) జాడనగును. అపుడు మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనునంతఃకరణము లన్నియు చలనములేక యొక్కటియై యాయంతరాత్మయందు లీనమగును. ఇదియే యోగశాస్త్రమున సమాధియని చెప్పబడును. ఇట్టి సమాధిసుఖము ననుభవించువాడు అమృతసరస్సులో మునిగినవానివలె మహానందము నొందుచుండును. కాని యాయానందమును ఆయంతరాత్మస్వరూపమును ఇట్టిదని సమాధి చాలించిన వెనుకనయినను తెలుప శక్యము కాదు. ఇట్టి యోగాభ్యాసము వలన మహాయోగులు వాయుధారణముచేత బాహ్యప్రపంచమును లెస్సగామరచి చిత్తవృత్తుల నన్నిటి నరికట్టి తమలోపలనే యుండునట్టియు ఇట్టిదని మాటలతో జెప్పశక్యముకానట్టియు బ్రహ్మమును జూచుచు మితిలేని యానందము నొందు

దురు అట్టి బ్రహ్మపదార్థము నీవుకాక మరియొకరు. అనగా ఓస్వామీ! నిన్నే యోగులు సమాధియందుగని యానందింతురు. అని స్వామియొక్క సర్వ శరీరవ్యాపియగు అంతరాత్మరూపము నుతింపబడుచున్నది.

శి॥— స్వామీ అన్ని శరీరములందును స్వామి అంతరాత్మగా నున్నటుల నిందు చెప్పబడినదిగదా! మరి యాతనికంటె వేరుగా బాహ్యశరీరములుకూడ కలవా?

గు॥—ఓయీ అటుకాదు. అంతరాత్మరూపము సూక్ష్మము. స్థూలరూపము గానుండు శరీరములు సైతము జ్ఞానదృష్టిచే స్వామికంటె వేరుకావని ముందు శ్లోకమున జెప్పబడి స్వామియొక్క సర్వవ్యాపకత్వము నుతింపబడుచున్నది. చూడుము.

శ్లో॥ త్వమర్క స్త్వంసోమః స్త్వమసిపవన స్త్వంహుతవహ
స్త్వమాప స్త్వంవ్యోమత్వముధరణిరాత్మాత్వమితిచ
పరిచ్ఛిన్నామేవంత్వయిపరిణతాబిభ్రతిగిరం ౨౬
నవిద్మస్తత్తత్త్వంవయమిహతుయత్త్వంనభవసి॥

టీ॥— ఓస్వామీ; అర్కః=సూర్యుడు, త్వం=నీవు, సోమః=చంద్రుడు, త్వం=నీవు; పవనః=వాయువు, త్వం=నీవు; హుతవహః=అగ్ని, త్వం=నీవు; ఆపః=జలము, త్వం=నీవు; వ్యోమ=ఆకాశము, త్వం=నీవు; ధరణిః=భూమి, త్వం=నీవు; ఆత్మా=ఆత్మపదార్థము, త్వం=నీవు, అసి=అగుచున్నావు, ఉ=ఇది యూహచేత దెలియదగినది; ఇతిచ=ఇటులనికూడ, ఏవం=ఈతీరున, పరిచ్ఛిన్నాం=పరిమితమైన, గిరం=మాటను, పరిణతాః=పండితులు, త్వయి=నీయందు, బిభ్రతి=ధరించుచున్నారు; వయంతు=మేమన్ననో, ఇహ=ఈజగత్తునందు, యత్=ఏది, త్వం=నీవు, నభవసి=కావో, తత్తత్వం=ఆవస్తువును, నవిద్మః=తెలియజాలము.

గు॥—మీదిశ్లోకమున సూక్ష్మరూపమును సన్నుతించి యిందు స్థూలరూపమును నుతించుచున్నాడు. అందు స్వామియొక్క అష్టమూర్తులను జెప్పి పిమ్మట వాని సర్వవ్యాపకత్వమును జెప్పుచున్నాడు.

శి॥— స్వామియొక్క అష్టమూర్తులేవి ?

గు॥—సూర్యుడు, చంద్రుడు, వాయువు, అగ్ని, జలము, ఆకాశము, పృథివి, ఆత్మ అనగా పృథివ్యాది పంచభూతములును, సూర్యుడు, చంద్రుడు, చైతన్యమును పండితులు బాగుగావిమర్శించి స్వామికివి యెనిమిదియును రూపములు అనిరి.

శి॥— ఇది సరియేనా?

గు॥—కాదు. నిక్కముగా నామరూపరహితమగు పరమేశ్వరునకు పరిమితములగు నామరూపములను గల్పించి చెప్పుట సరికాదు. అపరిచ్ఛేద్యుడవయి సర్వవ్యాపకుడవగు ఓస్వామి పండితులు ఇటుల జెప్పుచుండినను మావంటివారికి మాత్రము అన్ని నామములును, అన్నిరూపములును నీవేయని తెలియుచున్నది. నీవుకాని దొకటియును లేదు. ఈ యెనిమిదిమూర్తు లననేల? అన్ని మూర్తులును నీవె. నీకంటె భిన్నమగునది మరియొకటి మాకు తెలియదు. అని నుతి.

శి॥— అయ్యా అష్టమూర్తులని పండితులు నిర్ణయించుచున్నారని పుష్పదంతుడు అంగీకరించుచు వారు తప్పు చెప్పిరనుట యుక్తమా?

గు॥—అటులనలేదు. పుష్పదంతుడు చెప్పినది సరియే స్వామికంటె మరియొకవస్తువు

లేనే లేదు. అయినను ఈజ్ఞానము స్థిరముగా జీవులకు సామాన్యముగా గలుగనేరదు. అనేక భేదములతో నిండిన యీ ప్రపంచమునం దన్నియును పరమేశ్వరుడేయను జ్ఞానము నిరూఢజ్ఞానులకుగాని యందరికిని నిలువనేరదు తక్కినవారికి ఉపాసన సులభముగా నుండుకొరకు కొన్ని పెద్ద పదార్థములను యెంచి యవి పరమేశ్వరుడని లోకులకు జెప్పుటచేత వానియం దాబుద్ధి లోకులకు లక్ష్యముగానుండి ఆరాధన సులభముగా నుండును కావున లోకోపకారము పండితు లిటుల చెప్పిరి కాని ఈ యెనిమిది రూపములుకాక తక్కినవస్తువులు పరమేశ్వరుని కంటె వేరని తాత్పర్యముకాదు. పుష్పదంతుడు భక్తుడేకాక మహాకవియును కావున చమత్కారముగా పండితులు చెప్పునది సరికాదనునటుల పైకి చెప్పుచు చదువరుల కట్టి భ్రాంతి కలుగకుండ చేయుటకే వారు పండితులని స్పష్టముగా జెప్పెను. ఇది కవితా చమత్కారము.

మరియును అష్టమూర్తులని మాటలతో చెప్పుచున్నారు. నీవు కానిది మే మెరుగము. అని గిరంబిభ్రతి, నవిద్మః అను క్రియలు వాడబడినది. అందుల

సాగసేమి. మాటలతో చెప్పవలసివచ్చు నపుడు అనగా వ్యవహారార్థము నామ రూపములతో చెప్పక తప్పదు. అందువలన కొన్ని ప్రసిద్ధ మహాపదార్థములను నీరూపములని చెప్పితిమి. తక్కినవి నీవు కాకనికాదు. నిర్గుణబ్రహ్మము మాటలకు సాధ్యముకాదు జ్ఞానస్వరూపము కావున సమస్తమును నీవేయని యెరుగుచున్నాము. కాని నోట చెప్పనేరము అని సాగును ఈక్రియలు చెప్పుచున్నవి. ఈతీరున స్వామి సర్వవ్యాపకత్వమును నుతించెను. స్వామియొక్క రూపవర్ణనమున లీలావిలాసరూపములను, సగుణరూపములను నుతించి యిటుమీంది శ్లోకమున నామములను నుతించుచున్నాడు.

శ్లో॥ భవశ్శర్వోరుద్రః పశుపతిరథోగ్రస్సహమహాం
స్తథాభీమేశానావితియదభిధానాష్టకమిదం
అముష్మిన్ప్రత్యేకం ప్రవిచరతిదేవ శ్రుతిరపి
ప్రియాయాస్మైధామ్నే ప్రణిహిత నమస్యోస్మిభవతే॥ ౨౮

టీ॥— హే దేవ=ఓస్వామీ, భవః=భవుడు, శర్వః=శర్వుడు, రుద్రః=రుద్రుడు, పశుపతిః=పశుపతి, అథ=మరియును, ఉగ్రః=ఉగ్రుడు, సహ=ఆదేవుడును, మహాన్=మహాదేవుడు, తథా=అటులనే, భీమేశానౌ=భీముడు, ఈశానుడు, ఇతి=అని, యదభిధానాష్టకం=యేయెనిమిదినామములు (కలవో) అముష్మిన్=దీనియందు (నామాష్టకమునందు) ప్రత్యేకం=వేరువేరుగా (ఒక్కొక్కనామము ను గురించి) శ్రుతిరపి=వేదముసైతము, ప్రవిచరతి=అత్యుత్తమముగా వర్తించుచున్నది (నుతించిచెప్పుచున్నది) కావున, ప్రియాయ=మిక్కిలి సంతోషకరమగు అస్మైధామ్నే=ఈతేజస్స్వరూపముగాగల, భవతే=నీకొరకు, ప్రణిహితనమస్యః=చేయబడిన నమస్కారము కలవాడను (నమస్కారముచేసినవాడను) అస్మి=అగుచున్నాను.

గు॥— ఓస్వామీ మీదవివరించిన యెనిమిదినామములలో ఒక్కొక్కనామమే వేదముసైతము వర్ణించుచున్నది నేనెటుల నుతింపగలను. కావున నీ నామాష్టకమును

తిజేయు నీతేజోరూపమహిమమునకు నమస్కారముచేయుచున్నాను. ఇదియే నానుతిగా గైకొనుము. అనితాత్పర్యము.

శి॥— అయ్యా యీనామముల యర్థమహత్వమేమి?

గు॥—భవుడనగా జగమెవనివలన గలుగునోవాడు జగత్కారణుడు. యతోవా ఇమాని భూతాని జాయంతే అని శ్రుతి.

శర్వుడనగా ప్రళయమొనరించి భూతములను హింసించువాడు. సృష్ట్యంతమున భూతములను నాశనముచేసి తనలో గైకొనువాడు. యత్ప్రయంత్యభిసంవిశంతి అని శ్రుతి.

రుద్రుడనగా మనకు శత్రువగు నజ్ఞానమును సంసారమును బోగొట్టువాడు. యమేవైష వృణుతే తేనలభ్యః అని శ్రుతి.

పశుపతియనగా జీవులను పాలించి రక్షించువాడు. యేన జాతాని జీవంతి అని శ్రుతి.

ఉగ్రుడనగా అభక్తులకు భయంకరుడు. స్వామియొక్క దుష్ట శిక్షణాధికారము చెప్పబడుచున్నది.

మహాదేవుడనగా అందరికంటె పెద్దదేవుడు. స్వామియొక్క సర్వోన్నతత్వము సర్వోత్తమత్వము స్పష్టమగుచున్నది.

భీముడనగా జగమంతటికిని భయమునిచ్చువాడు. అనగా జగత్ప్రభువు అని భీషాస్మాద్వాతః పవతే అను మొదలగు శ్రుతులు.

ఈశానుడనగా సర్వప్రభువు భీమశబ్దము వంటిదే.

ఇటుల నామాష్టకము స్వామియొక్క సంపూర్ణతావైశ్వర్యములను నుతించెను. ఇటులనామములను సైతము నుతించి సర్వమును నీవే స్వామియను నభిప్రాయమును మరియొకతీరున ముందుశ్లోకము నుతించుచు నిక గ్రంథముయొక్క ఉపసంహారమును మొదలు పెట్టుచున్నాడు.

శ్లో॥ నమో నేదిష్ఠాయ ప్రియదవదవిష్ఠాయ చ నమో
నమః క్షోదిష్ఠాయ స్మరహర మహిష్ఠాయ చ నమో

నమో వర్షిష్ఠాయ త్రినయన యవిష్ఠాయ చ నమో
నమస్సర్వస్మై తే తదిదమతిసర్వాయ చ నమః॥

టీ॥— హే ప్రియదవ=వనమునందు ప్రీతిగల ఓశివుడా, నేదిష్ఠాయ=మిక్కిలిసమీపమందుండే, తే=నీకు, నమః=నమస్కారము, చ=మరియు, దవిష్ఠాయ=మిక్కిలిదూరమునందుండే, తే=నీకు, నమః=నమస్కారము; క్షోదిష్ఠాయ=మిక్కిలిసూక్ష్మరూపివగు, తే; నమః హేస్మరహర=ఓమన్మథాంతక, మహిష్ఠాయ=అన్నిటికంటె పెద్దవాడవగు తేనమః; హేత్రినయన=ఓముక్కంటీ; వర్షిష్ఠాయ=మిక్కిలివయస్సుమీరిన, తేనమః; చ=మరియు, యవిష్ఠాయ=మిక్కిలిపిన్నవయసునందున్నట్టి, తేనమః సర్వస్మై=సర్వస్వరూపుడవైన, తే, నమః; చ=మరియు, అతిసర్వాయ=అన్నిటినిమీరిపోయిన, తే=నీకు నమః; తత్=అది (ఈమీదచెప్పిన అన్నివిధములయిన నమస్కారమును ఇదం=ఇది (అనిచెప్పి నమస్కారము చేయుచున్నాడు).

గు॥—ఇదివరకంతయు స్వామియొక్క మహిమయు, గుణములు, నామములు, రూపములు, మొదలగునవి నుతించెను. దేశము, కాలముమాత్రము స్పష్టముగా నుతింపబడలేదు. అనగా స్వామియేచోటున నున్నాడు; ఎంతవాడు ఏకాలమందున్నవాడు. అనుప్రశ్నలను విపులముగానిందునుతింపుచున్నాడు. మొదటిప్రశ్నకుత్తరము కనుగొంటిమేని యన్నిటికంటె నాతడే మిక్కిలి సమీపమందున్నాడు. అనగామనలోనేయున్నాడు. ఎవనికినట్టుకువానికితనకంటె సమీపమందుండు వస్తువు మరియొకటిలేదుకదా; కనుగొననేరనిచో నాతనికంటె దూరముననున్నది మరియొకటిలేదు. ఇందువలన ఆతడన్నిచోటులందున్నాడని తాత్పర్యము. ఆత్మాగుహాయాం నిహితోస్య జంతోః అనిశ్రుతి.

రెండవప్రశ్నకుత్తరము. ఆతడు స్వప్రకాశుడేగాని నామరూపములుకలవాడుకాడు. రూపములేనిదాని నింత యంతయని చెప్పుటకుసాధ్యముకాదు. అట్టిదానికన్నిరూపములు చెల్లును. కావున అన్నిపరిమాణములు చెల్లును. అం

దువలన నన్నిటికంటె చిన్నవాడు. అన్నిటికంటె పెద్దవాడు అనిచెప్పబడెను. అణోరణీయాన్మహతోమహీయాన్ అనిశ్రుతి.

మూడవప్రశ్నకుత్తరము. అన్నికాలములందు నున్నవాడు. కాలమునకంటె ముందును కాలవిభాగము తెగినవెనుకసైతము నుండువాడు. కావుననే అన్నిటికంటె నెక్కువ వయసుగడచినవాడు. ఇకముందు పుట్టనివానికంటె సైతము చిన్నవాడు. అనగా శాశ్వతుడు నిత్యుడు అగు స్వామి అని తాత్పర్యము.

ఈమూడును సమష్టిచేసి యొక్కమాటలో నీవీవి మూడును కలిపి నాలవచరణమందు చెప్పెను. అన్నియు నీవే. అన్నియను భేదమునుసైతమును దాటినవాడవు నీవే అని. అనగా అన్ని అను వ్యవహారము భేదమూలము అనేకవస్తువులున్నపుడే అన్ని, కొన్ని అని యందుము. అంతేకాక ఆభేదముసైతము లేనపుడు అనగా జగత్తు సృష్టి మొదలగు కార్యములులేక నీవొక్కడవే యుండునపుడీవ్యవహారమే లేదు. కావున అతీతసర్వుడవు అని.

శి॥— అయ్యా కాలములేనికాల మున్నదా?

గు॥—ఓయీ కాలమనునది కార్యసంఘాతమునకే పేరు. దేశము, కాలము వీని స్వరూపము విపులముగా శ్రీశంకరాచార్యచరితమున జెప్పబడినది. దానిని మరచితివా సృష్టియందే దేశకాలాదిభేదముగాని సృష్టికి పూర్వమునందుగాని అనంతరమందుగాని యుండనేరదు.

ఈనుతియొక్క సాగసేమనిన ఇదివరకు జగత్తునందు కొంతకొంతగా స్వామి రూపాదులను నుతించి దీనియందు ఆతడు జగద్రూపుడు. కాలరూపుడు. జగదతీతుడు. కాలాతీతుడు అని నుతించెను. అందుచేతనే లోకమున దేనియందు నొక్కమారు కలిసియుండనేరని విరుద్ధగుణములు స్వామియందున్నవని చెప్పబడినది.

శి॥— ఇటుల జెప్పుట సందర్భమగునా?

గు॥—నిర్గుణుడగు నీశ్వరుడే జగద్రూపము నొందుటచే జగల్లక్షణములు సైత మాతనియందు వర్తించును. జగదతీతగుణము లుండనే యున్నవి. కావున రెండువిధములగు గుణములను చెప్పవచ్చును. కాని యవి యాతనియందు విలక్షణములు కావు.

మరియొకటి ఈచెప్పిన దాతని యొక్కనియందే చెల్లునుగాని మరియొకటి అట్టి వస్తువు లేదు.

శి॥— అయ్యా, ఇట్టి మహాగూఢములగు శాస్త్రార్థములందు మాటాడుచు సామాన్యములగు ప్రియదక్ష, స్మరహర, త్రినయన అను విశేషణముల నుపయోగింపనేల?

గు॥—ఈశ్వరునకు ప్రియమగు వనము జగమే. ఇదియే సంసారవృక్షము. ఊర్ధ్వమూల మధశ్శాఖమను గీతావచనమును జూడుము. ఇది యాతనికి లీల దీని సృష్టిస్థితిలయములను జేయుచుండుటచే త్రోవతెన్ను లేని మహారణ్యమువంటిది. కావున నిది సంసారారణ్యమాయెను. కావుననే స్వామికి జగమను సంసారకాంతారమందు ప్రీతియని గూఢార్థముగనే చెప్పబడినది. మరియును ఈశ్వరునకు కైలాసగిరియరణ్యములందు నివాసము కావున అందువలన సైతమిది యుచితముగనే యున్నది. ఇకను స్మరహరుడు అనుదానిని జూడుము. మన్మథుడు అనగా కాముడు. ఎచ్చటను గానరాడు. అందువలన సూక్ష్మరూపి అయినను ఆతడు లేనిది సృష్టిలేదు. అందువలన అతిస్థూలరూపి. సర్వవ్యాపకత్వాది భగవల్లక్షణ

ము లీతనియందు భ్రాంతిపడి చెప్పుదురేమో యని యట్టి భ్రాంతిని తొలగించుటకు స్మరహర యను విశేషణము సార్థకము.

త్రినయన యను విశేషము. సూర్యచంద్రాగ్నులు త్రినేత్రములు. సూర్యచంద్రులు అహోరాత్రములు అనగా కాలమును తెలియజేయును. అగ్ని సర్వభక్షకుడు. ఇదియును జగత్ప్రళయకాలమును సూచించును. కావున నీ మూడు నేత్రములును కాలస్వరూపమును దెలియచేయును. కావున జగత్తుయొక్క ఆదిమధ్యాంతకాలములు నీ యధీనములుస్వామీ అని తెలుపుట కీవిశేషణముపయోగింపబడినది. ఓస్వామీ కాలముకంటె ముందుసైతము ముండుటచేత నీవు పురాణపురుషుడవు. అంతటికంటె పురాతనుడవు. అయినను ముసలితనము నీకులేదు. కాలమువలన గలిగెడి వికారములేవియు నీకు లేవు. కావున నీవు నిత్యయౌవనుడవు. అని చెప్పుచున్నది

ఇటుల నీమూడు విశేషణములును మిగుల సొగసుగా నున్నవి.

శి॥— అయ్యా ఈసొగసులు మీరు కల్పించినవి కాని॥శ్లోకమునందున్నటుల గానరాదు.

గు॥—అటులనదగదు. శ్లోకము సాధారముచేసికొని చెప్పిన విషయములన్నియు శ్లోకమున నున్నవనియే తలచవలెను. కవి యుద్దేశించినను లేకున్నను మూలమునుండి తేలుచున్న యర్థములన్నియు నం దుద్దేశింపబడినవనియే. తలచవలయును. ఏవి తా నుద్దేశించెనో యేవి యుద్దేశించలేదో లోకమునకు జెప్పుటకు కవి యెల్లప్పుడు జీవించియుండునా! ఉండినను ప్రతివానియొద్దకేగి చెప్పుచుండునా? అతడు వ్రాసిన గ్రంథమేకదా లోకమునకు ముఖ్యము. దానినుండి గలిగెడు అర్థములన్నియు మూలమున నున్నవనియె మనము నిశ్చయించవలయును మరియును మూలగ్రంథమునకు విరుద్ధములు కాక చెప్పతగిన వన్నియును దాని సొగసులే యగును కావున భక్తులకు తప్పక గ్రాహ్యములే యగును.

అదిగాక నాలవ చరణమునందలి సర్వస్మై, అతి సర్వాయ అను విశేషణముల వలన తక్కిన చరణములందు సైతము మీద చెప్పిన విశేషణములు సార్థకముగా నుద్దేశపూర్వకముగానే యుపయోగింప బడినవని నిశ్చయము.

పుష్పదంతుడు గ్రంథము నుపసంహరింప సమకట్టి మీద ౯వ శ్లోకార్థమునిం

దుపసంహరించి యిక ముందు శ్లోకమువలన త్రిగుణాత్మకమగు కార్యవర్ణనముచే మీఁది 4వ శ్లోకార్థము నుపసంహరించుచున్నాఁడు.

శ్లో॥ బహుళరజసేవిశ్వోత్పత్తౌభవాయనమోనమో
జనసుఖకృతేసత్వోద్రేకేమృడాయనమోనమో
ప్రబలతమసేతత్సంహారే హరాయనమోనమో
ప్రమహసిపదేనిస్త్రైగుణ్యేశివాయనమోనమో॥ 30

టీ॥— ఓస్వామీ; విశ్వోత్పత్తౌ=జగత్తుసృష్టియందు, బహుళరజసే=రజోగుణాధిక్యముగలిగిన, భవాయ=భవుఁడను నామముగలనీకొఱకు, నమోనమః=అనేకనమస్కారములు; జనసుఖకృతే=లోకసంరక్షణదశయందు, సత్వోద్రేకే=సత్వగుణము యెచ్చుగాఁగల మృడాయ=మృడుఁడను నామముగలఁ నీకు, నమోనమః = అనేక నమస్కారములు ; తత్సంహారే = ఆజగత్తు నుపసంహారము చేయుదశయందు, ప్రబలతమసే= తమోగుణము అధిక

ముగాఁగల నీకు నమోనమః=అనేకనమస్కారములు; నిస్త్రైగుణ్యే=గుణరహితుఁడవైయుండుదశయందు, ప్రమహసి=సర్వోన్నతమైన తేజస్సుగల, పదే=నీధామమునందు, శివాయ=శివుఁడను నామముగలనీకు నమోనమః=అనేకనమస్కారములు;

గు॥— స్వామియొక్క నిర్గుణదశయును, సగుణదశయును గూర్చి క్లుప్తముగా నమస్కరించుచున్నాఁడు.

నిర్గుణబ్రహ్మనుతితో నారంభించి సగుణదశ విస్తరించి మరల నిర్గుణబ్రహ్మమును నుతించుచు చాలించును. సృష్టి రజోగుణము వలన గలుగును అప్పుడు స్వామికి భవుఁడని పేరు భవము అనగా పుట్టుక అదికలవాఁడు అనగా జగత్తు యొక్క ఉత్పత్తిగలవాఁడు భవుఁడు.

జగద్రక్షణము చేయుదశయందు మృడుఁడని పేరు. మృడుఁడనగా సుఖింపజేయువాఁడు అపుడు సత్వగుణమధికము.

జగత్తులయ మొనరించు దశయందు హరుఁడని పేరు. అపుడు తమోగుణమధిక

ము. జగత్తులేనపుడే గుణములులేక తేజోరూపమమాత్రము మిగులును. ఆదశ యందు శివుడనిపేరు. శివుడనగా సర్వమంగళమై నిర్వికారమగు బ్రహ్మమని యర్థము. ఇటుల సగుణనిర్గుణ స్వరూప సన్నుతి నుపసంహరించి తద్వాచియగు శబ్దముయొక్క మహిమను జెప్పి దానిని సైతము ముందు శ్లోకమున నుపసంహరించుచున్నాడు.

శ్లో॥ త్రయీంతిస్రోవృత్తీస్త్రిభువనమథోత్రీనపిసురా
నకారాద్యైర్వర్ణైస్త్రిభిరభిదధత్తీర్ణవికృతిః
తురీయంతేధామధ్వనిభిరవరుంధానమణుభిః ౨౭
సమస్తంవ్యస్తంత్వాంశరణదగృణాత్యోమితిపదం॥

టీ॥— హేశరణద=భక్తులకు శరణమగునో మహాదేవా; ఓమితిపదం=ఓమ్మనుశబ్దము త్రయీం=మూడువేదములను, తిస్రోవృత్తీః=సత్వరజస్తమములను మూడుగుణముల రూపములగు వ్యాపారములను, త్రిభువనం=స్వర్గ మర్త్య పాతాళములను

మూడులోకములను, అథ=మరియును, త్రీన్ సురానపి=బ్రహ్మ విష్ణు రుద్రులను మూడుదేవతామూర్తులను, అకారాద్యైః=అకారము మొదటగల, త్రిభిర్వర్ణైః=(అ,ఉ,మ) అను మూడువర్ణములచేతను, అభిదధత్=ధరించుచున్నది. (ఇది నీయొక్క జగత్స్వరూపమును దెలియచేయును) తీర్ణవికృతిః=వికారములను దాటినదై, అనగా వికారరహితమైన, తే=నీయొక్క, తురీయంధామ=కడపటిస్థానమును, అణుభిః=మిక్కిలిసూక్ష్మములగు, ధ్వనిభిః=ధ్వనులచేతను, (నాదములచేతను) అవరుంధానం=వ్యాపించుచున్నదయి, సమస్తం=సమష్టిరూపుడవైనట్టియు, వ్యస్తం=వ్యస్తరూపుడవైనట్టియు, త్వాం=నిన్ను, గృణాతి=నుతించుచున్నది.

గు॥—శబ్దములన్నియు వస్తువులను దెలియచేయుచు వ్యవహారయోగ్యము లగునుకదా ఇదివరకు నీయొక్క మహిమను వస్తురూపముగా నుతించితిని. స్వామీ నీవేరీతిని జగత్తునంతయు నీయందిమిడించుకొని యొకపుడు వెళ్ళగ్రక్కుచు సంరక్షించి మరల దానిని నీయందు లీనమొనరించుకొనుచున్నావో ఆతీరుననే నీకు నామమగు

ప్రణవము నీయొక్క వ్యాపకదశయందలి రూపమగుసమస్త జగమునకు నామమగుచున్నది. నీయొక్క నిర్గుణమగు దశయందలి తేజోరూపమును సైతము తెలియజేయుచున్నది. అనగా ప్రణవము నీమహిమమునకు అనురూపమగు నామము అని నామప్రాశస్త్యము నుతింపబడుచున్నది.

శి॥—అయ్యా ప్రణవమున జగత్తంతయు నెటుల జెప్పబడుచున్నది.

గు॥—ప్రణవము మూడువర్ణములుచేరి యగుచున్నది. ఆమూడు వర్ణములను వేరువేరుగా నాలోచించునపుడు మూడువేదములు, మూడుగుణములు, మూడుమూర్తులు, మూడులోకములు దెలియజేయబడుచున్నవి. ఇదియంతయు వేరువేరుగా అనగా జగత్తుయొక్క వ్యాపకరూపకము. మరల నామూడు వర్ణములనుజేర్చి యొక్క వర్ణము అనగా ప్రణవవర్ణముగా నుచ్చరించునపుడు ఆమూడువర్ణములును తమరూపములను విడిచి మరియొక రూపమును బొందుచున్నవి. అటియనే జగమంతయు వ్యాపకరూపమునువిడిచి మరియొక విలక్షణావస్థనుపొంది యర్థమగుచున్నది. మూడువర్ణములును ప్రణవమునందులీనమై యేకశబ్దముగా మిగిలియుండునటుల ఆ

వర్ణములకు అర్థమగు జగత్తంతయు నీయందు లీనమయి నీతేజోరూపము మిగిలియుండు నిన్ను దెలియజేయుచున్నది. అనగా నీనిర్గుణస్వరూపమే ప్రణవము నీవే జగత్తురూపముగా భేదమువలన నెటుల దోచుచున్నావో నీరూపమగు ప్రణవము సైతము భేదమువలన మూడువర్ణములుగా దోచుచున్నది. అయినను నీకంటె జగత్తునిక్కముగా భిన్నవస్తువుకాదు. అటులనే ఆమూడువర్ణములును ప్రణవముకంటె భిన్నములుకావు. దాని యవయవములే.

ఇందువ్యస్తం, వ్యష్టి, జగత్తు, జగత్కార్యము, వ్యాప్యము, ప్రవృత్తి సగుణము మొదలగు పదములు సమానార్థకములు సమస్తం, సమష్టి, లయము, జగత్కారణము, వ్యాపకము, నివృత్తి, నిర్గుణము, తురీయము మొదలగు పదములన్నియు సృష్టికార్యములేని శుద్ధ బ్రహ్మమును జెప్పును.

ఈరెండురూపములును ప్రణవము చెప్పును. ప్రణవము నొకటేవర్ణముగా భావించినపుడు నిర్గుణబ్రహ్మమును భోధించును. దాని యవయవములగు మూడువర్ణములను వేరువేరుగా భావించునపుడు జగద్రూపమును దెలియజేయును.

భా॥—అత్యా సూక్ష్మములగు ధ్వనులచే ప్రణవము భగవంతుని తురీయరూపమెట్లుల సూచించుచున్నది.

గు॥—ఓయీ యిది మిగుల కఠినమగునది. రహస్యము, ఉపాసనాభాగము మాటలతో చెప్పుటకసాధ్యము. అది యుపాసకు లనుభవముచేతనే తెలియతగినది. ఆయుపాసనకు గృహస్థులకధికారములేదు. సన్యాసులకు మాత్రమేకలదు. శాస్త్రజ్ఞానముకొరకైన సర్వజనసామాన్య సాధ్యములగు పుస్తకములందు బాహాటముగా వ్రాయ ననువుకాదు. గురూపదేశమువలనను చిరకాలాభ్యాసమువలననే తెలియవలయును. ఇదికాక ప్రణవస్వరూపమును మాటలతోనైనను దెలియుటకు యోగశాస్త్రము, మంత్రశాస్త్రము, వేదాంతశాస్త్రము యీమూడింటి సాంప్రదాయములు కొంతదెలిసిననేగాని బోధకురాదు. కాలక్రమమున నధికారముకలిగి యెరుంగగలవు.

ఇటుల గ్రంథమును పుష్పదంతుడు ఉపసంహారముచేసెను. ఇందుగ్రంథారంభమున జెప్పబడిన నిర్గుణబ్రహ్మమును నుతించి ఉపసంహరించెను. ప్రతిగ్రంథ

మునందును ఉపక్రమోపసంహారములు ముఖ్యములు. అదిక్రమముగాలేనిచో నాగ్రంథమెంతగొప్పదియైనను ఆదరణీయముకాదు.

ఇకముందుశ్లోకమున స్వామినినుతించుటవలని ఫలమును జెప్పుచున్నాడు.

శ్లో॥ వపుఃప్రాదుర్భావాదనుమితమిదం జన్మనిపురా
పురారేనక్వాపిక్షణమపిభవంతం ప్రణతవాన్
నమన్ముక్తస్సంప్రత్యహమతనురగ్రేప్యనతిమా
న్మహేశక్షంతవ్యం తదిదమపరాధద్వయమపి॥

టీ॥— హేపురారే=ఓశరీరత్రయసంహారకుడా (ముక్తిదాతా), పురాజన్మని=పూర్వజన్మమునందు, క్వాపి=యెందును (యేజన్మమునందైనను), క్షణమపి=ఒక క్షణమైనను, భవంతం=నిన్ను, ప్రణతవాన్=నమస్కరించువాడను, న=కాను; ఇదం=ఈఅంశము, వపుఃప్రాదుర్భావాత్=శరీరము యిపుడుండుటవలన, అనుమితం=ఊహచే నిశ్చయింపబడినది; సంప్రతి=ఇపుడు, నమన్=నీకునమస్క-

రించుచు, అహం=నేను, ముక్తః=ముక్తుడ నగుచున్నాను. (అందువలన) అతనుః=శరీరములేనివాడను. (కావున) అద్యాపి=ఇటుమీదను అనగా నీజన్మానంతరమున అనతిమాన్=నమస్కారముచేయనివాడను (అగుచున్నాను), ఇతి=అనునట్టి, తదిదమపరాధద్వయమపి=ఆయీరెండు తప్పులను, ఈశ=ఓప్రభువా, క్షంతవ్యం=క్షమింపతగినది.

గు॥— స్వామికి నమస్కరించుటవలని ఫలము మోక్షమేయని యిందు చమత్కారముగా జెప్పబడినది. ఎటులనిన, ఓస్వామీ, ఇప్పుడు నీకు నేను నమస్కరించి ముక్తుడ నగుచున్నాను. ఇదివరకెన్నడును నీకు నమస్కరింపలేదు. ఇకముందు నమస్కరింపను. ఏలననిన, ఇంతకుముందు జన్మములం దెన్నడైన నీకు నమస్కరించి యుంటినేని యిదివరకే ముక్తుడనై యుందును. మరల జన్మము నాకు రాకపోవును. అటులగాక యీజన్మమువచ్చుటచేత ముక్తి రాలేదనియే నిశ్చయము ముక్తిరాకుండుటచేత ముక్తికి సాధనమగు నీకు నమస్కారముచేసి యుండలేదని యూహించక తప్పదు. కావుననే నిదివర కెన్నడు నిన్ను

మ్రొక్కకుండుటచేతనే ముక్తుడనుకాక శరీరధారణమొనరించుచు సంసారమున దిరుగుచున్నాను. అదృష్టవశమున నిపుడు నీకు నమస్కరించుచున్నాను. కావున ప్రారబ్ధము ననుభవించి యీశరీరము పోయినతోడనే నీకొనరించిన నమస్కారమునకు ఫలమగు మోక్షము నాకు చేకూరును. కావున మరినాకు జన్మము గలుగదు. మరియెటుల నీకు నమస్కరింప గలుగుదును. కావున నిటుమీద మరి నిన్ను నమస్కరించుట కవకాశము లేదు. ఇటుల నిదివరకు నీకు మ్రొక్కలేదు. ఇటుమీద మ్రొక్కడముండదు. నీకు మ్రొక్కకపోవుట తప్పు. కావున నేనొనరించు నీరెండు తప్పులను మన్నింపుము. అని చమత్కారముగా జెప్పబడినది. ఫలితార్థమేమనిన నీకు నమస్కరించుటవలన ముక్తి లాభించునని.

శి॥— అయ్యా! పురారే అను సంబుద్ధి యుచితముగా నున్నదా?

గు॥—మిక్కిలి యుచితము. పురమనగా శరీరము చెప్పవలయును. ఈశ్లోకమున త్రిపురాసురులని సామాన్యార్థము చెప్పరాదు.

శరీరమునకే నవద్వారపురమని పేరు. స్థూలసూక్ష్మలింగశరీరములు మూడును

త్రిపురములు. ఇవి త్రిపురాసురులవలె బాధించుచున్నవి. ముక్తివలన అన్ని శరీరములును నశించి జీవుడు బ్రహ్మస్వరూపమును బొందును. కావున పురారియనగా శరీరత్రయమును నాశముచేయువాడు. అనగా మోక్షప్రదాతయని యర్థము. ఈశ్లోకమున మోక్షము ప్రసంగించబడుచుండుటచేత నీయర్థమె చెప్పవలయును. మరియు శిక్షించుటకును క్షమించుటకును అధికారముగలవాడే ప్రభువు అందువలననే ఈశ అను సంబోధనముసయితము సారస్యముగా నున్నది.

ఈశ్లోకము కొన్ని దేశముల ప్రతులందు గానరాదు అయినను కల్పన, శైలి, భక్తి వీనినిబట్టి యీగ్రంథమున నుండదగినది. కొన్ని దేశముల ప్రతులందున్నది. అందుచేత నిది గ్రంథములోనిదేయని నానిశ్చయము.

ఇకను. గ్రంథారంభమున 2, 3వ శ్లోకములలో వేదములు సైతము నుతింపజాలనంత అనంత అతర్క్య మహామహిమను కలవాడవు స్వామీ యను నంశమును ముందుశ్లోకమున నుపసంహరించు చున్నాడు.

శ్లో॥ అసితగిరిసమంస్యాత్కజ్జలంసింధుపాత్రే
సురతరువరశాఖాలేఖినీపత్రముర్వీ
లిఖతియదిగృహీత్వాశారదాసర్వకాలం ౩౨
తదపితవగుణానామీశపారంనయాతి॥ ౩౧

టీ॥— హే ఈశ=ఓప్రభువా, సింధుపాత్రే=సముద్రమను పాత్రయందు, అసితగిరిసమం=కాటుకకొండంత, కజ్జలం=కాటుకమడ్డియు. సురతరువరశాఖా=కల్పవృక్షముయొక్క మంచికొమ్మ, లేఖినీ=కలమును (ఘంటము) ఉర్వీ=భూమి, పత్రం=వ్రాయుటకు కాకితమును, స్యాత్=అగును, (వీనిని) గృహీత్వా=సంగ్రహించి, శారదా=సరస్వతీదేవి, సర్వకాలం=ఎల్లకాలము (కాలభేదమున్నంతవరకు) లిఖతియది=వ్రాయుచున్నను, తదపి=అప్పటికిని, తవగుణానాం=నీగుణములయొక్క, పారం=అంతమును, నయాతి=పొందదు.

గు॥—పుష్పదంతుడు తనస్తోత్రగ్రంథమును సమాప్తిచేయుచు తాను చాలించుచున్నాను

గాని స్తోత్రమొనరింపవలసిన విషయమనగా స్వామి గుణమహిమము మిగియ నేరదని చెప్పుచున్నాడు. ఇటుల గ్రంథారంభమున జెప్పినదాని నిచ్చట నుప సంహారము చేయుచున్నాడు. ఓస్వామీ నీవిభుత్వము అతర్క్యమని మీద 5వ శ్లోకమున జెప్పబడిన యర్థమును వేదములు సయితము నుతింపజాలవను 2వ శ్లోకార్థము నుపసంహారింపబడు చున్నది.

ఇట్టిదాని నేలనుతించు చున్నావను ప్రశ్నకు సమాధానము మీద 1, 3వ శ్లోకములందు జెప్పబడినది. దాని నీతనువాతి శ్లోకమునం దుపసంహారించు చున్నాడు.

శ్లో॥ కృశపరిణతిచేతః క్లేశవశ్యంక్వచేదం
క్వచతవగుణసీమోల్లంఘినీశశ్వదృద్ధిః
ఇతిచకితమమందీకృత్యమాంభక్తిరాధాత్
వరదచరణయోస్తేవాక్యపుష్పోపహారం॥ 31

టీ॥— హేవరద=ఓస్వామీ; కృశపరిణతి=క్షీణించుటయే అంతముగా గలదియును, క్లేశవశ్యం=దుఃఖాధీనమైనదియు అగు, ఇదంచేతః=ఈనాచిత్తము, క్వ=ఎక్కడ; చ=మరియును, శశ్వత్=ప్రతిక్షణమందును, గుణసీమా=గుణములయొక్క హద్దును, ఉల్లంఘినీ=దాటిపోవునదియగు, (వర్ణింపశక్యముకానిదగు నీనిర్గుణస్వ రూప మహోన్నతియనుట) తవబుద్ధిః=నీమహిమ, క్వ=ఎక్కడ, ఇతి=అని (ఈసంగతిదెలిసి) చకితం=భయమునొందిన, మాం=నన్ను, భక్తిః=నీయందలి భక్తి, అమందీకృత్య=మందుడను (భయమునొందినవాడను) కాకుండజేసి తే=నీయొక్క, చరణయోః=పాదములందు, వాక్యపుష్పోపహారం=(పుష్పము లవంటిమాటలు) నవాక్కులు అనగా శ్లోకములను పుష్పములతో బూజను (కానుకను) ఆధాత్=కల్పించెను.

గు॥—పుష్పదంతుడు గ్రంథము నుపసంహరించుచున్నాడు. ఓస్వామీ దుఃఖవశమయి యెల్లపుడు క్షీణించుచుండుటయే స్వభావముగాగల నాస్వల్పబుద్ధియెక్కడ అనుక్షణ మెచ్చుచు యూహింపశక్యముకాని నీమహిమయెక్కడ. అనగా నాకూ

హింపనైనను సాధ్యముకాదు. అందువలన నిన్ను నుతించుటకు నేను భయపడు చుంటిని కాని నీయందలి భక్తి నాభయమును బోగొట్టి యుత్సాహమునిచ్చి యానీస్తోత్రమను పుష్పపూజను నాచేతచేయించినది అనగా భక్తిప్రేరితుడనై నుతించుచున్నానుగాని నేనుచెప్పినది నీవు సంతసించునంత గొప్పతనముకలదికాదు. నేను పవిత్రుడనగుదునని నుతించుచున్నానను 1, 3వ శ్లోకముల యర్థమిందు పసంహరించుచున్నాడు. ఇకముందుశ్లోకమున తానురచించిన యీశ్లోకరూపమగు పూజను స్వామిప్రీతికొరకు అర్పణ జేయుచున్నాడు.

శ్లో॥ ఇత్యేషావాఙ్మయీపూజా శ్రీమచ్ఛంకరపాదయోః
అర్పితా తేనదేవేశః ప్రీయతాం మేసదాశివః॥ (౪౦)

టీ॥— ఇతి=ఈప్రకారముగా, వాఙ్మయీ=భాషా (శ్లోక) రూపమగు, ఏషాపూజా=ఈపూజ, శ్రీమచ్ఛంకరపాదయోః=భగవంతుడగు శంకరునిపాదములందు, అర్పితా=సమర్పించబడినది, తేన=ఆపూజచేత, దేవేశః=దేవదేవుడైన, సదాశివః=సదాశివుడు, మే=నాకు (నాయందు) ప్రీయతాం=సంతోషించుగాక (అనుగ్రహించుగాక)

(11)

గు॥—ఈరీతిగా శ్లోకరూపమున శ్రీశంకరుని పాదములను బూజించితిని. నాపూజవలన దేవేశుడగు సదాశివుడు సంతసించి నన్ను ననుగ్రహించుగాక అనియీకృతిని శివునకు సమర్పించెను. ఈయనుగ్రహము ఈనుతినంగీకరించుటయే. మొదటిశ్లోకమునందలి విషయమును యిందుపసంహారముచేసి గ్రంథమును పుష్పదంతుడు సమాప్తి నొందించుచున్నాడు.

ఇకముందుశ్లోకమునతాను యీస్తోత్రము శ్లోకరూపముగా భక్తిచేత చేసితినని పుష్పదంతుడు చెప్పుచున్నాడు.

శ్లో॥ అసురసురమునీంద్రై రర్చితస్యేందుమౌళే
ర్గ్రథితగుణమహిమ్నో నిర్గుణస్యేశ్వరస్య
సకలగుణవరిష్ఠః పుష్పదంతాభిధానో 33
రుచిరమలఘువృత్తైః స్తోత్రమేతచ్చకార॥ ~~3౪~~

టీ॥— అసురసురమునీంద్రైః=అసురులు, సురలు మునీశ్వరులు వీరలచేతను, అర్చిత

స్య = పూజింపబడినట్టియు, నిర్గుణస్య = స్వభావముచే గుణరహితుడైనట్టియు, గుణమహిమ్నః = భక్తానుగ్రహార్థమంగీకరింపబడినగుణములరూపమునదెలుపుచుచే యుచున్న మహిమగలిగినట్టియు, ఈశ్వరస్య = నిర్గుణావస్థయందు సర్వప్రభుడైనట్టియు, ఇందుమౌళేః = సగుణావస్థయందు చంద్రశేఖరరూపమునొందినట్టియు శివునియొక్క, ఏతత్ స్తోత్రం = ఈనుతిని, అలఘువృత్తైః = గంభీరార్థములుగల శ్లోకములతో, రుచిరం = మనోహరముగా, సకలగుణవరిష్ఠః = అన్నిగుణములచే శ్రేష్ఠుడగు (అనగామహాభక్తునికి అన్నియు మంచిగుణములుండును గావున మహాభక్తుడగు) పుష్పదంతాభిధానః = పుష్పదంతుడను పేరుగలవాడు, చకార = చేసెను.

గు॥— ఆయా అలఘువృత్తములనుట యిపుడు తెలిసినదికదా వానియందెంతెంత గంభీరార్థమున్నదో యిదివరకు చెప్పిన దానివలన నూహింపవచ్చును.

ఇది గ్రంథసమాపకశ్లోకము ఇకమీద శ్లోకమున తనయనుభవముచేత స్వామియొక్క మహిమోన్నతి తెలిసికొని యాతని శరణము వేడుకొంటినని చెప్పుచున్నాడు.

శ్లో॥ కుసుమదశననామా సర్వగంధర్వరాజః
శశిధరవరమౌళే ర్దేవదేవస్య దాసః
సగురునిజమహిమ్నో భ్రష్ట ఏవాస్య రోషాత్
స్తవనమిదమకార్షీ ద్దివ్యదివ్యం మహిమ్నః॥ 32

టీ॥ — సర్వగంధర్వరాజః = సకలగంధర్వులకును రాజును, శశిధరవరమౌళేః = చంద్రశేఖరుడైన. దేవదేవస్య = దేవదేవునియొక్క, దాసః = దాసుడై నట్టియు, కుసుమదశననామా = పుష్పదంతుడను పేరుగల వాడు, అస్యరోషాత్ = శివునికోపమువలన, గురు, నిజ, మహిమ్నః = గొప్పదియగు, తన, మహిమమునుండి, భ్రష్టఏవ = (పూర్తిగా) చెడినవాడేయయి, మహిమ్నః = స్వామిమహిమయొక్క, దివ్యదివ్యం = మిక్కిలిపవిత్రమగు, ఇదం స్తవనం = ఈస్తోత్రమును అకార్షీత్ = చేసెను.

గు॥— ఒకప్పుడు పుష్పదంతుడను గంధర్వరాజు స్వామియాగ్రహముచే తనవిభవము

న గోలుపోయి బుద్ధితెచ్చుకొని మహాభక్తుడై స్వామిమహిమమును యీగ్రంథ రూపమున నూహించి మరలస్వామియనుగ్రహము నొందెను. కష్టములువచ్చినపుడే కదా తనయశక్తియు భగవంతుని మహిమమును గర్వితునకు దోచును.

తనయనుభవముచేత జ్ఞానముకలిగి మహేశునికంటే వేరుదైవము లేదని ముం దుశ్లోకమున చెప్పుచున్నాడు.

శ్లో॥ మహేశాన్నాపరోదేవో మహిమ్నో నాపరాస్తుతిః 3 ౫
అఘోరాన్నాపరోమంత్రో నాస్తితత్వంగురోఃపరం॥

టీ॥— మహేశాత్=మహేశ్వరునికంటె, అపరందేవః=శ్రేష్ఠుడైన మరియొక దేవుడు, న=లేదు; మహిమ్నః=ఈమహిమాస్తోత్రముకంటె, అపరా=శ్రేష్ఠమగు, మరియొక, స్తుతిః=స్తోత్రము, న=లేదు, అఘోరాత్=శాంతమగు శివమంత్రముకంటె, అపరఃమంత్రః=శ్రేష్ఠమగు మరియొకమంత్రము, న=లేదు. గురోః పరం=గురునికంటె శ్రేష్ఠమగు, తత్వం=పరమాత్మ, నాస్తి=లేదు.

గు॥—మహేశ్వరుడే సర్వోత్తమదేవుడు. మహిమ్నస్తోత్రమె సర్వోత్తమస్తోత్రము. అఘోరమంత్రమె సర్వోత్తమమంత్రము. గురువే పరమాత్మ.

ఇటుల జెప్పబడిన మహిమ్నస్తోత్రపఠనపారాయణములవలని ఫలమును జెప్పు చు ముందుశ్లోకమున పఠనమువలన స్వామి సంతసించునని చెప్పుచున్నాడు.

శ్లో॥ శ్రీపుష్పదంతముఖపంకజనిర్గతేన
స్తోత్రేణకిల్బిషహరేణ హరప్రియేణ
కంఠస్థితేన పఠితేన సమాహితేన
సుప్రీణితో భవతిభూతపతి ర్మహేశః॥ 3 ౬

టీ॥— శ్రీపుష్పదంతముఖపంకజనిర్గతేన=శ్రీపుష్పదంతునియొక్క ముఖకమలమునుండి వెలువడినట్టియు, హరప్రియేణ=శివునకు ప్రియమైనట్టియు, కిల్బిషహరేణ=పాపహరమగునట్టియు, కంఠస్థితేన=కంఠపాఠముచేయబడినట్టియు, సమాహితేన పఠితేన=శుద్ధచిత్తముగలవానిచే పఠింపబడినట్టియు, స్తోత్రేణ=ఈ మహిమ్న

స్తోత్రముచేత, భూతపతిః=సర్వభూతములకు (జగత్తునకు) అధిపతియగు, మహేశః=శివుఁడు, సుప్రీణితః=మిక్కిలి సంతోషించు వాఁడు, భవతి=అగుచున్నాఁడు.

గు॥—ఈ స్తోత్రము పాపహారమగునది. సమాహితచిత్తుఁడైన మనుజుఁడు పఠించెనేని శంకరుఁడు సంతసించునని స్తోత్రపఠన ఫలము.

స్వామి సంతసించుటవలన పాఠకుని తన సన్నిధిలో నుంచుకొనునని ముందు శ్లోకమున జెప్పుచున్నాఁడు.

శ్లో॥ సురవరమునిపూజ్యం స్వర్గమోక్షైకహేతుం
పఠతియదిమనుష్యః ప్రాంజలిర్నాన్యచేతాః
వ్రజతిశివసమీపం కిన్నరైస్తూయమానః
స్తవనమిదమమోఘం పుష్పదంతప్రణీతం॥ 37

టీ॥— సురవరమునిపూజ్యం=శ్రేష్ఠులగు దేవతలును, మునులును, బూజించునట్టియు,

స్వర్గమోక్షైకహేతుం=స్వర్గమును మోక్షమును బొందుటకు సాధనమైనట్టియు, పుష్పదంతప్రణీతం=పుష్పదంతునిచే రచింపబడినట్టియు, అమోఘం=సఫలమగునట్టియు, ఇదం స్తవనం=ఈస్తోత్రమును. మనుష్యః=మనుష్యుఁడు, నాన్యచేతాః=ఇతరమందు చిత్తములేనివాఁడయి (తదేకధ్యానముతో) ప్రాంజలిః=చేతులు జోడించుకొన్నవాఁడయి, పఠతియది=పారాయణ మొనరించెనేని, కిన్నరైః=కిన్నరులచేత, స్తూయమానః=స్తోత్రముచేయబడుచున్నవాఁడయి, శివసమీపం=ఈశ్వరసన్నిధానమును, వ్రజతి=పొందుచున్నాఁడు.

గు॥—ఇది స్తోత్రపఠనఫలమును జెప్పుచున్నది. ఈస్తోత్రపారాయణము శివసాన్నిధ్యము నిచ్చును. ఇటుల పఠనమాత్రఫలమును జెప్పి నిత్యపారాయణఫలమును ముందు శ్లోకమున జెప్పుచున్నాఁడు.

శ్లో॥ అహరహరనవద్యం ధూర్జటేస్స్తోత్రమేతత్
పఠతిపరమభక్త్యా శుద్ధచిత్తఃపుమాన్యః (38)

ప్రభవతిశివలోకేరుద్రతుల్యస్తథాత్ర
ప్రచురతరధనాయుః పుత్రవాన్కీర్తిమాంశ్చ॥ 3౮ ~~32~~

టీ॥—అహరహః,=దినదినమును, ధూర్జటేః=శివునియొక్క, ఏతత్=ఈ, అనవద్యం=పవిత్రమైన, స్తోత్రం=స్తోత్రమును, పరమభక్త్యా=మిక్కిలిభక్తితో, శుద్ధచిత్తః=పరిశుద్ధినొందినచిత్తముగలవాడై, యః పుమాన్=ఏపురుషుడు, పఠతి=పఠించుచున్నాడో, సః=ఆపురుషుడు, అత్ర=ఇక్కడ (ఈలోకమునందు), ప్రచురతర=ప్రకటనమైన, ధన=ధనమును, ఆయుః=ఆయువును, పుత్రవాన్=పుత్రులు గలవాడును, చ=మరియు, కీర్తిమాన్=కీర్తిమంతుడును, భవతి=అగుచున్నాడు, తథా=ఆరీతినే, శివలోకే= (శరీరత్యాగానంతరము) శివలోకమునందు, రుద్రతుల్యః=శంకరునితో సమానుడు, భవతి=అగుచున్నాడు.

గు॥—మహిమ్నస్తోత్రమును నిత్యయుక్తుడై పఠించువానికి ఫలమును ఈశ్లోకము జెప్పుచున్నది.

ఇటుల నిత్యపారాయణఫలమును జెప్పి స్తోత్రము సర్వోత్తమమని యొక్క మాటతో గ్రంథమున ముందుశ్లోకమున మంగళాచరణమును చేసి ముగించుచున్నాడు.

శ్లో॥ దీక్షాదానంతపస్తీర్థం జ్ఞానంయోగాదికాః క్రియాః
మహిమ్నస్తవపాఠస్య కళాంనార్హంతిషోడశీం॥ 3౯ ~~౩౦~~

టీ॥— దీక్షా=యాగాదికర్మదీక్షయు, దానం=దానమును, తపః=తపస్సును, తీర్థం=తీర్థసేవయు, జ్ఞానం=శాస్త్రజ్ఞానమును, యోగ=యోగమును, ఆదికాః=మొదలగునట్టి, క్రియాః=క్రియలు, మహిమ్నస్తవపాఠస్య=మహిమ్నస్తోత్ర పాఠముయొక్క, షోడశీంకలాం=పదియారవభాగమునకైనను, నార్హంతి=తగవు.

గు॥—మహిమ్నస్తోత్రపఠనమహిమ మిందు చెప్పబడినది. ఇదియే గ్రంథసమాపక మంగళాచరణము. సర్వోత్తమమనుటకంటె నెక్కుడు మంగళాచరణ మింకొకటి లేదు. సామ్రాజ్యంభోజ్యమ్మను మంగళవాచకార్థ మతిక్లుప్తముగా నిందు చెప్పబడినది.

క॥ కృతికర్తకు గృతిభర్తకు
గృతిహర్తకు నిత్యసుఖుఁడు నిజుఁగాక జగ
త్కృతికరణభరణహరణ వి
కృతులకు నంటకయె వెలుఁగు కృతిశంకరుఁడున్॥

ఇది జిల్లేపల్లి హనుమన్తరాయకృతమగు
శ్రీశివమహిమ్నస్తోత్ర విజ్ఞానము
సమాప్తము.

శ్రీగౌరీనాగేశ్వరార్పణమస్తు.

క॥ కృతికర్తకు గృతిభర్తకు
గృతిహర్తకు నిత్యసుఖుఁడు నిజుగాక జగ
త్కృతికరణభరణహరణ వి
కృతులకు నంటకయె వెలుగు కృతిశంకరుఁడుర్వి॥

ఇది జిల్లేపల్లి హనుమన్తరాయకృతమగు
శ్రీశివమహిమ్నస్తోత్ర విజ్ఞానము
స మా ప్త ము.

శ్రీగౌరీనాగేశ్వరార్పణమస్తు.